
# చిన్నారి సిరి

- నిషిగంధ



శ్రీ
కౌముది
మీ ముంగిళ్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 10



ఇంతకీ నేనెవరంటే...

అందరికీ నమస్కారం .. మరేమో నా పేరు సిరి, థర్డ్ క్లాస్ ‘బి ‘సెక్షన్. ఇంకానేమో.. నాకు ఒక తమ్ముడు, నాని. వాడు సెకండ్ క్లాస్ ‘బి ‘సెక్షన్.. అమ్మ పేరు లక్ష్మి, స్కూల్లో టీచర్ . కానీ మేము చదివే స్కూల్లో కాదు..

నాన్న పేరు రాజేంద్ర, పోస్ట్ ఆఫీసులో పని చేస్తారు. అమ్మానాన్నలకి నేనూ నానీ అంటే చాలా ఇష్టం. ‘సిరి తల్లీ ‘ ‘నాని బంగారూ ‘ అని ఎప్పుడూ మా చుట్టూనే ఉంటారు..కానీ హోం వర్క్ సరిగ్గా చేయకపోయినా, పరీక్షల్లో మంచి మార్కులు రాకపోయినా నాన్నకి నచ్చదు.. అలానే, ఇంట్లో వస్తువులు ఎక్కడివక్కడ పెట్టకపోయినా, డబ్బులు వృధా చేసినా అమ్మకి కోపం .. వాళ్ళకి ఇష్టం లేని పనులు చేయడం మాకూ ఇష్టం ఉండదు. నేనెక్కువ మాట్లాడతానని అమ్మ ఎప్పుడూ ముద్దుగా విసుక్కుంటుంది. అమ్మానాన్నకి పని ఉండి వాళ్ళతో మాట్లాడటానికి కుదరనప్పుడల్లా ఇలా వచ్చి మీతో కబుర్లు చెప్తానేం ! సరేనా? అమ్మో..స్కూలు టైమౌతోంది..బై..

# విషయసూచిక





| | |
|---|---|
| బొజ్జ గణపయ్య | 4 |
| ఉప్పెనగాలి | 7 |
| పెద్దత్త-పద్మత్త | 10 |
| కిడ్డీబాంక్ | 13 |
| చిన్నత్తవాళ్ళ వూరు | 17 |
| అడిగి తెలుసుకో | 23 |
| క్రికెట్ వీరుడు | 28 |
| ఇంటా-బయటా | 33 |
| అమ్మ ఒక బొమ్మ నాన్న ఒక బొమ్మ | 39 |
| ఏది పెద్ద తప్పు | 43 |
| చాలా నేర్చుకోవాలి | 50 |

# బొజ్జ గణపయ్య

ఇంటికి రాగానే స్కూల్ బాగ్ నా స్టడీ టేబుల్ పక్కనే పెట్టుకుని, స్కూల్ డ్రెస్ మార్చుకుని నెమ్మదిగా అమ్మ దగ్గరికి వెళ్ళి అడిగాను..

"అమ్మా,టెన్ రూపీస్ ఇవ్వవా.. రంగ తాత కొట్టుకెళ్ళి కలర్ పెన్సిల్స్ , చార్ట్స్ తెచ్చుకుంటాను"..

అమ్మ కారప్పూస గిన్నె చేతికిస్తూ "ఇప్పుడర్జంటుగా అవెందుకే? అయినా నీ పెన్సిల్స్ ఇంకా ఉన్నాయిగా!" అంది..

"అది కాదమ్మా.. రేపు మా మూడో తరగతి అన్ని సెక్షన్‌లకి కలిపి డ్రాయింగ్ పోటీలు పెడుతున్నారు. నేను బొమ్మలు బాగా వేస్తానని అంటావుగా. అందుకే నా పేరు ఇచ్చా. ఈ రాత్రికి హోంవర్క్ చేసుకున్నాక ముందు గీసుకుని ప్రాక్టీసు చేసుకుంటానమ్మా' అని ఆపి తన వంక చూస్తుంటే అమ్మ వేసిన ఇంకో ప్రశ్న గుర్తొచ్చి "నా కలర్ పెన్సిల్స్ లో చాలా కలర్స్ అయిపోయాయమ్మా" అని చెప్పాను.

"సరే అయితే.. కారప్పూస తినేసి వెళ్ళు.. నానీని తోడు తీసుకు వెళ్ళటం మర్చిపోకు.. మిగిలిన చిల్లర జాగ్రత్తగా తీసుకు రా" అంటూ ఒకదాని తర్వాత ఒకటి చెప్తూ అమ్మ పది రూపాయలు చేతిలో పెట్టింది.

అబ్బా! అమ్మెప్పుడింతే! రెండో తరగతి చదివే తమ్ముడు నాకు తోడేంటి అసలు!! అదే తను అల్లానికీ , నాన్న పేపర్‌కీ వాడిని కొట్టుకి పంపేటప్పుడు అక్కని తోడు తీసుకెళ్ళు అని ఎందుకు చెప్పదు!? కారప్పూస గబగబా తింటూ అనుకున్నా. నానీ, పక్కింటి రేఖలతో వెళ్ళి కావలసినవి తెచ్చుకున్నా. రేఖ కాసేపు ఆడుకుందామన్నా నా పోటీలసంగతి చెప్పి వచ్చేశాను..

హోంవర్క్ అంతా పూర్తి చేసి, పెన్సిళ్ళు, వైట్ పేపర్ ముందేసుకుని ఆలోచించటం మొదలుపెట్టాను, ఏ బొమ్మ వేయాలా అని. డ్రాయింగ్ కి వచ్చే సుభద్ర టీచర్ ఎప్పుడూ అంటారు, నేను వంపులు బాగా గీస్తానని..

"ఏంటి సిరి తల్లీ అవన్నీ పెట్టుకుని కూర్చున్నావు?" నాన్న అడిగిన ప్రశ్నకి అమ్మ సమాధానం లోపలినించి వినిపించింది

"మీ అమ్మాయికి రేపు స్కూల్లో డ్రాయింగ్ పోటీలంట!".

"అవున్నాన్నా, నా బెస్ట్ ఫ్రెండ్ క్రాంతి కూడా పేరిచ్చింది"

ఉత్సాహంగా చెప్పాను.

"నీకు బొమ్మలు వేయడం వచ్చు కదా.. ఇంకేమి, తప్పకుండా ప్రైజ్ వస్తుంది" అని తలనిమిరి లోపలికి వెళ్ళారు.. చెప్పొద్దూ , నాకింకా ఉత్సాహం వచ్చింది..

మంచి బొమ్మ వేయాలి అనుకుంటూ చుట్టూ చూస్తుంటే ఎదురుగా గోడకి తగిలించిన నాకిష్టమైన దేవుడు, గణపయ్య కాలెండర్ కనిపించింది.. హయ్యా! గణపయ్య బొమ్మ వేస్తే ఎలా ఉంటుంది!? అసలే దేవుడి బొమ్మ.. పైగా అమ్మ ఎప్పుడూ అంటుంది 'ఆయనంటే అందరికీ ఇష్టం .. ఏ పని చేసిన ముందు ఆయన్నే ప్రార్ధిస్తారు' అని.. సుభద్ర టీచర్ పుస్తకం మొదటి పేజీలో "ఓం గణేశాయ నమః" అని రాసి ఉండటం కూడా చూశాను.. ఇంకా నాకు తొండం గీయడం బాగా వచ్చు కదా.. తప్పకుండా గణపయ్య బొమ్మ గీస్తాను అని ప్రాక్టీసు చేయడం ప్రారంభించాను..

మధ్యలో నాన్న వచ్చి "ఏ బొమ్మ సెలెక్ట్ చేసుకున్నావు తల్లీ" అనడుగుతూ నేను గీస్తున్న బొమ్మని చూసి నవ్వి వెళ్ళిపోయారు.. పడుకునే లోపల మూడు సార్లు గీసుకుని, క్రాంతి ఏ బొమ్మ గీస్తుందో అనుకుంటూ నిద్ర పోయాను..

"సిరి పాపా, నీ పుస్తకాల సంచి జారిపోతుంది..సరిగ్గా లోపలకి సర్దుకుని కూర్చోమ్మా" రిక్షా అబ్బాయి సాంబయ్య అరిచిన అరుపుకి

ఉలిక్కిపడి చూశాను. మా రిక్షా పిల్లలందరూ ఇంటి కెళ్ళిపోతున్నామనే ఆనందంతో గోలగోల చేస్తున్నారు. అవును కదా, వీళ్ళెవరికీ నాకు వచ్చిన కష్టం రాలేదుగా!! వెంటనే భలే ఏడుపొచ్చింది.. నేను డ్రాయింగ్ పోటీల్లో ఓడిపోయానని చెప్తే పక్కింటి అమ్మాయి రేఖ ఎంత ఎక్కిరిస్తుందో!? అనవసరంగా పది రూపాయలు పాడు చేసానని అమ్మ తిడుతుంది. అన్నిటికీ మించి తనకి ఫస్ట్ ప్రైజ్ వచ్చిందని క్రాంతి ఇక నించీ సరిగ్గా మాట్లాడుతుందో లేదో!! తల్చుకుంటుంటే అసలు పోటీల్లో పేరు ఎందుకు ఇచ్చానా అనిపిస్తుంది..

ఫస్ట్ పీరియడ్ లోనే పోటీలని చెప్పి బొమ్మలు వేసే వాళ్ళందరినీ దూరం దూరంగా కూర్చోబెట్టి వేయించేశారు.. క్లాసుకొచ్చాక క్రాంతి చెప్పింది తను మొక్కలు, పక్షులు, ఆడుకుంటున్న పిల్లలు, గడ్డి మేస్తున్న ఆవులు, ఇంకా పైన సూర్యుడిని వేసానని. పైగా సూర్యుడిని కాస్త నవ్వుతున్నట్టు గీశానని కూడా అంది. ఓ అంతేనా అనుకున్నా.. అయినా సూర్యుడు నవ్వడమేమిటి అనిపించింది!! అప్పుడింకా అనిపించింది నాకు తప్పకుండా ప్రైజ్ వస్తుందని.. తీరా చూస్తే లాస్ట్ పీరియడ్‌లో సుభద్ర టీచర్ వచ్చి ఫస్ట్ ప్రైజ్ క్రాంతికి వచ్చిందని చెప్పారు.. సెకండ్ ప్రైజ్ ఇంగ్లీష్ మీడియం 'ఎ ' సెక్షన్ అబ్బాయికీ, థర్డ్ ప్రైజ్ 'డి ' సెక్షన్ అమ్మాయికీ వచ్చిందన్నారు.. అసలు నేను గణపయ్యని చాలా బాగా గీశాకదా!! మంచి మంచి కలర్స్ కూడా వేశాను.. లడ్డూ ప్రసాదాలు చేతిలో ఒకటి, తొండం వంపులో ఒకటీ కూడా గీశాను.. గణపయ్య వాహనం ఎలుక లడ్డూ కొరికి తింటున్నట్టు, ఇంకా టైం ఉందని అటూ ఇటూ తామర పూలు కూడా గీశాను.. మరి నాకెందుకివ్వలేదు!?

ఇంక నేనెప్పుడూ పోటీల్లో పేరివ్వను.. ఈ టీచర్లకి ఎవరికి ఇవ్వాలో, ఎవరికి ఇవ్వకూడదో అస్సలు తెలీదు.. క్రాంతి నాకంటే పొడుగు.. అందుకే నాకంటే పెద్దదని, అన్నీ బాగా తెల్సని అనుకున్నారు.. ఇంకా తను పాటల పోటీల్లో కూడా పేరిచ్చింది కదా. అందుకే తనకే ఇచ్చేసినట్టున్నారు. ప్చ్! పది రూపాయలు పాడు చేశాను..

రిక్షా దిగుతూనే గుమ్మంలో ఉన్న అమ్మ చెప్పింది

"నీకిష్టమని ఇప్పుడే పరమాన్నం వండాను.. డ్రెస్ మార్చుకుని రా పెడతాను"..

మనసులో భయం భయంగా ఉంది ఎప్పుడు పోటీల గురించి అడుగుతుందో అని. పరమాన్నం గిన్నెలో పోసి ఫాన్ ముందు ఆ-రబెడుతూ అంది, "కాస్త వేడిగా ఉందమ్మా.. ఒక్క రెండు నిమిషాలు ఆగు". పాపం అమ్మ స్కూల్లో టీచర్ కదా, పొద్దున్నించీ స్కూల్లో పాఠాలు చెప్పొచ్చి నా కోసం పరమాన్నం చేసింది.. అమ్మ చాలా మంచిది. తనని ఏమీ అనదు.. అయినా ఇంకా అడగలేదేంటీ!?

"అంత పరధ్యానం ఏమిటే! అసలైతే పరమాన్నం చూస్తే పరుగులు పెడుతూ వచ్చేదానివిగా!!" అమ్మ అడుగుతోంది.

అదిగో! నాకు మళ్ళీ కళ్ళల్లో నీళ్ళు వస్తున్నాయి!

"ఏమైంది సిరీ? వంట్లో బాలేదా?" అమ్మ దగ్గరకు తీసుకునే సరికి నాకు పెద్దగా ఏడుపు వచ్చేసింది.. వెక్కిళ్ళు పెడుతూ చెప్పాను.

"డ్రాయింగ్ పోటీల్లో నాకు ప్రైజ్ రాలేదమ్మా.. క్రాంతికి ఫస్ట్ వచ్చింది.. ఈ సారి నా పుట్టినరోజుకి చాక్లెట్లు కొనద్దు.. నువ్విచ్చిన పది రూపాయలు వేస్టు చేశానుగా.. "

"ఊరుకోమ్మా.. మళ్ళీ పోటీల్లో నీకే వస్తుందిలే" అమ్మ సముదాయిస్తుంటే దూరం జరిగి చెప్పాను,

"ఉహూ .. నేనింక ఏ పోటీల్లో పేరివ్వను"..

తర్వాత కొత్త కలర్ పెన్సిల్స్, మిగిలిన చార్ట్స్ నానీకి ఇచ్చేశా. వాడు సంతోషంగా యాపిల్ , గాలిపటం గీసుకుంటుంటే నేను హోం వర్క్ చేసుకుంటున్నా..

అంతలో నాన్న వచ్చీ రావటం తోనే "సిరి తల్లీ నీకు ఏ ప్రైజ్ వచ్చిందమ్మా" అని ప్రశ్న అడిగారో లేదో, నానీ గాడు నా పోటీల వివరాలన్నీ గడగడా చెప్పేశాడు.. నాకు భలే కోపం వచ్చింది వాడి మీద!

అమ్మ వచ్చి "ఇంక ఏ పోటీల్లో పాల్గొనదంట" అని నేను చెప్పిందే నాన్నకి చెప్పింది..

నాన్న, నిన్న నా బొమ్మని చూసి నవ్వినట్లే మళ్ళీ నవ్వి లోపలికి వెళ్ళిపోయారు.. నాకు ఇంత బాధేస్తుంటే అలా నవ్వుతున్నారేంటి? నాకు ఇంకాస్త దిగులేసింది..

కాసేపాగి నాన్న వచ్చి వాలుకుర్చీలో కూర్చుని 'సిరితల్లీ ఇలా రామ్మా' అని పిల్చారు. పోటీల్లో ఓడిపోయానని తిడతారేమో అనుకుంటూ వెళ్ళాను. దగ్గరికి వెళ్ళగానే తన వళ్ళో కూర్చోబెట్టుకుని "వారం క్రితం ఆదివారం నాడు నా దగ్గరకి వచ్చి నీకు మన జామచెట్టు ఎక్కడం వచ్చిందని చెప్పావు కదా, ఎలా వచ్చింది?" అనడిగారు.

ఇప్పుడు దాని గురించి ఎందుకు అడుగుతున్నారో అనుకుని

"ఆరోజు అనిల్ అన్నయ్య వచ్చాడుగా.. తనే నాకు, నానీకి నేర్పించాడు" చెప్పాను.

"మరి ఇద్దర్లో ఎవరికి ముందు వచ్చింది ఎక్కడం?" నాన్న ఇంకో ప్రశ్న అడిగారు.

"నానీకే నాన్నా.. వాడు టక్కున నేర్చేసుకున్నాడు. నేను వాడికంటే పొడుగున్నానా అయినా కానీ రెండు సార్లు జారిపోయాను. అప్పుడు ఎక్కడెక్కడ కాలు పెట్టాలో అనిల్ అన్నయ్యని సరిగ్గా అడిగి నేర్చుకున్నాను" కాస్త ఉత్సాహంగా చెప్పాను..

"మరి నేను గాలిపటం ఎగరేయటం నేర్పించినప్పుడు ఎవరు ముందు నేర్చుకున్నారు?" మళ్ళీ అడిగారు. "నాకే!! నానీ కి అసలు పట్టుకోవడం కూడా రాలేదు" పక్కన బిక్కమొహం వేసుకుని చూస్తున్న నానీ గాడిని చూస్తూ ఈసారి ఇంకాస్త ఉత్సాహంగా చెప్పాను..

అప్పుడు నాన్న నుదుటిమీది నా వెంట్రుకలను సర్దుతూ చెప్పడం మొదలుపెట్టారు

"మరి మీ స్కూల్లో జరిగిన పోటీలు కూడా ఇలాంటివేనమ్మా. కాకపోతే ఇంట్లో జరిగాయి కాబట్టి ఇక్కడ ప్రైజులుండవు.. అక్కడ స్కూల్లో ప్రైజులిస్తారు. ఒక్కోసారి మొదటిసారే ప్రైజ్ వస్తుంది. ఇంకొన్నిసార్లు రెండు మూడు సార్లు ప్రయత్నిస్తే వస్తుంది. అదంతా నీకున్న ఆసక్తి మీద ఆధారపడి ఉంటుందమ్మా. నాకెందుకు రాదు అని పట్టుదలతో ప్రయత్నించావనుకో తప్పకుండా వస్తుంది. కావలిస్తే దానికి అమ్మని, నన్ను, ఇంకా మీ టీచర్లని, ఫ్రెండ్స్ ని ఎవరినైనా అడిగి సలహాలు తీసుకో, అచ్చు చెట్టు ఎక్కడానికి అనిల్ అన్నయ్యని ఎలా అడిగావో అలా!"

నాకు ఎందుకో ఇప్పుడు ఏడుపు రావడం లేదు. హాయిగా అనిపిస్తుంది. శ్రద్ధగా వినడం మొదలుపెట్టాను.

"ఇంకో విషయం , కలర్ పెన్సిల్స్ కోసం తీసుకున్న పది రూపాయల గురించి పూర్తిగా మర్చిపో.. అమ్మ, నేను ఏది చేసినా మీకోసమే కదా" అనునయంగా చెప్తూనే " లేదా, నిన్ను అది ఇంకా వదల్లేదంటే ఇంకోరకంగా నువ్వు బదులు తీర్చొచ్చు, మళ్ళీ పోటీల్లో నీ పేరిచ్చి ప్రైజ్ గెలవడం ద్వారా" అంటూ నవ్వారు.. నాకెందుకో ఈ రెండో విధానమే నచ్చింది.. అదే నాన్నతో చెప్పి చక్కగా పోయి పడుకున్నాను..

మరుసటి ఉదయం స్కూల్ గేట్ నించీ లోపలికి వస్తుంటే 'సిరీ!' ఎవరో నన్ను పిలుస్తున్నట్లు అనిపించి వెనక్కి చూశా.. క్రాంతి!! తన పుస్తకాల బాగ్, లంచ్ బాగ్ రెండూ సర్దుకోలేక పరిగెత్తుకుంటూ వస్తోంది.. తను దగ్గరికి వచ్చీ రాగానే వగరుస్తూ

" సిరీ, నాకొకటి కావాలి ఇస్తావా" అంది..

కాస్త సందేహిస్తూనే "ఏంటి" అనడిగా..

"నిన్న నువ్వు గీసిన గణేష్ స్వామి బొమ్మ నాకివ్వవా. ఎంత బాగా గీశావో అసలు!! నా పుస్తకాల బాగ్ లో పెట్టుకుంటాను. మా అమ్మ

ఎప్పుడు పరమాన్నం చేసినా నీకు తెస్తానుగా" ఆత్రంగా అడిగింది.. ఇంకా జారిపోతున్న తన లంచ్ బాక్స్ ని పట్టుకుంటూ

"ఓ అలాగే! అది ఇంకా నా బాగ్ లోనే ఉంది" అని నవ్వుతూ చెప్పి, క్లాస్ వైపు నడుస్తూ అనుకున్నా, 'ఇవాళ సుభద్ర టీచర్ దగ్గరకి వెళ్ళి అడగాలి నేను వేసిన బొమ్మలో ఏమి తప్పు ఉందో!? ఇంకా ఎలాంటి బొమ్మలు గీయాలో!!'..

# ఉప్పెనగాలి

"సిరీ, ఇంక లేమ్మా టైం అవుతుంది" ఎక్కడినించో అమ్మ గొంతు వినబడుతుంటే కొంచెం కొంచెంగా మెలకువ వస్తున్నట్లు అనిపిస్తోంది..

కాలికి చల్లగాలి తగలటంతో ఒళ్ళంతా ఒక్కసారి ఝల్లంది.. వెంటనే దుప్పటి సరిగ్గా లాక్కుని ఇంకాస్త ముడుచుకుని పడుకున్నా..

"ఇందాకేగా నేను పడుకుంది.. అప్పుడే అమ్మ లేవమంటుందేమిటీ!? .. ఇది కలేలే' అనుకుని హాయిగా నిద్రలోకి వెళ్ళిపోబోతున్నా..

"ఎన్ని సార్లు చెప్పాలి నిద్ర లేవమనీ!" ఈ సారి చాలా దగ్గరగా వినిపిస్తే ఠక్కున కళ్ళు తెరిచి చూశా.. చుట్టూ తెల్లని వెలుతురు.. 'అయ్యో, అప్పుడే పొద్దున్నే పోయిందే' అనుకుంటూ "అమ్మా, ఇంకొంచెంసేపు పడుకుంటానమ్మా" బ్రతిమాలుతున్నట్లు అడిగాను..

అమ్మ మాత్రం "లేదు తల్లీ ఇప్పటికే లేట్ అయింది.. చూడు నీకంటే చిన్నాడైనా వాడు అప్పుడే లేచి, పళ్ళు కూడా తోముకుని పాలు తాగుతున్నాడు!"

అంటూ పొద్దున్నే నానీగాడిని పొగడటం మొదలుపెట్టింది.. అంతే! నానీ మీద ఎంత కోపం వచ్చిందో.. 'అస్సలు వీడిని ఇంత తొందరగా లేవమని ఎవరు చెప్పారు!' అనుకుంటూ లేచి నా దుప్పటి మడతపెట్టడం మొదలు పెట్టాను..

అలానే నెమ్మదిగా తయారయ్యి స్కూల్ కి బయలుదేరాను.. రిక్షాలో వెళుతుంటే ఎగ్జిబిషన్‌గ్రౌండ్స్ దగ్గరకి రాగానే అనుకోకుండా అక్కడ ఉండే గుడారాల వైపు చూశాను.. ఇవాళ ఏంటో అక్కడంతా హడావిడిగా ఉంది.. వాళ్ళ బట్టలు, సామానులు అనుకుంటా మూటలు, గోనెసంచులలో ఒకచోట పెద్ద కుప్పలా ఉన్నాయి.. 'ఏం చేస్తున్నారో వీళ్ళు!!' అని సాంబయ్యని అడిగాను.. సాంబయ్య తలతిప్పి అటువైపు చూడకుండానే రిక్షా తొక్కుతూ చెప్పాడు, "వినాయకచవితి అయిపోయింది కదా పాపా.. పని కోసం ఇంకో ఊరికి వెళ్తున్నారు"..

'అవునా' అనేసి ఊరుకున్నా కానీ కాస్త దిగులుగా అనిపించింది.. వినాయకచవితికి రెండు నెలల ముందు అనుకుంటా ఒకరోజు స్కూల్ కెళుతుంటే హఠాత్తుగా గుడ్డలతో వేసిన చిన్న చిన్న గుడారాల్లాంటి ఇళ్ళు కనిపించాయి.. అద్దాలు కుట్టిన బట్టలు వేసుకుని, పూసల దండలు వేసుకుని ఉన్న ఆడవాళ్ళని చూస్తే వేరే దేశం నించి వచ్చినట్లు అనిపించింది. సాంబయ్యే చెప్పాడు వీళ్ళు వినాయకుని బొమ్మలు చేసి అమ్ముతారని.. నేను ఇంట్లో పూజలో పెట్టుకునే గణపయ్య బొమ్మలనుకుని అమ్మతో చెప్పా ఈసారి కొత్తవాళ్ళు చేసే బొమ్మలు కొందామని..

అమ్మ 'చూద్దాం లేవే' అంది.. కానీ తర్వాత చూస్తే వాళ్ళు చేసేవి బోల్డంత పెద్ద విగ్రహాలు!! అవి వీధుల్లో వేసే పందిళ్ళలో పూజలోకంట!!

ముందు అదేదో పిండితో తెల్ల గణపయ్యని చేసారు.. తర్వాత చక్కగా రంగులు వేసి వరుసగా పెట్టారు.. పెద్దవాళ్ళతో పాటు చిన్నపిల్లలు కూడా బల్లల మీద నిలబడి రంగులు వేసేవాళ్ళు.. అలా పండగ వెళ్ళేవరకూ రోజూ వాళ్ళని, వాళ్ళు చేసే గణపయ్యలని చూడటం

బావుండేది.. అయ్యో ఇప్పుడు వెళ్ళిపోతే బోసిగా ఉంటుందేమో.. సాయంత్రం ఇంటికొచ్చేప్పుడు చూస్తే ఒక్కటి తప్ప మిగతా గుడారాలన్నీ మాయమయ్యాయి!! 'ఇంత తొందరగా ఎలా పీకేశారో.. ఈ ఒక్క గుడారం ఎందుకు వుండిపోయిందో' అనుకున్నా..

ఇంకోరోజు చూస్తే గుడారం దగ్గర నా అంతే ఉన్న ఒకమ్మాయి అటూ ఇటూ పరిగెడుతూ ఉంది.. వాళ్ళ అమ్మ అనుకుంటా ఒకావిడ బయట వంట చేస్తోంది.. తర్వాత ఇంకోరోజు బయట నులక మంచం మీద ఇంకా నిద్రపోతోంది.. ఒకసారి ఏవో చిన్న చిన్న బొమ్మలు పెట్టుకుని ఆడుకుంటోంది.. ఆ రోజు రాత్రి అమ్మానాన్నతో చెప్పాను ఆ అమ్మాయి గురించి.. "ఎంత హాయి అమ్మాయికి.. నాలా పొద్దున్నే లేవక్కర్లేదు.. రోజూ స్కూల్ కి వెళ్ళక్కర్లేదు.. ప్రతినెలా పరీక్షల కోసం కష్టపడి చదవక్కర్లేదు.. అదేపనిగా ఆడుకోవచ్చు" అని.. ఇద్దరూ ఒకేసారి గట్టిగా నవ్వేసి "చాల్లే ఇంక చదువుకో యూనిట్ టెస్ట్‌లు దగ్గరకి వస్తున్నాయి" అన్నారు..

'ఈపాటికి అమ్మాయి చక్కగా వాళ్ళ నాన్నతో కథలు చెప్పించుకుంటుందేమో' అనుకుంటూ నీరసంగా పుస్తకాల బాగ్ తీశాను..

"ఇవాళ మన కోస్తా ప్రాంతానికంతా తుఫాను హెచ్చరిక జారీ చేశారండీ" పొదున్నే పాలు తాగుతూ అమ్మ నాన్నతో చెబుతుంటే విన్నా.. 'తుఫానంటే పెద్ద వర్షమే కదమ్మా?' అప్పుడెప్పుడో రేఖ చెప్పింది గుర్తుకొచ్చి అమ్మని అడిగా.. "అవును.. కానీ వర్షం తోపాటు ఈదురుగాలులు కూడా వీస్తాయి" అని అంటుంటే నాన్న పక్కనించి అడిగారు "మరి స్కూల్సు గురించి ఏమీ చెప్పలేదా?"...

"లేదండీ.. తుఫాను ఇవాళ రాత్రికెప్పుడో తీరం దాటుతుందంట.. బహుశా రేపు సెలవు ఇస్తారేమో" అంది అమ్మ..

సెలవు అన్నమాట చెవిన పడగానే నాకు నానీకి తెగ హుషారు వచ్చి స్కూల్‌కి గబగబా రెడీ అయిపోయాం .. 'రేపు సెలవు ' అని మా టీచర్ చెబుతున్నట్టు ఊహించుకుంటేనే భలే సంతోషంగా అనిపించింది.. కానీ ఆ రోజు మధ్యాహ్నానికే మమ్మల్ని పంపేసారు.. సాంబయ్యకు తెలీదు గా అందుకే నేను, నానీ కలిసి నడుచుకుంటూ వచ్చేశాము ఇంటికి.. మేమెళ్ళిన కాసేపటికి అమ్మ, ఎప్పుడూ వచ్చే టైం కంటే ముందుగానే నాన్న కూడా వచ్చేశారు.. అందరూ అలా తొందరగా ఇంటికి వచ్చేయడం .. రేపు స్కూల్ లేకపోవటంతో నాకు భలే బావుంది.. అమ్మ పకోడీలు చేయడం మొదలుపెట్టింది..

పకోడీల ప్లేట్ ఇస్తూ అమ్మ నాన్నతో "గాలి అప్పుడే బాగా వీస్తోంది.. రాత్రికెప్పుడో రావచ్చు అన్నారు కానీ అంతకుముందే తుఫాను మొదలవ్వచ్చు" అంది.. అలానే బయట నీళ్ళ పంపు దగ్గర బకెట్లు, తొట్టి మీద పెట్టే రేకుమూత లాంటి వస్తువులన్నీ ఇంట్లోకి తేవటం మొదలుపెట్టింది..

"ఇవన్నీ ఎందుకమ్మా లోపల పెడుతున్నావు" నానీ అడుగుతున్నాడు..

"గాలికి దొర్లిపోకుండా, ఎగిరిపోకుండా రా" అని

అమ్మ అంటుంటే మధ్యలో వాడు "మరి మెట్ల కింద పెట్టిన నా క్రికెట్ బాట్ కూడా ఎగిరిపోతుందా?" అని కొంచెం భయంగా అడిగాడు.. "బాట్ ఏంట్రా ఈ గాలికి పెంకుటిళ్ళ పైకప్పులు, గుడిశెలు, పెద్ద పెద్ద చెట్ల లాంటివే తట్టుకోలేవు" అమ్మ చెబుతుంటే పకోడీలోంచి జాగ్రత్తగా పచ్చిమిరపకాయ తీస్తున్న నాకు ఎగ్జిబిషన్‌గ్రౌండ్స్ లో ఉన్న ఒకేఒక్క గుడారం గుర్తొచ్చింది.. 'అమ్మో! అయితే వాళ్ళ ఇల్లు గాలికి ఎగిరిపోతుందేమో' అనుకుంటుంటేనే చాలా భయం వేసింది.. నాన్నని అడిగితే "అవునమ్మా అలాంటివి అసలు ఆగవు" అన్నారు..

వెంటనే నేను "పాపం వాళ్ళకి ఇల్లు లేకపోతే వర్షం పడుతుంటే ఎక్కడ ఉంటారు నాన్నా?? మన ఇంటికి తీసుకొద్దామా పోనీ" అన్నాను..

ఎక్కడో ఉన్నదల్లా అమ్మ నా ముందుకొచ్చి "ఏంటీ?" అనడిగింది.. నాన్నతో చెప్పిందే మళ్ళీ చెప్పాను.. "బయట చూశావా మబ్బులు ఎలా కమ్ముకున్నాయో.. గాలి ఎలా వీస్తుందో.. ఇలాంటప్పుడు ఎవరు బయటకెళ్ళరు.. అయినా వాళ్ళు ఈపాటికే ఎక్కడికో ఒకచోటికి వెళ్ళి ఉంటారులే" అనేసింది..

"వాళ్ళకి రేడియో లేదుగామ్మా.. తుఫాను అని ఎలా తెలుస్తుంది? వాళ్ళ చుట్టాలందరూ వేరే ఊరికి ఎప్పుడో వెళ్ళిపోయారుగా, ఇంకెవరి దగ్గరికి వెళ్తారు? నా అంత  పాప ఉంది వాళ్ళకి.. తనకి కూడా నాకులా భయం వేస్తుందేమో?" దిగులుగా చెబుతుంటే అమ్మ నాన్న నా వంకే అలా చూస్తుండిపోయారు..

నాన్న  వెంటనే "నేవెళ్ళి వాళ్ళు ఉన్నారో లేదో చూసొస్తా" అని గొడుగు తీసుకెళుతుంటే అమ్మ "జాగ్రత్తండి" అంటూ గుమ్మం వరకూ వెళ్ళింది..

నాన్న తలుపు తీయగానే గాలి చాలా వేగంగా లోపలికి తోసుకొచ్చి పకోడీల ప్లేట్ పక్కనే ఉన్న మంచినీళ్ళ గ్లాస్ ఒరిగిపోయింది..

నాకు ఒక్కసారే చాలా భయం వేసి అమ్మని గట్టిగా పట్టుకున్నా.. ముగ్గురం నాన్న కోసం చూస్తూ కొవ్వొత్తులు, అగ్గిపెట్టె, టార్చ్‌లైట్ లాంటివన్నీ దగ్గరగా పెట్టుకున్నాము.. ఇంతలో నాన్న  గుడారంలో ఉండేవాళ్ళని తీసుకొచ్చారు..  అమ్మాయి, వాళ్ళ అమ్మా నాన్న అనుకుంటా ముగ్గురు వచ్చారు.. అమ్మ వాళ్ళని వసారా పక్కనే ఉన్న మెట్లగదిలో కూర్చోమని చెప్పి వస్తుంటే నాన్న చెప్పారు "వీళ్ళు మన సిరి అన్నట్లే అక్కడే ఉన్నారు.. మన భాష సరిగ్గా రాదు.. తుఫాను, మన ఇంటికి రమ్మని చెప్పటం కష్టమైంది నాకు.. వాళ్ళతోపాటు వాళ్ళ సామానులు కూడా తెచ్చుకోమన్నాను.. ఏవో 2,3 మూటలు తెచ్చారు"..

అమ్మ ఒక గిన్నెలో పకోడీలు వేసి వాళ్ళకి ఇచ్చి రమ్మంది.. వాళ్ళ దగ్గరికి వెళ్తే ఆ అమ్మాయి నా వంకే చూస్తోంది.. నేను నవ్వాను.. తను వాళ్ళ అమ్మ వైపు చూసి ఇంకాస్త ముడుచుకుని కూర్చుంది.. 'పాపం ఇంకా భయం వేస్తుందేమో' అనుకుంటూ వచ్చేశాను..

రాత్రి అమ్మ వాళ్ళకి అన్నం పెట్టి ఏదో మాట్లాడి వచ్చి నాన్నతో చెబుతోంది.. "వాళ్ళు హిందీ ఏదో యాసలో మాట్లాడుతున్నారు.. ఆ–మెకి తెలుగు కొంచెం అర్థం అవుతుంది..
అతనికి అస్సలు రాదంట.. వీళ్ళ తండా వాళ్ళు వెళ్ళేటప్పుడు ఇతనికి బాగా సుస్తీ చేసి వెళ్ళలేక ఆగిపోయారంట.. ఇప్పుడు వెళ్దామంటే ప్రయాణ ఖర్చులకి అస్సలు డబ్బుల్లేవంట.. భాష రాకపోవటంతో ఎవరూ ఏ పని ఇవ్వటం లేదంట..రోజూ తిండికి కూడా గడవటం లేదంట.. ఈ మధ్య పోలీసు వాళ్ళొచ్చి అక్కడనించి వెళ్ళిపొమ్మంటున్నారంట".. అదంతా వింటుంటే '
'అయితే ఆ అమ్మాయి సరిగ్గా అన్నం కూడా తినటం లేదా! తర్వాత ఇల్లు కూడా ఉండదా?" బాగా జాలేసింది..

'కానీ ఎందుకలా?' ఏదో అడగాలని నాన్న దగ్గరికి వెళ్ళా..

"నాన్నా, వాళ్ళు నీలా, అమ్మలా ఉద్యోగం ఎందుకు చేయరు?" అంటున్న నా వంక  చూసి అమ్మ చిన్నగా నవ్వుతూ "వాళ్ళకి ఉద్యోగాలు ఎవరిస్తారే!" అంది..

"ఏం ? ఎందుకివ్వరు?" నాకేమీ అర్థం కాలా.. "వాళ్ళకేమి చదువు ఉందని ఉద్యోగాలు ఇస్తారు" అంటున్నా అమ్మని ఆపుతూ నాన్న "సిరి తల్లీ ఉద్యోగం రావాలంటే చదువుకోవాలి.. డిగ్రీ తెచ్చుకోవాలి.."

"మరిప్పుడు చదువుకుని డిగ్రీ తెచ్చుకోవచ్చుగా?" నేనంటే,

అమ్మ "లేదమ్మా డిగ్రీ రావడానికి కొన్ని సంవత్సరాలు కష్టపడాలి.. అసలు ఒక్క ఉద్యోగానికే కాదు ఏదన్నా వ్యాపారం లాంటి పనులు చేయాలన్నా ఎన్నో విషయాలు తెలిసి ఉండాలి.. అంటే చదువుకుని ఉండాలి"..

వెంటనే నేను "చదువుకుంటే రోజూ తినడానికి అన్నం , ఇంక మన ఇల్లు లాంటిది వుంటాయా" అని నేనడుగుతుంటే నాన్న దగ్గరికి తీసుకుని "ఇవే కాదమ్మా మంచి బట్టలు కొనుక్కోవచ్చు.. నీకిష్టమైన సైకిలు కొనుక్కోవచ్చు.. మంచి మంచి ఊర్లు చూడొచ్చు.. ఇలా ఇంకా ఎన్నో చేయచ్చు.. నువ్వు కానీ తమ్ముడు కానీ ఎంత బాగా చదివితే అంత మంచి సౌకర్యాలు వస్తాయి" అని చెప్పారు..
' గుడారం లోని అమ్మాయి పొద్దున్నే లేవక్కర్లేదు.. పరీక్షల కోసం చదవక్కర్లేదు అని బాధపడేదాన్ని.. ఇప్పుడు తెల్సింది  అమ్మాయికి పాపం తినడానికి అన్నం కూడా లేదని.. నాకలా ఉండాటం అస్సలు ఇష్టం లేదు.. అమ్మా నాన్నా చెప్పింది విని చక్కగా చదువుకుంటా..' అనుకుంటూ నానీని పిల్చాను 'స్పెల్లింగ్ గేం' అడదాం రా ' అని..

మరుసటిరోజు పుస్తకాల బాగ్ క్లీన్ చేసుకుంటుంటే నాన్న గొంతు వినిపించింది.. "వాళ్ళకి టికెట్లు కొనిద్దాము, వాళ్ళ తండాకి వెళ్ళేందుకు"..

" ఊరేదో సరిగ్గా కనుక్కోండి" అమ్మ అంటోంది..!

# పెద్దత్త - పద్మత్త

మధ్యాహ్నం అన్నాలు అవ్వగానే నేనూ, నానీ మంచం మీదకి చేరిపోయి అమ్మ కోసం చూడటం మొదలుపెట్టాం .. ప్రతి ఆదివారం మధ్యాహ్నం భోజనం అవ్వగానే అమ్మ మా ఇద్దరి మధ్యా పడుకుని ఎదో ఒక కథ చదవటమో, చెప్పడమో చేస్తుంది.. అలా అమ్మ చెప్పే కథ వింటూ నిద్రలోకి వెళ్ళిపోతాము.. "అమ్మేదీ ఇంకా రాలేదు" నానీ అడుగుతుంటే వెనక వంటగది వైపు నించి ఎవరివో మాటలు వినబడ్డాయి.. అంతే! నానీ మంచం మీద నించి డింగ్ మని ఒక్క దూకు దూకి అటువైపు పరిగెత్తాడు.. వెంటనే తిరిగొచ్చి 'రేఖా వాళ్ళ అమ్మగారక్కా" అనగానే నేను కూడా దిగేసి వెళ్ళాను.. అమ్మా, ఆంటీ పెద్ద పెద్ద గిన్నెలు, పిండి, ఇంకా ఏవేవో ముందు పెట్టుకుని హడావిడిగా ఉన్నారు.. నానీ చిన్నగా "అమ్మా.." అని పిల్చాడు.. అమ్మ తిరిగి మా వంక చూసి "నాకివాళ కథ చెప్పటానికి కుదరదు.. వెళ్ళి మీ నాన్న గారిని అడగండి" అని మళ్ళీ ఆంటీతో మాటలు మొదలుపెట్టేసింది..

ఇద్దరం నాన్న పక్కన చేరి పోయాము.. "అమ్మెందుకు ఇంకా పని చేస్తుంది?" నానీ ప్రశ్న వినగానే నాన్న "ఎందుకంటే మీ పెద్దత్తయ్య ఒక నాలుగు రోజుల కోసం వచ్చే బుధవారం మనింటికి వస్తుంది.. అందుకే అమ్మ పిండి వంటలు చేస్తుంది" అని చెప్పారు.. "మరి కల్పనక్క, బాబన్న?" వెంటనే నేనడిగాను.. "కల్పనక్క వస్తుంది.. బాబన్న మామయ్యతోపాటే ఉండిపోతాడు" అని నాన్న చెప్పగానే ఈసారి కల్పనక్క చేత ఏమేమి నేర్పించుకోవాలా అనుకుంటూ ఉండిపోయాను.. పోయినసారి వచ్చినప్పుడు కొబ్బరాకులతో బొమ్మలు చేయడం, లెక్కలు తేలికగా చేయడం నేర్పించింది.. అంతే కాక గోరింటాకు చాలా బాగా పెట్టింది.. అది చూసి కాంతి ఈసారి తను కూడ పెట్టుంచుకుంటానంది..

అప్పటినించీ అమ్మ ఏదో పని చేస్తూ హడావిడి పడుతూనే ఉంది.. మా చేత మా పుస్తకాలు, బొమ్మలు, లాంటివన్నీ సర్దించింది.. అన్ని మంచాల మీదకి ఉతికిన దుప్పట్లు వేసింది.. అల్మరా పై అర నించి కొత్త అన్నం పళ్ళాలు, మంచి నీళ్ళ గ్లాసులు, ఇంకా ఉతికిన టవల్స్ కూడా తీసి పక్కన పెట్టింది.. ఎక్కడన్నా కాగితం లాంటివి కనబడితే మమ్మల్ని వెంటనే "ఇల్లు ఇలా ఉంటే మీ పెద్దత్త ఏమనుకుంటుంది" అంటూ కసిరేది.. 'మన అత్తేగా ఏమనుకుంటుంది!? అయినా అప్పుడొకసారి పిన్ని బాబాయి వచ్చినప్పుడు అమ్మ ఇలా ఏమీ అనలేదే!?

'పెద్దత్త వస్తూనే "ఏంటమ్మా బుజ్జి అంత సన్నబడిపోయావు.. కాస్త ఛాయ కూడా తగ్గింది" అంటూ నన్ను వళ్ళో కూర్చోబెట్టుకుంది.. "ఇదిగోనే బుజ్జి నీ కోసం పట్టు లంగా తెచ్చాను.. నీకీ రంగు నచ్చిందా?" అని అడుగుతూ లంగా నా చేతికిచ్చింది.. నాకు అది భలే నచ్చింది..

"మీకెప్పుడూ అది సన్నగానే కనిపిస్తుంది వదినా.. అయినా పోయినసారి వచ్చినప్పుడు మువ్వల పట్టీలు తెచ్చారు.. మళ్ళీ ఈ లంగా ఎందుకు చెప్పండి" అంటూ అమ్మ కాఫీ కప్ అత్త చేతికిచ్చింది.. పెద్దత్త ఒక్కతే నన్ను 'బుజ్జి' అని పిలుస్తుంది.. నాలో తన పోలికలు ఎక్కువ ఉంటాయని నేనంటే పెద్దత్తకి ఇష్టమని నాన్న ఎప్పుడూ చెప్తారు.. అత్త కాఫీ తాగుతుంటే నేను నెమ్మదిగా వడిలోంచి దిగి కల్పనక్క తో ఆడుకుంటానికి వెళ్ళాను..

వాళ్ళున్న రోజులన్నీ చాలా బాగా అయిపోయాయి.. మేము, అమ్మ ఒక్క రోజే స్కూల్ కి వెళ్ళాము.. తర్వాత గుడ్ ఫ్రైడే, సెకండ్ సాటర్ డే, సండే అన్నీ కలిపి వచ్చాయి.. ఒకరోజు ఎగ్జిబిషన్‌కి, ఇంకో రోజు కనదుర్గ అమ్మవారి కొండకి, ఇంకో రోజు ఎవరో చుట్టాలింటికి వెళ్ళాము.. అప్పుడే నాలుగు రోజులు అయిపోయి అత్త వాళ్ళు వెళ్ళడానికి బట్టలు సర్దుకుంటుంటే నేను పక్కనే కూర్చుని "ఇంకో 4 డేస్ ఉండొచ్చుగా అత్తా" అనడిగాను.. అత్త నా బుగ్గ లాగి "లేదమ్మా బుజ్జీ కల్పన కి స్కూల్ ఉంది కదా.. ఈసారి మీరు రండి" అని అమ్మ వైపు తిరిగి "వేసవి సెలవుల్లో అందరూ కలిసి రండి లక్ష్మీ!" అంది..

నేనూ, నానీ ఒక్కసారే "వెళదాం అమ్మా" అని అరుస్తుంటే అమ్మ కళ్ళు పెద్దవి చేసి చూసింది.. అంటే ఇంక మేము మాట్లాడకూడదన్న మాట! "లేదండి వదినా.. మా చిన్నన్నయ్య వాళ్ళింటికి రమ్మని ఎప్పటి నించో గొడవ చేస్తున్నాడు.. ఈ సెలవలకి అక్కడికి వెళదామనుకుంటున్నాము.. వినాయక చవితికి తప్పకుండా వస్తాము" అని చెప్పింది.. అయితే సెలవుల్లో పద్మత్త వాళ్ళింటికి వెళ్తున్నామన్న మాట! నానీ ఆ విషయం నాన్న గారితో చెప్పడానికి అనుకుంటా ఒక్క పరుగు తీశాడు..

పెద్దత్త వాళ్ళు వెళ్ళిపోయిన సాయంత్రం రేఖా వాళ్ళమ్మ గారు వస్తే అమ్మ తీరికగా కూర్చుని కబుర్లు చెప్తుంది.. "ఈ వారం అంతా మీరు చాలా బిజీ బిజీగా ఉన్నారు లక్ష్మీ!" అని ఆంటీ అంటుంటే అమ్మ "అవునండి.. ఇదిగో ఇప్పుడే కాస్త కాళ్ళు జాపుకోవటానికి వీలైంది.. ముఖ్యంగా ఈ నాలుగు రోజులు అసలు క్షణం కూడా తీరిక లేదు.. మా ఆడపడుచుకి అన్నీ చేతికి అందించలేక నడుములు పడిపోయాయి" అంటూ నీరసంగా చెప్పింది.. వాళ్ళు ఇంకా మాట్లాడుకుంటుంటే నేను వచ్చేశాను.. 'అమ్మకి పెద్దత్త అంటే ఇష్టం లేదా??' అనుకున్నా..

తర్వాత పెద్ద పరీక్షలు దగ్గర పడుతుంటే రోజూ ఇంటికొచ్చి చదువుకోవడమే... ఇంకా రెండు రోజుల్లో పరీక్షలు అయిపోతాయనగా అమ్మ నాన్న తో అంది "ఇంకో పెద్ద సూట్ కేస్ కొనాలండి.. మా ముగ్గురి బట్టలకి ఇప్పుడున్నది సరిపోయేదేమో".. అప్పుడు గుర్తొచ్చింది, సెలవల్లో చిన్న మామయ్య ఇంటికి వెళ్తున్నామని.. అక్కడికి వెళ్తున్నామంటే నానీకి చాలా ఇష్టం .. అనిల్ అన్న, బబ్లూ ఇద్దరూ అబ్బాయిలే కదా.. వాళ్ళతో ఎప్పుడూ బయట ఏవో ఆటలు ఆడుతూనే ఉంటాడు.. ఇంకా అనిల్ అన్న నానీని సైకిల్ మీద తిప్పుతాడు.. నేనెక్కువ పద్మత్తతోనే ఉంటాను.. తను నాకిష్టమైన స్వీట్స్ అన్నీ చేస్తుంది.. ఈసారి టెన్ డేస్ ఉంటామని అమ్మ చెప్పింది..

సెలవులిచ్చిన వారానికి అమ్మ, నేను, నానీ చిన్న మామయ్య వాళ్ళింటికి వెళ్ళాము.. వెళ్ళిన దగ్గర నించీ అక్కడ కాలనీ లో ఉండే మిగతా పిల్లలతో కలిసి అంటుకునే ఆట, దొంగా పోలీస్, ఏడు రాళ్ళాట ఆడుకుంటూ చాలా గోల చేశాము.. అమ్మ అయితే మామయ్య పక్కనే కూర్చుని వాళ్ళ చిన్నప్పటి కబుర్లు, చుట్టాల కబుర్లు, తన స్కూల్ కబుర్లు ఇంకా ఏంటేంటో మాట్లాడుతూనే ఉంది.. మధ్యలో మాత్రం "వదినా ఇంకో కప్ కాఫీ ఇవ్వవా.. ఇవాళ సాయంత్రానికి వంకాయ బజ్జీ చేయవా.. సినిమాకి వెళదామా" అంటూ పద్మత్తని గట్టిగా ఏదో ఒకటి అడుగుతుండేది.. వచ్చేసేటప్పుడు మాత్రం మామయ్య ని పట్టుకుని "వెళ్ళొస్తానూ" అని అంటుంటే చూశాను, బుగ్గల మీద నీళ్ళు... అమ్మ ఏడుస్తుంటే నాకు, నానీకి కూడా బాగా దిగులేసి తననే గట్టిగా పట్టుకున్నాము..

కానీ ఇంటికొచ్చి నాన్నగారిని చూడగానే మా ఇద్దరికీ  సంతోషం వేసింది.. చాలా రోజులైంది కదా మరి!నాన్న తన దగ్గర కూర్చోబెట్టుకుని అన్ని రోజులు ఏమేమి చేశామో అడుగుతుంటే చెపుతూ ఉన్నాము.. నానీ అమ్మ ఏడ్చిన సంగతి కూడా చెప్పేశాడు.. అప్పుడే అటు వస్తూ అమ్మ వాడి మాటలు విని "పోరా!" అని చిన్నగా నెత్తి మీద కొట్టింది..

"ఇంతకీ మీ అన్నయ్యా వదినా ఏమంటున్నారు?" అని నాన్నడిగితే,"ఏంటో అస్సలు వాళ్ళతో ఉన్నట్లే లేదు.. వదిన ఇంకో నాలుగు రోజులు ఉండమని బలవంతం చేసింది.. మీకు భోజనానికి కష్టం అని వచ్చేశాను" అంది..

"అమ్మా, పద్మత్త నీకంటే పెద్దదా? చిన్నదా?" అనడిగాను.. "నాకంటే 2 సంవత్సరాలు పెద్దది" అంది అమ్మ.. "పెద్దత్త?" అని అడిగా.. "ఆవిడ కూడా పెద్దదే" అని అమ్మనగానే "మరైతే పెద్దత్త ని 'అండి' 'మీరు ' అని, పద్మత్తని 'నువ్వు ', 'నీకు ' అనెందుకంటావు?" అర్ధం కాక అడిగా.. "ఏంటే నీకివ్వాళ చాలా సందేహాలు వస్తున్నాయి" అని నవ్వుతూ "పద్మత్తంటే నా సొంత అన్నయ్య భార్య కాబట్టి నాకు తన దగ్గర స్వతంత్రం  ఉంటుంది.. మరి మీ పెద్దత్త నాన్న గారి అక్క కదా.. అందుకే గౌరవం తో అలా పిలుస్తాను"..

"అయితే అమ్మా, మొన్న పెద్దత్త వెళ్ళగానే నువ్వు రేఖా వాళ్ళమ్మతో 'చాలా పని ఎక్కువైందని ' అన్నట్లే పద్మత్త కూడా వాళ్ళ పక్కింటోళ్ళతో అంటుందా?" ఇంకో ప్రశ్న అడిగాను.. అమ్మ ఎందుకో కాసేపు మాట్లాడలేదు.. "అయినా నీకీమధ్య ఇలా పెద్దవాళ్ళ కబుర్లన్నీ విని ఆరిందాలాగా మాట్లాడటం ఎక్కువైందే" అని విసుక్కుంది..

"ఆరిందంటే ఎవరమ్మా?" నానీ అడిగాడు.. నాకూ తెలీదు.. కానీ ఎప్పుడన్నా నా మాటలు నచ్చకపోతే అమ్మ అలానే అంటుంది..

"దాని ప్రశ్నకి సమాధానం చెప్పక విసుక్కుంటావెందుకు లక్ష్మీ" నాన్న నవ్వుతూ అన్నారు..

"ఆ.. వేలెడంత లేదు, దీనికి కూడా సమాధానం చెప్పాలి నేను", అని "అది కాదు సిరీ, నేనంటే స్కూల్ కెళ్ళి ఉద్యోగం చేస్తాను కదా.. తీరిక ఎక్కువ ఉండదు.. అందుకే పెద్దత్త వచ్చినప్పుడు పని ఎక్కువై అలా అని ఉంటాను.. కానీ పద్మత్త ఉద్యోగం చేయదు కదా, తనేమీ మన గురించి అలా అనుకోదు" చెప్పింది..

"కానీ పద్మత్త కూడా ఇంట్లో ఎప్పుడూ పని చేస్తూనే ఉంటుందమ్మా! వాళ్ళకి మన అంట్లు తోమే కళ, బట్టలు ఉతికే దుర్గ లా ఎవరూ లేరుగా!?" వెంటనే అనేశాను..

అమ్మ ఎందుకో ఏమీ మాట్లాడలేదు.. నాకు భయం వేసింది, ఏమన్నా తప్పు మాట్లాడి అమ్మకి కోపం తెప్పించానేమోనని..

అంతలో నాన్న అడిగారు, "సిరీ, నువ్వు మీ ఫ్రెండ్ కాంతి వాళ్ళింటికి అప్పుడప్పుడూ వెళ్తావు కదా, వాళ్ళమ్మ గారు నీకు తెలుసా?"

నేను "తెల్సు నాన్నా.. ఆంటీ మమ్మల్ని  చాలా ఆటలు ఆడిస్తారు.." అన్నా..

"మరైతే నీకు ఆ ఆంటీ ఇష్టమా లేక మన పెద్దత్త ఇష్టమా?" మళ్ళీ అడిగారు.. "ఇద్దరూ ఇష్టమే నాన్నా" అని చెప్పాను.. "మరైతే ఆ ఆంటీ మనింటికి వచ్చారనుకో.. మొన్న పెద్దత్త వళ్ళో కూర్చున్నట్లే కూర్చుంటావా?" అంటే "కూర్చోను నాన్నా" అని చెప్పాను..

"అవును.. ఎందుకంటే పెద్దత్తని నీ చిన్నప్పటి నించి చూస్తున్నావు.. మనం వాళ్ళింటికి వెళ్తాము.. అత్తా వాళ్ళు మనింటికొచ్చి బోల్డు రోజులు ఉంటారు.. అందుకే నీకు అత్తంటే ఇష్టం తో పాటు చనువు కూడా ఉంది.. పెద్దత్త వస్తే నువ్వేమీ తనకి కావాల్సినవి అందించవు.. కానీ ఆంటీ నీకు తెల్సింది తక్కువ కాలం నించే.. ఆంటీ ఇంటికి వస్తే మంచి నీళ్ళు ఇవ్వడం, టిఫిన్ ప్లేట్స్ లోపలికి తీసుకెళ్ళడం చేస్తావు.. ఆ ఆంటీ అంటే నీకు ఇష్టం అయినా పెద్దత్త దగ్గరున్న చనువు లేదు..

అలానే అమ్మ, చిన్న మామ్మయ్య నువ్వు, నానీ లాగా చిన్నప్పటి నించి కల్సి పెరిగారు.. అందుకే అమ్మకి చిన్న మామయ్య దగ్గర చనువు ఎక్కువ.. వాళ్ళింటికెళ్తే తన స్వంత ఇంటిలో ఉన్నట్లు, అమ్మమ్మని అడిగినట్లు పద్మత్తని అన్నీ అడిగి చేయించుకుంటుంది.. పెద్దత్త అమ్మకి మా పెళ్ళై న తర్వాత నించే తెలుసు.. అందులో నా అక్క కదా అందుకే పెద్దత్తకి బాగా మర్యాదలు చేయాలని అనుకుంటుంది".. "అవునా అమ్మా?" అంటూ వెనక్కి తిరిగి చూస్తే అక్కడ అమ్మ లేదు..

దూరంగా ఫోన్ పక్కన కూర్చుని ఎదో నంబర్ కొడుతున్నది.. "వదినా, ఇంకా సెలవలు చాలా రోజులున్నాయి కదా.. పిల్లల్ని తీసుకుని నువ్వు ఒక పది రోజులుందువుగానీ రాకూడదూ.. సిరికి, నానీకి మీ మీద బెంగగా ఉన్నట్లుంది.. ఇంకా దిగాలు మొహాలేసుకుని ఉన్నారు.. నీక్కూడా కాస్త రెస్ట్ దొరుకుతుంది"... అమ్మ పద్మత్తతో ఆపకుండా మాట్లాడుతూనే ఉంది..

❋❋❋❋

# 'కిడ్డీ బాంక్'

ఇవాళ స్కూల్ అయిపోయి ఇంటికొచ్చేస్తున్నా ఇంకా కాంతి తెచ్చిన బొమ్మే గుర్తొస్తుంది. పోయిన వారం జరిగిన కాంతి పుట్టిన రోజుకి వాళ్ళ మామయ్య ఇచ్చారంట. ఎంత బావుందో! తెల్లటి బొమ్మకి నల్లటి జుట్టు భలే వంకీలు తిరిగి పొడవుగా వదిలేసి ఉంది. కళ్ళు అయితే గుండ్రంగా ఎంత బావున్నాయో! బొమ్మకి వెనకాల చిన్న బటన్ ఉంది.. అది నొక్కితే 'హలో మై ఫ్రెండ్ ' అంటూ కళ్ళు పైకీ కిందకీ ఆడిస్తూ, చేతులు చాచి పిలుస్తోంది.

కాంతి అయితే అసలు ఎవరినీ బొమ్మని ముట్టుకోనీయలేదు.. నేను తన బెస్ట్ ఫ్రెండ్ అని ఆ బొమ్మ మాట్లాడే బటన్ ని ఒక్కసారి నొక్కనిచ్చింది.. మళ్ళీ బొమ్మని జాగ్రత్తగా బాక్స్ లో పెట్టేసుకుంది.

ఇంట్లోకి వెళ్తూనే అమ్మ దగ్గర చేరిపోయా.. కాంతి తెచ్చిన బొమ్మ గురించి చెప్తుంటే అమ్మ 'ఊఁ' కొడుతూ తన పని చేసుకుంటుంది.. 'నాక్కూడా అలాంటి బొమ్మ కావాలమ్మా' అడగాలని చాలా అనిపిస్తున్నా అంతకుముందు కొన్ని రోజుల క్రితం నానీ గాడు క్రికెట్ బాట్ కావాలంటే 'ఆ బాట్ అంత లేవు నువ్వు అది పట్టుకుని ఏం ఆడతావురా!? అయినా మొన్న పరీక్షల్లో మార్కులు అస్సలు బాగా రాలేదు.. ముందు చదువు మీద ధ్యాస పెట్టు' అని గట్టిగా గదిమేసింది..

ఇప్పుడు నేనడిగినా అలానే కోప్పడుతుందేమో!? లేదు.. ఇంకో 2 డేస్ లో ప్రోగ్రెస్ కార్డ్ ఇస్తారు కదా, మంచి మార్కులు వస్తే అప్పుడే అడుగుతా.. మరుసటి రోజు కాంతిని అడిగా తన బొమ్మని వాళ్ళ మామయ్య ఎక్కడ కొన్నారో అని.. కాంతి వెంటనే చెప్పేసింది, "రాజు ఫాన్సీ షాపులో" అని.. 'ఓ, ఆ షాపా!' నాకు హుషారు వచ్చింది.. అమ్మ ఆ షాపు కి ఎప్పుడూ వెళ్తూనే ఉంటుంది.. అక్కడ చూసే ఉండొచ్చు..

ప్రోగ్రెస్ కార్డ్ ఇచ్చిన రోజు ఎగురుకుంటూ వెళ్ళా అమ్మ దగ్గరికి.. ఫస్ట్ రాంక్ వచ్చిందిగా మరి! అమ్మ నా మార్కులు చూసి మెచ్చుకుంటుంటే నెమ్మదిగా అడిగాను, కాంతి దగ్గర ఉన్న లాంటి బొమ్మ కావాలని.. అమ్మ నవ్వుతూ "సరేలేవే చూద్దాం " అంది.. నేను వెంటనే చెప్పాను, "అమ్మా, అది నువ్వెప్పుడూ వెళ్ళే రాజు ఫాన్సీ షాపులోనే ఉంటుందంట.. కాంతి వాళ్ళ మామయ్య అక్కడే

కొన్నారంట''.. ''రేపు బజారుకి వెళ్తాముగా అప్పుడు చూద్దాంలే'' అని అమ్మ అనగానే నాకు ఇంకా సంతోషం వేసింది.. మళ్ళీ వెంటనే అటూ ఇటూ చూశాను, నానీ గాడు విన్నాడేమో అని! వాడు వింటే గనక తన క్రికెట్ బాట్ గురించి గొడవ మొదలుపెడతాడు!

అమ్మ బజారుకెళ్తూ నన్ను కూడా తీసుకెళ్ళింది.. నేనా షాపులోకి వెళ్తూనే చుట్టూ చూసేసాను, ఆ బొమ్మ ఎక్కడన్నా కనబడుతుందేమోనని.. షోకేస్ లో అద్దాల వెనక ఉన్న బొమ్మని చూస్తునే సంతోషంగా ''అదిగో అమ్మా, అదే'' అని అరిచి చెప్పాను.. అమ్మ ''ష్ ష్..'' అని అక్కడున్న షాపాయన్ని ''ఆ బొమ్మెంతండీ'' అనడిగింది.. ఆయన ''రెండువందల యాభై'' అన్నారు..

''అబ్బో, అంత రేటా!'' అనేసి నా వైపు తిరిగి ''సర్లే మళ్ళీ వచ్చినప్పుడు చూద్దాం'' అని షాపు బయటికి తీసుకొచ్చేసింది.. అయితే ఆ బొమ్మ చాలా ఖరీదన్నమాట! ఇంక అమ్మ కొనివ్వదేమో!? ఇంటికెళ్ళగానే నేను హోంవర్క్ చేసుకుంటుంటే నాన్న అమ్మని అడుగుతున్నారు, ''ఏంటి సిరి అంత సైలెంట్ గా ఉంది?'' అమ్మ వెంటనే నా బొమ్మ కథంతా నాన్నకి వినిపించింది.. అలానే దాని ఖరీదు కూడా.. నాన్న కూడా అచ్చు అమ్మ లాగే ''అబ్బో, చాలా ఖరీదే'' అనేసారు..

కానీ కాసేపాగి అమ్మ అన్నం పెడుతూ ''సిరీ, నీ పుట్టిన రోజు ఇంకో రెండు నెలలుందిగా, అప్పటి వరకూ నీ కిడ్డీ బాంక్ లో పోగయిన డబ్బులతో కొనుక్కుందువు గానీ.. ఇరవయ్యో ముప్పయ్యో తగ్గితే నేనిస్తానులే.. అంతకంటే ఎక్కువ మాత్రం నేనివ్వను'' అంది.. నాకు మళ్ళీ హుషారు వచ్చేసింది.. ''అలాగే అమ్మా.. అప్పుడెప్పుడో ఎగ్జిబిషన్ కి వెళ్ళినప్పుడు కదా తీశాను నా కిడ్డీ బాంక్ లో డబ్బులు.. నా పుట్టినరోజుకల్లా బోల్డన్ని పోగవుతాయి'' గొప్పగా చెప్పాను..

ఇంకా అప్పటినించి నాన్న వారం వారం ఇచ్చే డబ్బులు, కొట్టుకి పంపినప్పుడల్లా అమ్మ ఇచ్చే మిగిలిన చిల్లర డబ్బులు అన్నీ నా కిడ్డీ బాంక్ లో వేసేస్తున్నాను.. కాంతి చెప్పింది, కావాలంటే బుజ్జి బుజ్జి బట్టలు కుట్టించి వేసుకోవచ్చని.. ఇంకేమి! పక్క సందులో మా బట్టలు కుట్టే టైలర్ రమేష్ అంకుల్ దగ్గరికి వెళ్ళి, కత్తించిన ముక్కల్లో మంచి మంచివి నేను తీసుకుంటానని చెప్పాను.. అక్కడ నించి తిరిగి వస్తుంటే నానీ అడిగాడు, ''అక్కా, నీ బొమ్మకి పేరేమి పెడతావు?'' అని..

అవును కదా, చక్కగా నా బొమ్మని పేరు పెట్టి పిలుచుకోవచ్చు! ''నువ్వేమన్నా పేర్లు చెప్పు నానీ'' అని అడిగానో లేదో వాడు గబగబా ''చిట్టి, పింకీ, చంటి, ..'' అంటూ ఏవేవో పేర్లు మొదలుపెట్టాడు.. నాకైతే ఒక్కటి కూడా నచ్చలేదు.. 'అయినా వీడికి ఇంతమంది అమ్మాయిల పేర్లు ఎలా తెల్సో!?'

హోంవర్క్ చేసుకుంటుంటే గభాల్న తట్టింది ఒక పేరు.. గట్టిగా అరిచి చెప్పా, ''నానీ, నా బొమ్మ పేరు డాలీ''.. లోపలనించి అమ్మ ''బావుందే పేరు'' అని అంది.. మర్నాడు కాంతికి చెప్తే తను కూడా చాలా బావుంది అంది.. తన బొమ్మకి కూడా ఏం పేరు పెట్టాలా అని ఆలోచిస్తూ ఉంది..

కొన్ని రోజుల తర్వాత అమ్మ, నేను బజారుకి వెళ్ళినప్పుడు అమ్మని బతిమాలి, బొమ్మని చూద్దామని షాపుకి వెళ్ళాము.. అమ్మ వేరే ఏవో చూస్తుంటే నేను తిన్నగా బొమ్మ ఉన్న అద్దాల బీరువా దగ్గరికి వెళ్ళిపోయా.. కానీ.. అక్కడ బొమ్మ కనిపించలేదు!! 'అయ్యో! ఎవరో నాకన్నా ముందే కొనేసుకున్నారేమో'... ''సిరీ, ఇంక పద వెళ్దాము'' అంటూ వచ్చిన అమ్మ కంగారుగా ''ఏంటే ఏడుస్తున్నావు?'' అడిగింది.. నాకే తెలీదు నేను ఏడుస్తున్నానని!!

''నా బొమ్మని ఎవరో కొనేసుకున్నారమ్మా'' అని చెప్తుంటే అక్కడ ఉన్న షాపంకుల్ ''లేదమ్మా, ఆ బొమ్మని అదిగో ఇంకో బీరువాలో పెట్టాము'' అని ఎదురు అద్దాల బీరువా వైపు చూపించారు.. ''అయినా అదొక్కటే కాదు, లోపల ఇంకా ఉన్నాయి'' అని చెప్తుంటే అమ్మ ''చూశావా, ఇంకా బోల్డు ఉన్నాయంట.. ఇక ఏడవకు'' అని ఒక చాక్లెట్ కొనిచ్చింది..

కానీ ఇంటికొస్తూనే నాన్నతో ''దీనికి బొమ్మ పిచ్చి చాలా ఎక్కువైపోయిందండీ'' అంటూ ఇందాక షాపులో జరిగింది చెప్పింది.. ''దాని కోసమేగా కష్టపడి డబ్బులు కిడ్డీ బాంక్ లో దాచుకుంటుంది, అందుకే కనబడక పోయేసరికి ఏడ్చి ఉంటుందిలే'' అని

నాన్న అనగానే, "అదొక్క విషయమే కాదండీ! అప్పుడే బొమ్మకో పేరు పెట్టింది కదా.. ఇక అస్తమానం ఇది డాలీ కోసం.. అది డాలీ కోసం అని ఇంటి నిండా చెత్త పొగేస్తుంది.. టైలర్ దగ్గరనించి  గుడ్డ పీలికలు తెచ్చి దాస్తుంది కదా.. అది కాకుండా మొన్న మన పక్కింటి ఆవిడతో నా పాత పట్టుచీరలు ఏం చేయాలో తెలీటం లేదని చెప్తుంటే, మధ్యలో ఇదొచ్చి 'అమ్మ! మెరిసే అంచు ముక్కలు నాకివ్వా, డాలీ కి లంగా వోణీ చేస్తాను' అంది!!

"అంతేనా మెడలోకి గొలుసులకని పిచ్చి పిచ్చి పూసలు.. జడలకని తన మంచి రిబ్బన్ లు కూడా కత్తిరించి వేస్తుంది.. ఇల్లంతా దీని బొమ్మకి కావాల్సిన సామాన్లే!!" అని కాస్తాపి "ఇంకో విషయం చెప్పనీయండి.. దీనికి,  బొమ్మకి, వేరే మంచం కావాలంట! ఇట్లా అయితే  బొమ్మేదో కొన్న తర్వాత వేరే గదే ఇమ్మంటుందేమో!!"

"లేదమ్మా, ఇంకో గది అడగను" అని అమ్మని ఆ పుతూ చెప్పా.. లేదంటే అసలు బొమ్మే కొనరేమో!? నాన్న నా వంక చూస్తూ "సిరి తల్లీ, నువ్వు నిజంగానే బొమ్మ గురించి ఎక్కువ ఆలోచిస్తున్నావు.. బొమ్మ కొనేవరకు నీ నోటి వెంట మళ్ళీ దాని మాట వినబడనీయకు" అని అస్సలు నవ్వకుండా చెప్పారు..

నాన్న అలా చెప్తే ఇంకెందుకు మాట్లాడతాను.. కానీ చాటుగా పూసల దండలు, బొట్లు, రిబ్బన్‌లు అన్నీ దాచిపెట్టుంటున్నా.. కాంతికి కూడా చూపిస్తున్నా..

ఒకరోజు స్కూల్ కి వెళ్ళబోయేముందు అమ్మ అంది, "సిరీ, నీ పుట్టిన రోజు వచ్చే వారమే కదా, ఇవాళ సాయంత్రం వెళ్ళి నీ బొమ్మ కొనుక్కొద్దాము".. నేను వెంటనే "మరి కిడ్డీ బాంక్ లో ఎన్ని డబ్బులున్నాయో లెక్కపెడదామా" అనడిగా..

"ఇప్పుడు టైం లేదు.. సాయంత్రం వెళ్ళబోయే ముందు చూద్దాములే.. మర్చిపోయా, ఇవాళ నేను ఇంటికొచ్చేసరికి కొంచెం లేట్ అవుతుంది.. ఇంటి తాళం పక్కింటి ఆంటీ దగ్గరుంటుంది.. మీరిద్దరూ రాగానే స్కూల్ డ్రెస్ మార్చుకుని ఉండండి.. నాన్న గారు రాగానే మనిద్దరం బజారుకి వెళదాం" అని చెప్పింది..

ఇంక స్కూలికి వెళ్ళినప్పటి నించి ఎప్పుడు సాయంత్రం లాస్ట్ బెల్ కొడతారా అని చూడటమే! బెల్ కొట్టగానే గబగబా బయటకొచ్చి చూస్తుంటే వెంకన్న కనిపించాడు.. సాంబయ్యకి అప్పుడప్పుడూ ఏదన్నా పని వస్తే వెంకన్నని పంపుతాడు..

ఆంటీ దగ్గర నించి తాళం తీసుకుని ఇంట్లోకి వెళ్ళగానే నానీ పుస్తకాల సంచి పక్కన పడేసి, బట్టలు మార్చుకుని ఆడుకోవటానికి పరిగెత్తాడు.. నేను స్నానం చేసి అమ్మ కోసం చూస్తు వరండాలో కూర్చున్నా..

అంతలో గేట్ శబ్దం అయితే అమ్మో, నాన్నో అనుకుని గభాల్న బయటకి చూశా.. ఉహూ, కాదు.. సాంబయ్య!

నన్ను చూడగానే "పాపా, అమ్మ గారున్నారా?" అనడిగాడు..

"అమ్మ ఇవాళ కొంచెం ఆలశ్యంగా వస్తానంది సాంబయ్యా" అని చెప్పగానే "నాన్న గారు అప్పుడే రారు కదా!" అనుకుంటా బయట గట్టు మీద కూర్చున్నాడు..

"ఇవాళ నువ్వు రాలేదేంటి సాంబయ్యా?" ఊరికే అడిగాను..

"మా అమ్మాయికి వంట్లో బాలేదమ్మా.. హాస్పిటల్లో చేర్పించాము.. పొద్దునించీ తిండీ తిప్పలూ లేకుండా అక్కడే ఉన్నాము.. అమ్మ ఏంటమ్మా ఇంకా రాలేదు?" అని మళ్ళీ అడిగాడు..

సాంబయ్య కి మా నానీ అంత పాప ఉంది.. అప్పుడప్పుడూ సాంబయ్య తీసుకొస్తాడు తనతో పాటు.. నానీ నన్ను 'అక్కా' అంటం విని తను కూడా అలానే పిలవడం మొదలుపెట్టింది.. పాపం పెద్ద జ్వరం వచ్చిందేమో అందుకే హాస్పిటల్లో పెట్టారు.. అప్పుడు చిన్న బాబాయికి ఇలానే పెద్ద జ్వరం వస్తే హాస్పిటల్ కి తీసుకెళ్ళారు.. కానీ బాబాయి మళ్ళీ ఎప్పుడూ ఇంటికి రాలేదు.. అమ్మ చెప్పింది 'అంత జ్వరం వస్తే ఎప్పుడో మనమే వాళ్ళ దగ్గరికి వెళ్ళాలి కానీ వాళ్ళు ఇంక మన దగ్గరికి రారు' అని... అయితే సాంబయ్య వాళ్ళ పాప

కూడా అంతేనా!?

అంతలో అమ్మ వచ్చింది.. సాంబయ్య వాళ్ళ పాప జ్వరం గురించి చెప్పి "డాక్టరు ఏవో మందులు వెంటనే కొని వేయమన్నారు.. అవి వాడితే కాస్త నెమ్మదిస్తుందంట.. వాటికోసం సరిపడా డబ్బులు లేకపోతే చాలా చోట్ల అడిగి ఆఖరికి మీ దగ్గరకి వచ్చానమ్మా.. ప్రతినెలా నా రిక్షా డబ్బుల నించి తీసుకోండమ్మా" అన్నాడు..

"ఎంత అవుతాయి మందులకి?" అని అమ్మ అడగగానే "దాదాపు మూడు వందలవుతాయంటమ్మా" అని చెప్పాడు..

"అయ్యో! అంత అయితే ఇప్పుడు నా దగ్గర కూడా లేవు సాంబయ్యా.. మీ అయ్యగారు వస్తే ఆయన దగ్గర తీసుకుని నేను బజారుకి వెళ్ళాలి" అమ్మ చెప్పింది..

"అయితే, అయ్యగారి కోసం చూస్తాను" అని మళ్ళీ అక్కడే అరుగు మీద కూర్చుండి పోయాడు..

నేనూ సాంబయ్య పక్కనే కూర్చుని నాన్న కోసం గేట్ వంకే చూస్తున్నా..

చాలా సేపయింది.. అమ్మ రెండు సార్లు బయటకి వచ్చి 'వచ్చేస్తారు, కంగారు పడకు' అని చెప్పి వెళ్ళింది.. టివి లో వార్తలు కూడా చెప్తున్నారు.. నాన్న ఇంకా రాలేదు..

నేను లోపలికి వెళ్ళగానే వార్తలు చూస్తున్న అమ్మ నన్ను చూసి, "తల్లీ బజారుకి రేపు వెళ్దాము.. చూశావుగా నాన్నగారు ఇంకా రాలేదు" అని అంటుంటే నేను "అమ్మా, నా కిడ్డీ బాంక్ లో డబ్బులు సాంబయ్యకి ఇవ్వమ్మా.. మందులు వేయకపోతే మన చిన్న బాబాయి లాగా పాప కూడా ఇంటికి రాదేమో" అని చెప్పాను..

అమ్మ ఎందుకో నా వైపు అలానే చూసింది.. వెంటనే టివి ఆపుచేసి నన్ను దగ్గరికి లాగి, "నిజంగానా సిరీ? మరి నువ్వు డాలీ కోసం దాచిపెట్టుకున్నావుగా అవన్నీ" అంది..

"నిజం అమ్మా, డాలీ కోసం నేను మళ్ళీ దాచి పెడతాను" అని చెప్పగానే అమ్మ "సాంబయ్యా, సాంబయ్యా" అని గట్టిగా పిల్చింది.. తర్వాత ఇద్దరూ కుర్చుని నా కిడ్డీ బాంక్ మూత కింద నించి డబ్బులన్నీ బయటకి తీసి లెక్క పెట్టారు..
సాంబయ్యకి కావాల్సిన వాటికంటే కొన్ని రూపాయలు ఎక్కువే ఉన్నాయంట! సాంబయ్య నన్ను ఒకసారి గట్టిగా పట్టుకుని వెంటనే పరిగెత్తాడు..

కాసేపాగి నాన్న వస్తూనే "లక్ష్మీ ఇవాళ ఆఫీసులో చాలా పని పడింది.. మీరు బజారుకి రేపు వెళ్ళండి" అంటుంటే అమ్మ "ఇవాళ మన సిరి ఏం చేసిందో తెల్సా.." అంటూ సాంబయ్య నా కిడ్డీ బాంక్ లో డబ్బు తీసుకెళ్ళిన సంగతి అంతా చెప్పేసింది.

నాన్న కూడా అచ్చు ఇందాక అమ్మ చూసినట్లే నా వంక చూసి "నా సిరి తల్లీ" అని గట్టిగా ముద్దు పెట్టుకున్నారు..
ఇద్దరూ తిట్టలేదంటే నేను చేసింది మంచి పనే అన్నమాట!! అప్పుడు పడుకునేటప్పుడు నేను డాలీ గురించి అస్సలు తలుచుకోలేదు..
నా పుట్టిన రోజు నాడు సాంబయ్య నాకు ఒక అమ్మాయి బొమ్మ ఇచ్చాడు.. రంగు రంగులతో ఎంత బావుందో.. మొహం భలే నవ్వుతూ ఉంది.. కాస్త కదిలిస్తే చాలు తల అటూ ఇటూ ఊపుతుంది.. అమ్మ చెప్పింది దాన్ని 'కొండపల్లి బొమ్మ' అంటారని..

"అమ్మా, రేపు నా కొత్త బొమ్మని స్కూల్ కి తీసుకెళ్ళి అందరికీ చూపిస్తాను" అని అడుగుతుంటే నానీ వచ్చి "అక్కా, నీకు ఎప్పుడన్నా డబ్బులు ఇష్టం లేకపోతే నాకివ్వవా?" అనడిగాడు..

"ఎందుకు" అంటే

"నా కిడ్డీ బాంక్ లో వేసుకుని క్రికెట్ బాట్ కొనుక్కుంటాను" అన్నాడు..

# చిన్నత్త వాళ్ల ఊరు

"అమ్మా నాకింకో గుడ్డు వేయవా?" నానీ గట్టిగా అరిచాడు..

"అదేంటి రా? నీ గుడ్డు ఇందాకే పెట్టానుగా.. అప్పుడే తినేసావా! ఇంక లేవు.. మళ్ళీ రేపు చేస్తాలే" అమ్మ చెప్పగానే "అక్కా, నీదాంట్లో సగం ఇవ్వవా?" చేతులు చాపుతూ అడిగాడు..

"నేనివ్వను.. నిన్నెవరు ముందే తినేయమన్నారు?" నా కోడిగుడ్డుని అన్నం వెనక దాచేస్తూ, వాడికి కాస్త దూరంగా జరిగాను..

"అమ్మ రేపు మళ్ళీ చేస్తానందిగా అప్పుడు నీది నీకు ఇచ్చేస్తాను" అన్నాడు..

"వు హూ" అని ఇంకాస్త దూరం జరిగాను..

వీడెప్పుడింతే!! అన్నం రెండు ముద్దలు కూడా అవ్వదు.. గుడ్డు మాత్రం గుటుక్కున మింగేస్తాడు.. నేను అన్నం అంతా అయిపోయాక ఆఖరిగా తింటాను.. అంతకు ముందు 2,3 సార్లు పాపం అని కొంచెం పెట్టాను.. కానీ వాడెప్పుడూ వెనక్కి ఇవ్వలేదు!

"అబ్బబ్బా, ఈ కోడిగుడ్డు కూర చేసినప్పుడల్లా నీతో పేచీనే నానీగా" అమ్మ విసుక్కుంటూ వచ్చింది.. "రేపు సెలవలకి మీ చిన్నత్త ఊరు వెళ్తున్నారుగా, అక్కడ మీక్కావలసినన్ని గుడ్లు తిని రండి"..

"ఎలా అమ్మా? చిన్నత్త వాళ్ళింట్లో బోల్డన్ని కోడిగుడ్లు ఉంటాయా?" అనడిగాను..

"అవును, వాళ్ళకి కోళ్ళ ఫారాలు ఉన్నాయి కదా.. చాలా గుడ్లు ఉంటాయి" అంటూనే "నేను పండగ రోజుకల్లా వచ్చేస్తాను.. మీరిద్దరూ ఇక్కడ పోట్లాడుకున్నట్లు అక్కడ కూడా చేసారో ఇంక ఎవరింటికి మిమ్మల్ని పంపేది లేదు" అని గట్టిగా చెప్పింది..

ఈసారి దసరా సెలవలకి నాన్న మమ్మల్నిద్దర్నీ చిన్నత్త వాళ్ళింటికి తీసుకెళ్తామని చెప్పారు.. మమ్మల్ని అక్కడ వదిలేసి, పండగ రోజుకి మళ్ళీ అమ్మా నాన్న ఇద్దరు వస్తామని చెప్పారు..

చిన్నత్తంటే నాన్నగారి చెల్లెలు.. నన్నెప్పుడో ఫస్ట్ క్లాసులో ఉన్నప్పుడు వాళ్ళ ఊరుకి తీసుకెళ్ళారంట.. నాకైతే అస్సలేమీ గుర్తు లేదు.. చాలా సార్లు మా ఇద్దర్నీ అమ్మమ్మ వాళ్ళింట్లో వదిలేసి అమ్మా నాన్న వెళ్ళారు అక్కడికి.. లేకపోతే అప్పుడప్పుడు చిన్నత్తావాళ్ళే మా ఇంటికి వచ్చేవాళ్ళు..

సెలవలు మొదలైన రోజు పొద్దున్నే మా బట్టల సూట్ కేసు, అత్త వాళ్ళకోసం అమ్మ చేసిన పిండివంటల బాగ్ పట్టుకుని బస్టాండ్ కి వచ్చాము.. అక్కడంతా చాలా మంది జనాలు సంచులు, సూట్ కేసులు లాంటివి పట్టుకుని అటూ ఇటూ తిరిగేస్తున్నారు.. ఒకదాని తర్వాత ఒకటి బస్సులు వస్తున్నాయి వెళ్తున్నాయి.. మా బస్సు వచ్చిందని నాన్న ముందు సామాన్లు పెట్టొచ్చి మమ్మల్ని తీసుకెళ్ళారు..

కిటికీ పక్క సీట్ కోసం నానీ, నేను పోట్లాడుకుంటుంటే, ముందు వాడిని కూర్చోనిచ్చి తర్వాత నన్ను కూర్చోమన్నారు.. చిన్నవాడని ఎప్పుడూ వాడే అన్నిటిలో ఇలా ఫస్ట్ దూరిపోతాడు.. కానీ వాడి పక్కన కూర్చున్నా నాక్కూడా అన్నీ కనబడుతున్నాయి కిటికీ లోనుంచి.. నాన్న పేపర్ చదువుకుంటుంటే మేమిద్దరం కరెంటు స్థంభాలు లెక్కపెడుతూ కబుర్లు చెప్పుకుంటున్నాము..

ఏదో ఊరిలో బస్ ఆగగానే నాన్న ఇంక మనం దిగాలని చెప్పారు.. ఆ ఊరి పేరు బందరంట!

"అత్తా వాళ్ళ ఊరి పేరు బందరా?" అని నేను అనగానే "లేదమ్మా, వాళ్ళ ఊరి పేరు లక్ష్మీపురం.. ఇక్కడ ఇంకో బస్ ఎక్కాలి"

అని చెప్పి గబ గబా పక్కన ఉన్న పళ్ళ బళ్ళ వైపు వెళ్ళారు.. ఏవేవో పళ్ళు కొని తొందర తొందరగా వచ్చి "పదండి పదండి మన బస్సు ఈ పాటికి వచ్చేసి ఉంటుంది" అని గబగబా నడుస్తూ వెళ్ళారు..

నాన్న వెనకే వెళ్ళడానికి మా ఇద్దరికీ రావటం లేదు.. ఎక్కడ పడితే అక్కడ అరటి కాయ తొక్కలు, ఉమ్ములు, చెత్త, బురద నీళ్ళు ఉన్నాయి.. అలా మురికి మురికి గా ఉంటే చెప్పులకి ఏదీ అంటకుండా చూసుకుని చూసుకుని నడుస్తూ, మధ్యలో నాన్న ఎటువైపు వెళ్తున్నారో చూస్తూ మా బస్సు దగ్గరకు వచ్చాం..

అక్కడ బస్సు తలుపు దగ్గర చాలా మంది గుంపుగా ఉండి, ఒకరినొకరు తోసేసుకుంటూ లోపలికి వెళ్తున్నారు.. నానీ కి భయం వేసిందేమో నా చేయి గట్టిగా పట్టుకున్నాడు..

"మీరిద్దరూ వెనక నుంచోండి.. అప్పుడే ఎక్కద్దు" అని నాన్న గుంపులో నుంచే కేక పెట్టారు.. నాకైతే అసలు ఆ బస్సులోకి ఎక్కబుద్ధి కాలేదు.. కానీ నాన్న లోపలనుంచి పిలవగానే ఇద్దరం నెమ్మదిగా ఎక్కాము.. నాన్న ఉన్న సీట్ దగ్గరకు వెళ్ళడానికి కుదరకుండా దారిలో జామకాయలు, తేగల బుట్టలు, ఏవేవో మూటలు అడ్డంగా ఉన్నాయి..

నానీకి నాకూ కూర్చున్న ప్లేస్ అస్సలు సరిపోవటం లేదు.. పక్కన ఉన్న అమ్మాయి గట్టిగా నొక్కేస్తుంది.. పాపం! నాన్న నుంచునే ఉన్నారు.. ఇంకా బస్సంతా ఏదో పిచ్చి వాసన వస్తోంది.. అందరూ అరుచుకుంటూ మాట్లాడుతున్నారు.. నానీ అయితే "నాన్నా, మనింటికి వెళ్ళిపోదాము" అంటూ ఏడుపు మొదలుపెట్టేసాడు.. "ష్.. ష్.. ఏడవకు.. ఇంకో గంటలో మన ఊరొచ్చేస్తుంది.." అంటూ నాన్న కాస్త కోపంగా అన్నారు.. వాడు ఆపేసాడు కానీ ఇప్పుడు నాకైతే అస్సలు ఊరికి వెళ్ళాలని అనిపించటం లేదు.. అమ్మకి చెప్పాలి ఇంకెప్పుడూ ఆ ఊరికి మమ్మల్ని పంపొద్దని.. 'డొక్కు బస్సు.. డొక్కు ఊరు' కోపంగా తిట్టుకున్నా..

బస్సు ఎక్కడ గినా నానీ "నాన్నా మనూరేనా?" అడుగుతుంటే నాన్న "కాదురా.. ఇంకాసేపట్లో వచ్చేస్తుంది" అంటున్నారు.. వాడు నాతో చిన్నగా "చిన్నత్త వాళ్ళ ఊరు ఇంత దూరం ఉందేమిటక్కా? ఇంకెప్పుడూ అమ్మని నాకింకో గుడ్డు వేయమని అడగను.. లేకపోతే ఈ ఊరు పంపేస్తుంది" అన్నాడు..

చాలాసేపు వెళ్ళిన తర్వాత నాన్న చెప్పారు, "వచ్చేదే మనం దిగాల్సిన స్టాప్" అని.. అంతే! మేమిద్దరం టింగ్ మని లేచి నుంచున్నాము..

"ముందుకెళ్దాం పదండి" అని నాన్న సూట్ కేసు పట్టుకుని, బాగ్ తగిలించుకుని ముందుకి కదిలారు.. బస్సు కదులుతుండగానే అలా వెళ్తుంటే ఎవరెవరివో కాళ్ళు తొక్కేసాము.. వాళ్ళు గట్టిగా కసురుతూనే ఉన్నారు.. బస్సు లోంచి బయటకి దిగేసరికి నాకు చేతులు కాళ్ళు చాలా నొప్పి పెట్టేస్తున్నాయి..

దిగి సామాన్లు పక్కన పెట్టి మమ్మల్ని నాన్న రోడ్డు పక్కకి లాగారు.. చుట్టూ చూస్తే పక్కన ఉన్న చిన్న కొట్టు తప్ప ఇంకేమీ కనబడలేదు.. "ఎవరూ లేరు ఇదేం ఊరు నాన్నా?" అని అడిగాను..

"ఊరు లోపలికి ఉందమ్మా.. దీన్ని మెయిన్ రోడ్డు అంటారు.. ఊళ్ళోకి బస్సులుంటాయి" నాన్న చెప్పగానే నానీ "ఇంకో బస్సా!" ఏడుపు మొహం తో అడిగాడు.. "ఇందులో అంత జనం ఉండర్రా.. నువ్వే చూస్తావుగా" అని నాన్న చెప్తుంటే "నాకు బాగా ఆకలి వేస్తుంది నాన్న" అని నేను చిన్నగా చెప్పా.. వెంటనే నానీ "నాక్కూడా" అన్నాడు. నాన్న కొట్టు అబ్బాయిని బస్సెప్పుడొస్తుందని అడిగారు.. ఆ అబ్బాయి "ఈ పాటికి రావాలండీ" అని బయటకి మొహం పెట్టి రోడ్డు కి అటువైపు చూశాడు..

"ఇంకెప్పుడూ చిన్నత్త వాళ్ళింటికి రావొద్దు నాన్నా.. చక్కగా పెద్దత్త వాళ్ళింటికైతే ట్రైన్ ఎక్కి పడుకుని లేచేసరికి ఊరు వచ్చేస్తుంది" నానీ మాటలకి నేను కూడా "అవును, ఇంటికెళ్ళి బ్రష్ చేసుకునేసరికి పెద్దత్త టిఫిన్ చేసేస్తుంది" అని అంటుంటే వాడు మళ్ళీ "మనం చిన్నత్త వాళ్ళింటికి వెళ్ళేసరికి వాళ్ళు అన్నం తినేస్తారేమో? మనకి అన్నం ఉండదేమో?" అన్నాడు.. నాన్నేమో "ఏడిసార్లే ..

ఎప్పుడూ తిండి గోలేనా!" అన్నారు..

అంతలో ఊళ్ళోకి వెళ్ళే చిన్న రోడ్డులో అటు వైపు నుంచి ఏదో బండి వస్తూ కనిపించింది.. నాన్నకి దాన్ని చూపించి "అదేంటని?" అడిగాను..

"అదా, రిక్షా అమ్మా.. అతను మళ్ళీ ఊళ్ళోకి వెళ్తుంటే అందులో వెళ్ళిపోదాం.. వెధవ బస్సు ఇప్పట్లో వచ్చేట్టు లేదు" అన్నారు.. ఆ బండి దగ్గరికి వచ్చాక అందులోంచి మనుషులు దిగి మేము నుంచున్న చోటికి కాస్త దూరంలో నుంచున్నారు.. నాన్న ఆ బండి అతనితో ఏదో మాట్లాడి వచ్చి "పదండి ఇందులో వెళ్దాం " అని మా సామాన్లు తీసుకున్నారు..

"నాన్నా రిక్షా అంటే ఇలా ఉండదుగా" అని అడిగాను.. "ఇది ఇంకో రకం.. దీన్ని గూడు రిక్షా అంటారు" అని ఎక్కించారు..

కాళ్ళు కిందకి వేళ్ళాడేసి అందులో కూర్చోవడం భలే ఉంది.. నాన్న రోడ్డుకి అటూ ఇటూ మొక్కలున్న పెద్ద స్థలాల్ని చూపించి

"ఇవి వరిచేలు.. మనం తినే బియ్యం ఇక్కడ నించే వస్తుంది" అంటే మేమిద్దరం తల బయట పెట్టి ఆ మొక్కల్ని చూసాము..

అంతలో బండి అతను "ఎవరింటికి వెళ్తున్నారండి" అని అడిగాడు.. "రాం కుమార్ గారింటికి" అని నాన్ననగానే "ఓ కంఠంనేని గారింటికా! వారికి మీరేమవుతారండీ" అని మళ్ళీ అడిగాడు..

"మా చెల్లెల్ని ఇచ్చామయ్యా" నాన్నంటే "అయితే మీరు రాజ్యలక్ష్మి గారి అన్నయ్య గారన్నమాట!" అన్నాడు..

నేను వెనకనించీ "నీకు మా చిన్నత్త వాళ్ళు తెలుసా" అని అరిచాను.. "నాకు ఊళ్ళో అందరూ తెలుసమ్మా.. స్కూల్ బస్సు రాకపోతే మీ చిన్నత్త గారి పిల్లల్ని నా బండిలోనే దింపొస్తాను" అన్నాడు..

వెంటనే నానీ "ఇవాళ రాజేష్, రాకేష్ ఇంట్లోనే ఉన్నారా" అనగానే "వాళ్ళకి కూడా మీకు లానే సెలవలు బాబూ.. ఇంట్లోనే ఉండి ఉంటారు" అని బండతను చెప్పగానే ఇంక మాకు చాలా సంతోషం వేసింది..

అంతలో నెమ్మది నెమ్మదిగా మనుషులు కనబడుతున్నారు.. అందరూ మా వంకే అలా చూస్తున్నారు.. నాకు సిగ్గేసి తల ఎటో తిప్పుకుని చూస్తున్నా..

"ఊళ్ళోకి వచ్చేసాం" అని నాన్న చెప్పగానే నేనూ నానీ చిన్నత్త వాళ్ళ ఇల్లు అదనీ.. కాదు ఆ పక్కన ఉన్నదనీ అనుకోవడం మొదలుపెట్టాము..

ముళ్ళ కంచె ఉన్న పెద్ద స్థలం ముందు రిక్షా ఆగగానే మేమిద్దరం కిందకి ఒక్క దూకు దూకాము.. దూరంగా పొడవుగా షెడ్లు.. ఇళ్ళు లాంటివి కనబడుతున్నాయి..

రిక్షా అబ్బాయికి డబ్బులిచ్చేసి నాన్న సామాన్లు తీసుకుని నడవబోతుంటే ఆ అబ్బాయి "ఇవి నేను తెస్తాను మీరు పదండి బాబూ" అని అవి పట్టుకున్నాడు..

"మనూళ్ళో అయితే రిక్షా అబ్బాయిలు అస్సలు మాటలే చెప్పరు.. ఈ అబ్బాయి మంచోడులా ఉన్నాడు కద నాన్నా, మన సూట్కేసులు కూడా తెస్తున్నాడు" నాన్న చెయ్యి పట్టుకుని లోపలికి నడుస్తూ అన్నాను..

ఇంటి వైపు వెళ్తుంటే అక్కడ వరండా లో పుస్తకంలో ఏదో రాసుకుంటున్న చిన్న మామ్మయ్య మమ్మల్ని చూడగానే, "రాజీ మీ అన్నయ్య వాళ్ళు వచ్చేసారు చూడు" అంటూ బయటకి వచ్చారు..

అంతే! లోపలనించి చిన్నత్త, రాజేష్, రాకేష్ గబగబా వచ్చేసారు.. లోపలకెళ్ళి నాన్న కూర్చుని మంచినీళ్ళు తాగుతుంటే చిన్నత్త "ఇంక మీ నాన్నని వదలండిరా" అని మమ్మల్నిద్దర్నీ లాగింది..

నానీ కి ముద్దు పెట్టి "ఏరా, నేను గుర్తున్నానా" అనడిగితే వాడు "ఛీ ఎంగిలి" అని బుగ్గ తుడుచుకున్నాడు.. "అబ్బో అప్పుడే పెద్దోడివైపోయావా" అని చిన్న మామయ్య గట్టిగా నవ్వి "సిరీ, పరీక్షలు బాగా రాశావా?" అనడిగితే తలూపాను..

చిన్నత్త అన్నం పెడుతుంటే నానీ "చిన్నత్తా మీ ఇంట్లో బోల్డు కోడిగుడ్లు ఉంటాయంట కదా?" అంటుంటే నాన్న "అరేయ్, ముందు నోరు మూసుకుని అన్నం తిను" అని కోపంగా చూశారు.. అంతలోనే రాకేష్ "అవును పెద్ద గది నిండా ఉన్నాయి, నీకు తర్వాత చూపిస్తాను" అని చెప్పాడు..

"అమ్మో గది నిండానా!" అంటుంటే చిన్నత్త "అవన్నీ సాయంత్రం.. అన్నాలవగానే కాసేపు పడుకోండి" చెప్పింది..

నాకు నిద్ర లోనుంచి మెలకువ వచ్చేసరికి నా పక్కన పడుకున్న వాళ్ళెవరూ లేరు.. గది లోనుంచి బయటికొస్తే అక్కడ నాన్న, చిన్నత్త, చిన్న మామయ్య కూర్చుని టీ తాగుతున్నారు.. "నానీ ఏడి నాన్నా" అనడిగా.. "వాళ్ళు కోడిగుడ్లు చూడటానికి వెళ్ళారు" అనగానే నాకు కోపం వచ్చింది.. "అదేంటీ! నన్ను తీసుకెళ్ళలేదు" అంటుంటే "ఒక వారం ఉంటావుగా నీకు కావాల్సినన్ని సార్లు చూడొచ్చు గానీ, నేను ఇంకాసేపట్లో మనూరికి వెళ్తున్నా.. నువ్వూ, నానీ ఇక్కడ అల్లరి చేశారని గానీ తెల్సిందో ఇంక ఇదే ఆఖరిసారి మిమ్మల్ని ఎక్కడికన్నా తీసుకెళ్ళడం" అన్నారు..

"అలాగే" తలూపి "రాజేష్ వాళ్ళు నాకు ఇవాళే చూపిస్తారా చిన్నత్తా?" అని చిన్నత్తని అడిగాను.. "వాళ్ళెక్కడికీ వెళ్ళలేదే. అదిగో షెడ్లలోనే ఉన్నారు.." అని "అరేయ్ నానీ మీ నాన్న వెళ్తున్నారు గానీ టాటా చెప్పు రా" అని గట్టిగా పిలిచింది.. దూరంగా ఉన్న ఒక షెడ్లోనుంచి ముగ్గురూ బయటకి పరిగెత్తుకుంటూ వచ్చారు..

నాన్న వెళ్ళగానే నానీ "అక్కా పద కోళ్ళ ఫారాలు చూద్దాము... అక్కడ థౌజండ్ కోళ్ళు ఉన్నాయి" అనగానే "కోళ్ళ ఫారం అంటే? థౌజండ్ కోళ్ళేంటి, గుడ్లు కదా" చిన్నత్తని అడిగాను.. "రెండూ ఉన్నాయి కానీ ముందు వెళ్ళి చూసి రా" అని చెప్తే అందరం అటువైపు పరిగెత్తాం..

కానీ కాస్త దూరం వెళ్ళగానే ఏదో పిచ్చి వాసన వచ్చింది.. ముక్కు మూసేసుకుంటుంటే "అది కోళ్ళ వాసనంటక్కా.. నాకూ బాలేదు" నానీ చెప్పాడు.. అక్కడ మూడు పెద్ద పెద్ద షెడ్లు.. ఒక చిన్నది పొడవుగా వరసగా ఉన్నాయి.. వాటిల్లో బోల్డన్ని కోడి పిల్లలు, పెద్ద కోళ్ళు గదుల్లో ఉన్నాయి.. అవన్నీ తెల్ల తెల్లగా భలే ముద్దు గా ఉన్నాయి.. అన్నిటిలో తిరిగి లాస్ట్‌కి చిన్నదాంట్లోకి వెళ్ళాము.. అక్కడైతే గదినిండా నాకంటే బారుగా ఉన్న అట్టపెట్లలో కోడిగుడ్లు పెట్టి ఉన్నాయి..

"ఇన్ని గుడ్లు తింటారా మీరు?" అన్నా.. రాజేష్ "కాదు ఇవన్నీ షాపుల వాళ్ళకి అమ్ముతాము" అన్నాడు.. "అవునా! అయితే మేము కూడా వెళ్ళేటప్పుడు ఇవన్నీ కొనుక్కుంటాము" అని నానీ ఒక వరస అట్టపెట్టెలు చూపించాడు..

"సరే మానాన్నని అడుగు ముందు" అని "పద సిరీ మా రాంబాబు ఇంటికి వెళ్దాం.." అని నా చెయ్యి పట్టుకుని రాజేష్ పరిగెత్తాడు.. ఇంక అప్పటినించీ అందరం అటూ ఇటూ పరిగెట్టడమే!

అత్తయ్య వాళ్ళింట్లో మా ఇంట్లో లాగా గదులు చిన్నగా ఉండవు.. వరసగా మూడు పెద్ద గదులు ఉన్నాయి.. వంట గదైతే వెనకాల వేరేగా ఉంది.. అమ్మ బియ్యం స్టీలు డబ్బాలో పోస్తుంది.. ఇక్కడ ముందు వరండా పక్కనే చిన్న గదిలో అంతా బియ్యమే!! మాకు లాగా మెట్లెక్కి పైకి వెళ్ళి ఆడుకునే డాబా లేదు.. కానీ ఆడుకోటానికి చాలా ప్లేస్ లు ఉన్నాయి..

మరుసటి రోజు పొద్దున్న అత్తయ్య ఇడ్లీ పెట్టి "టిఫిన్లవగానే గుడ్లు ఏరి తెస్తారా?" అంటే అందరం "సరే సరే" అని గబగబా తినేసాం.. మా నలుగురుకీ కింద గడ్డి వేసిన చిన్న చిన్న బకెట్లు ఇచ్చింది.. "గుడ్లు పగలకుండా చాలా నెమ్మదిగా ఒకదాని తర్వాత ఒకటి ఇందులో వేసుకోండి" అని చెప్పింది..

మా ఇద్దరికి అస్సలు తెలీదు కాబట్టి ముందు రాజేష్, రాకేష్ వాళ్ళు ఎలా తీస్తున్నారో చూసి అలానే ఏరుతూ ఉన్నాం.. అన్నీ తెచ్చి చిన్న షెడ్లోకి వెళ్ళి అక్కడ వాళ్ళకి ఇచ్చి బకెట్ ఖాళీ చేసి మళ్ళీ వెళ్ళాం..

చిన్నత్త స్నానానికి రమ్మనగానే బకెట్లు అక్కడే వదిలేసి వెళ్ళాం.. "పెదబాబూ వీళ్ళిద్దరికీ స్నానాల గది చూపించు" అని మా వైపు

తిరిగి "జాగ్రత్త, పక్కన గాబులో నీళ్ళు పాడవకుండా దూరంగా నించుని చేయండి" అంది..

మర్చిపోయా చెప్పటం.. చిన్నత్త, చినమామయ్యా రాజేష్ ని, రాకేష్ ని పెదబాబు, చినబాబు అని పిలుస్తారు.. మా ఇద్దరికీ అలానే పిలవడం వచ్చేసింది..

అందరి స్నానాలు ఆ పెద్ద గాబులో నీళ్ళతోనేనంట.. పొద్దున్నే పాలేరు సీతయ్య వచ్చి చేత్తో కొట్టే పంపుతో నీళ్ళు పట్టి అందులో పోస్తాడంట.. మళ్ళీ సాయంత్రం వరకూ అవే నీళ్ళు.. ఒక్కోసారి సాయంత్రం రాకపోతే మళ్ళీ పొద్దున్న వరకు జాగ్రత్తగా వాడుకోవాలంట.. నేను ఆ పంపు దగ్గరికి వెళ్ళి నీళు పడదామనుకున్నా.. కానీ చాలా గట్టిగా ఉంది.. కొంచెం కూడా కిందకి వెళ్ళలేదు.. మా ఇంట్లో అలా తిప్పగానే నీళ్ళు వచ్చేస్తాయి.. వీళ్ళు అలాంటిది ఎందుకు పెట్టుకోలేదో!?

పెదబాబు, చినబాబు మాకు రోజూ చాలా చాలా చూపించేవాళ్ళు.. పంటకాలువ, వేణుగోపాలస్వామి గుడి, గుడి పక్కన చెరువు, సంత, చిన్న మామయ్య వాళ్ళ పొలాలు, రాంబాబు వాళ్ళ రైస్ మిల్లు.. నాకన్నీ బాగా నచ్చాయి.. పొద్దున్నే గుడికి వెళ్ళి పంతులు గారు పెట్టిన కొబ్బరిముక్క ప్రసాదం తిని, వెనక్కి వెళ్ళి చెరువు గట్టు మీద కాళ్ళు ఆడించుకుంటూ కూర్చుంటాం.. అక్కడికి చాలా మంది వస్తారు.. నన్నూ, నానీ ని చూసి "ఎవరి పిల్లలు?" అని అడిగేవాళ్ళు.. వాళ్ళిద్దరూ "రాజేంద్ర మామయ్య పిల్లలు" అని చెప్పే వాళ్ళు..

అక్కడే ఒక చెట్టు ఉంటుంది.. మా అనిల్ అన్నయ్య అంత ఉండే పిల్లలంతా అదెక్కి, ఒక కొమ్మ మీద నుంచి చెరువులోకి దబుక్కుమని దూకేవాళ్ళు!! మా పెదబాబు కూడా అలా దూకుతాడు.. అచ్చు నా అంతే పొడుగు ఉంటాడు కానీ తనకి చాలా పనులు వచ్చు.. ఇలా చెరువులోకి దూకటమే కాదు, సైకిలు కూడా తొక్కుతాడు!! పక్కతొక్కుడే కానీ చాలా స్పీడ్ గా వెళ్తాడు. వెళ్ళేలోపు నాకు కూడా నేర్పిస్తాను అన్నాడు..

ఒకసారి నానీ "రాజేషన్న, రాకేషన్న ఏరి చిన్నత్తా?" అని వాళ్ళు కనబడక అడిగితే, చిన్నత్త "అన్న ఏంట్రా!? పట్నాల్లో పెరగటం ఏమో కానీ వరసలే మర్చిపోతున్నారు" అంటే "మరి ఏమని పిలవాలి" అని నేనడిగితే "అత్తయ్య, మామయ్య పిల్లలు మీకంటే పెద్దవాళ్ళు అయితే బావ, వదిన అని పిలవాలి.. చిన్నవాళ్ళు అయితే పేరు పెట్టి పిలిస్తే చాలు" అని చెప్పింది..

"అయితే పెద్దత్త వాళ్ళ కల్పనక్క నాకు వదినా?" అని అడిగాను.. "అవును, బాబు గాడు వీళ్ళిద్దరి లాగే మీకు బావ అవుతాడు" అని చెప్పి "ఏంటో అందరూ అక్కలూ, అన్నలే!" అనేసి లోపలికి వెళ్ళిపోయింది.. 'అయితే అమ్మకి చెప్పి ఈసారి నుంచి వాళ్ళని అలానే పిలుస్తాను' అనుకున్నా..

చిన్నత్త పండగ వస్తుందని అప్పచ్చులు చేస్తుంటే చాలా మంది ఆంటీలు వచ్చి ఏదో ఒక పని చేసేవాళ్ళు.. వాళ్ళందరికీ "మా రాజేంద్ర అన్నయ్య పిల్లలు" అని చెప్పేది.. వాళ్ళు నన్ను పట్టుకుని "ఏం చదువుతున్నావమ్మా? మీ నాన్న గారు, అమ్మ గారు ఎప్పుడొస్తున్నారు?" అని అడిగేవాళ్ళు.. ఇంకా వాళ్ళ కూరలు కూడా తెచ్చేవాళ్ళు మాకు పెట్టమని.. కోడిగుడ్లతో చిన్నత్త ఏదో ఒక కూర చేస్తూనే ఉంది.. ఒకసారైతే బుజ్జి బుజ్జి గుడ్లు తో చేసింది.. అంత స్మాల్ ఎగ్స్ నేనెప్పుడూ చూడలేదు.. నానీ అయితే ఫైవ్ వేసుకున్నాడు అవి!!

నాకు పెరుగన్నం అయితే చాలా చాలా బాగుంది అక్కడ.. మధ్యాహ్నం పెరుగు వేసి రాత్రికి మజ్జిగ పోసి పక్కనే చిన్న వెన్న ముద్ద పెట్టేది.. ఓ పరిగెట్టి ఆడుకోవడం, మధ్యలో ఈతకాయలు, తాటితాండ్ర, చెరుకులు, ఇంకా ఏవేవో తినడం.. ఇవే మా పనులు..

ఒకరోజు మేం నలుగరం పంటకాలువ దగ్గర కూర్చుని చెరుకులు తింటున్నాం.. చినబాబు "మునిగి లేచే ఆట ఆడదామా?" అన్నాడు.. "అదేం ఆట?" అని నానీ అడిగితే, "ఈ నీళ్ళలో ఎవరు ఎక్కువసేపు ముక్కు మూసుకుని మునిగిఉంటారో వాళ్ళు గెలిచినట్లు" పెదబాబు చెప్పాడు.. "మరి బట్టలన్నీ తడిసిపోతాయిగా" అని అడిగా..

"మనం కాసేపు ఆడుకుని అప్పుడు ఇంటికి వెళ్దాం.. అప్పటికి అవి ఆరిపోతాయి" అని చెప్పి "ఫస్ట్ నానీ, చినబాబు" ఆడండి

అన్నాడు.. నాని ఓడిపోయాడు.. తర్వాత నేను కూడా చినబాబుతో ఓడిపోయాను.. కానీ అలా నీళ్ళలో బుళుక్కు బుళుక్కుమని మునగడం భలే ఉంది.. చాలా సార్లు అలా మునిగి ఆడిన తర్వాత కరణం గారి బంగళా దగ్గరికి ఎవరు ముందు వెళ్తారో అని పరుగు పందెం పెట్టుకున్నాము..

పెదబాబు చెప్పింది నిజమే!! ఇంటికి వెళ్తుంటే మా బట్టలన్నీ పొడిగా అయిపోయాయి.. దారిలో సీతయ్య కనబడి "పాపా! మీ అమ్మగారు, నాన్నగారు వచ్చారు.. మీ కోసమే ఎతుకుతున్నారు" అని చెప్పాడు.. "ఈసారి ఎవరు ముందు ఇంటికెళ్తారో!" అని పరిగెట్టాను..

అమ్మ మమ్మల్ని చూస్తూనే "ఏంటే ఎక్కడెక్కడ పెత్తనాలు చేసొస్తున్నారు?" అని నవ్వుతూ అడిగింది.. నానీ ఇంక "అమ్మా, చిన్నత్త వాళ్ళకి థౌజండ్ కోళ్ళు ఉన్నాయి తెలుసా!" అన్నీ చెప్పడం మొదలుపెట్టేసాడు.. "మీ చిన్నత్తని విసిగించేసారా బాగా" అని అమ్మ నన్ను దగ్గరికి తీసుకుని "ఏంటే, తలంతా ఇంత తడిగా ఉంది? వర్షం కూడా పడలేదు ఇక్కడ!" అంది..

చినబాబు మేము పంటకాలవ దగ్గర ఆడిన ఆట చెప్పేశాడు.. చిన్నత్త వెంటనే "అవేం పిచ్చాటలు రా!! ఇట్లాంటివి ఇంకోసారి ఆడారని తెలిసిందో ప్రాణాలు తీస్తాను" అని వాళ్ళిద్దరినీ వీపు మీద ఠప్ ఠప్ మని దెబ్బలు వేసింది.. "నువ్వయినా వద్దని చెప్పొద్దేంటే!" అని అమ్మ నా నెత్తి మీద ఒక్కటిచ్చింది.. అంతలో చినమామయ్య "ముందు ఎందుకు ఆడద్దో చెప్పి అప్పుడు వేయండి దెబ్బలు" అని "ఆ కాలవలో పాములూ, పురుగూ పుట్రా ఏవేవో తిరుగుతూ ఉంటాయి.. నీళ్ళు శుభ్రంగా ఉండవు.. అలా మునిగినప్పుడు అలా దేన్నో చూసి మీరు భయపడి, ఇంకాస్త లోతుకి వెళ్ళిపోతే.. లేకపోతే ఊపిరాడక అవి తాగేస్తే ఏమౌతుంది చెప్పండి!?" అన్నారు.. చినమామయ్య అలా చెప్తుంటే చాలా భయం వేసింది..

"సరే, ఇంక పోయి బట్టలు మార్చుకోండి.. మళ్ళీ ఆ పంట కాలువ దగ్గరకి వెళ్ళినట్లు తెలిసిందా మీ వీపులు విమానం మోత మోగుతాయి" ఈసారి ఇంకాస్త గట్టిగా అన్నారు.. మేము లోపలికి పరిగెత్తాం.. లోపలికి వెళ్ళగానే పెదబాబు టంగ్ మని చినబాబు తలమీద ఒకటి ఇచ్చి "ఇంకోసారి మనం పంటకాలవ దగ్గర ఆడిన ఆటలు అమ్మావాళ్ళతో చెప్పావో నేను సైకిలు నేర్పించను" అన్నాడు..

"అదేంటీ మళ్ళీ వెళ్తావా? పాములు ఉంటాయన్నారు కదా, నీకు భయం వేయదా?" అనడిగా..

"మనల్ని దడిపించడానికి అలా అంటారు.. మేము ఎన్నిసార్లు ఆడుకున్నామో ఆ నీళ్ళల్లో.. ఎప్పుడూ పాములు చూడలేదు" అన్నాడు పెదబాబు..

"పెదబాబు గుడ్ బోయ్ కాదనుకుంటా" షర్ట్ గుండీలు పెడుతూ నానితో అన్నా..

తర్వాత రోజే పండగంట.. పొద్దున్నే సీతయ్య స్నానాల గది బయట చెక్కలతో మంట పెట్టి పొయ్యిలా చేశాడు.. దాని మీద పెద్ద కాగులో నీళ్ళు కాస్తుంటే ఒకళ్ళ తర్వాత ఒకళ్ళం తలస్నానం చేశాము.. కుంకుడుకాయ రసం పడి నానీ కళ్ళు ఎర్రగా అయిపోయి ఏడుపు మొదలుపెట్టాడు.. చిన్నత్త వచ్చి "ఇదిగో రా ఈ కల్లుప్పు కొంచెం బుగ్గన పెట్టుకో మంట తగ్గిపోతుంది" అని నోట్లో ఏదో వేసింది..

వెంటనే అది ఊసేసి "ఛీ ఉప్పగా ఉంది" అన్నాదు.. "అలానే ఉంటుంది.. మరి నీకు మంట తగ్గాలా వద్దా!" అని మళ్ళీ ఇంకొంచెం వేసింది..

కొత్తబట్టలు వేసుకుని, పాయసం తిని రాంబాబు వాళ్ళింటికి వెళ్ళి ఆడుకున్నాం.. మధ్యాహ్నం అన్నం తినేటప్పుడు పెదబాబు వాళ్ళ నానమ్మ గారు, ఇంకెవరెవరో వచ్చారు.. చీకటి పడుతూ ఉంటే అమ్మా నాన్నా, చిన్నత్త మామయ్యా, నానమ్మ గారు, మేము అందరం కలిసి గుడికి వెళ్ళాం.. అక్కడ ఒక పంతులు గారు మెడలో దండ వేసుకుని, కాళ్ళకి గజ్జెలు కట్టుకుని, చేతిలో ఏవో పట్టుకుని టంగ్ టంగ్ మని వాయిస్తూ పాటలు పాడుతున్నారు.. నానమ్మ చెప్పింది దాన్ని హరికథ అంటారని..

"తెల్లారే మళ్ళీ ప్రయాణం ఇంక వెళ్దామా రాజీ?" అని అమ్మ అడిగింది..

అదేంటీ! అప్పుడే వెళ్ళిపోతున్నామా!! సూట్ కేసులో ఉన్న బట్టలన్నీ ఇంకా వేసుకోలేదుగా! అలా అని అమ్మతో అంటే "ఎల్లుండి నుంచి స్కూల్ మొదలు.. నువ్విక్కడ నీ బట్టలన్నీ అయిపోయేదాకా ఉంటే మరి నీ స్కూల్ కి ఎవరు వెళ్తారు?" అంది..

"మెయిన్ రోడ్డు కెళ్ళే బస్సు ఏడింటికల్లా వస్తుంది" అని రాత్రి పడుకోబోయేముందు చిన్నమామయ్య అంటుంటే నానీ "నాన్నా, గూడు రిక్షాలో వెళ్దాం" అన్నాడు..

"నలుగురు మనుషులం .. సామాన్లు అన్నీ అందులో పట్టవురా" అని చెప్పి "ఇంక మాట్లాడకుండా గమ్మున పడుకోండి, పొద్దున్నే లేవాలి" నాన్న మంచం దగ్గరికి వెళ్ళారు..

బస్సు ఊళ్ళోంచి వచ్చేస్తుంటే నానీ "అమ్మా, మళ్ళీ ఎప్పుడొస్తాము ఇక్కడికి?" అని అడిగాడు..

"నాన్నా, మనం కూడా చిన్నత్త వాళ్ళ లాగా ఇక్కడే ఉండొచ్చుగా?" అని నేనంటే ఎందుకో..సమాధానమేమీ చెప్పకుండా..నవ్వేసి ఊరుకున్నారంతే..! నాకైతే..ఇంచక్కా..ఇలా చిన్నత్త వాళ్ళ ఊళ్ళోనే ఉండిపోతే ఎంత బావుంటుందో..అని మరీ మరీ అనిపించింది.. బస్సుకిటికీలోంచి చిన్నత్తవాళ్ళ ఊరికి టాటా..చెప్పాను..!

# అడిగి తెలుసుకో

అసెంబ్లీ అయ్యాక అందరం లైన్‌లో క్లాస్ కి వెళ్తుంటే ముందున్న క్రాంతితో గుసగుసగా చెప్పాను, "క్లాసు లోకి వెళ్ళగానే నీకొకటి చూపిస్తాను" అని.. క్లాస్ లోకి వచ్చి ఇంకా సరిగ్గా నా ప్లేస్‌లో కూర్చోనే లేదు, "ఏంటి సిరీ అది?" అని అడిగింది..

నా బుక్స్ బాగ్‌ని వళ్ళో పెట్టుకుని "ఇదిగో చూడు" అని తన వైపు కాస్త వంచి చూపించాను.. అందులోకి తొంగి చూసి "అబ్బా భలే ఉందిగా! ఎక్కడ కొన్నావు?" అని పెద్ద గొంతుతో అంటుంటే నేను "ష్ ష్ ష్. " అని చుట్టూ చూసా ఎవరన్నా విన్నారేమోనని! అప్పటికే శ్రీలత వినేసినట్లుంది, 'ఏంటి సిరీ అది?" అని వెనక బెంచీ నుంచి నన్ను లాగుతా అడిగింది.. 'తర్వాత చూపిస్తాలే శ్రీలత' అని బాగ్ కింద పెట్టేసుకున్నా..

నాన్న నిన్న నాకు ఒక కొత్త పెన్సిల్ తెచ్చారు.. అది మామూలు వాటి కంటే చాలా పెద్దగా ఉంది.. ఇంకా పెన్సిల్ చుట్టూ చిన్న చిన్న మిక్కీ మౌస్ బొమ్మలు ఉండి, చివర బుజ్జి మిక్కీ మౌస్ బొమ్మ అతికించి ఉంది.. అంతకు ముందు ఒక కొత్త రకం పెన్సిల్ తెచ్చి అందరికీ చూపిస్తే అది సాయంత్రంకల్లా పోయింది.. ఎలా పోయిందో, ఎవరు తీసారో అస్సలు తెలీలేదు.. రాత్రి అమ్మ కూడా అంది ఇది కూడా పారేస్తే మళ్ళీ ఇలాంటి మంచి మంచివి కొనమని!

మధ్యాహ్నం అన్నం తినేటప్పుడు శ్రీలతకి నా కొత్త పెన్సిల్ చూపిస్తుంటే క్రాంతి అంది, "తప్పకుండా ఇది రెండు రోజుల్లో ఎవరో ఒకరు తీసేస్తారు సిరీ.. నువ్వు దీన్ని ఇంట్లోనే వాడుకో" అని.. అంతలో శ్రీలత "ఒక పని చెయ్యి, పెన్సిల్ చివర నీ పేరు బ్లేడుతో చెక్కుకో.. అప్పుడు ఎవరు తీయరు" అని అంది..

నాకు ఆ ఐడియా భలే నచ్చింది.. కానీ నా దగ్గర ఇప్పుడు బ్లేడ్ లేదుగా ఇంటికెళ్ళగానే చెక్కుకుంటాను.. మళ్ళీ బాగ్‌లోకి తొంగి చూసి పెన్సిల్ని పుస్తకాల మధ్యలోకి జరిపేసాను..

ఇంతలో రమ టీచర్ వచ్చేసారు.. రాగానే బుక్స్ తీయమని చెప్పకుండా, "రోజూ పొద్దున్నే అసెంబ్లీలో ప్రార్థన, ప్లెడ్జ్ అవ్వగానే మనం ఎవరి క్లాసెస్‌కి వాళ్ళు వెళ్ళిపోతాము కదా, అలా కాకుండా వారానికొక క్లాస్ స్టూడెంట్ చేత ఏదైనా మంచి విషయం మాట్లాడించమని మన ప్రిన్సిపాల్ గారు చెప్పారు.. మరి మీలో ఎవరికైనా ఇంట్రెస్ట్ ఉందా?" అని అడిగారు..

ఇంక అందరూ ఒకేసారి మా పక్కనున్న వాళ్ళతో నువ్వు పేరివ్వు, లేదు నువ్వే ఇవ్వు అనడం మొదలు పెట్టారు.. మళ్ళీ రమా టీచరే "సినిమాలు, చాక్లెట్లు లాంటి విషయాల మీద మాత్రం మాట్లాడకూడదు" అని "మీ నోట్ బుక్‌లో వన్ పేజ్ వచ్చేంత రాసుకుని మాట్లాడితే సరిపోతుంది.. ఇంకా ఎక్కువ అయినా పర్వాలేదు" అన్నారు..

క్రాంతి పక్కనించి "సిరీ, నువ్వు క్లాస్ ఫస్ట్ కదా, నీ పేరివ్వు" అని అంది.. తను కాస్త గట్టిగా అందేమో రమ టీచర్ కూడా నా వంకే చూసారు..

'వన్ పేజీనే గా.. చదవడం, గుర్తు పెట్టుకోవడం ఈజీనే' అనుకున్నా.. వెంటనే చెయ్యి పైకెత్తాను..

రమ టీచర్ "వెరీ గుడ్" అని నా పక్కకొచ్చి, "రేపు డేట్ చెప్తాను.. ఇంతలో దేని గురించి మాట్లాడాలో ఆలోచించుకో" అన్నారు.. తర్వాత నించి నా కొత్త పెన్సిల్ గురించి మర్చిపోయి ఏం మాట్లాడాలా అని అనుకోవటమే!

ఇంటికెళ్ళగానే నానీ "అక్కా నీ కొత్త పెన్సిల్ మీ ఫ్రెండ్స్ అందరికీ చూపించావా?" అని అడగగానే నా పేరు చెక్కాలన్న విషయం గుర్తొచ్చింది.. వెంటనే అమ్మ పూలచెండు కత్తిరించడానికి పెట్టుకున్న బ్లేడ్ తీసుకుని పెన్సిల్ మీద నా పేరు గీరడం మొదలుపెట్టాను.. ఒక్క 'ఎస్' అయ్యేసరికి చాలా టైం పట్టింది.. అంతలో నా నెత్తి మీద ఫట్ మని ఒక దెబ్బ వెంటనే అమ్మ గొంతు "ఏంటే బంగారం లాంటి పెన్సిల్ ని అలా బ్లేడ్ గీకి పారేస్తున్నావు!!".. అప్పుడు శ్రీలత ఇచ్చిన ఐడియా అమ్మకి చెప్పి, "నా పేరుంటే ఇంక దీన్నెవరూ తీసుకోరు కదమ్మా" అన్నా..

కానీ అమ్మ "నిన్ను జాగ్రత్త చేసుకోమన్నది అక్కడా ఇక్కడా వదిలేయకుండా రాయడం అవ్వగానే బాగ్‌లో పెట్టుకోమని.. అంతేగానీ వేరే వాళ్ళ బాగ్‌లో నుంచి వస్తువులు తీసే చెడ్డ గుణం ఉన్నవాళ్ళు దాని మీద పేరు ఉందా లేదా అని చూడరు, అర్థం అయిందా?" అనడిగింది.. నాకర్థం కాలా.. అయినా తల అటూ ఇటూ ఊపాను.. "సరే ఇంక బ్లేడ్ ఇటివ్వు.. చేతులు కోసుకుంటాయేమోనన్న భయం కూడా లేదసలు" అని తీసేసుకుంది.. లోపల నించి మళ్ళీ వచ్చి "పద అమ్మమ్మ వాళ్ళింటికి వెళ్ళొద్దాము.. కొత్త టమోటా పచ్చడి ఇస్తాను రమ్మంది" అని నా చేయి పట్టుకుని బయటకి నడిచింది..

మా అమ్మమ్మ తాతయ్య వాళ్ళ ఇల్లు చాలా దగ్గరే.. రంగయ్య తాత కొట్టు దాటి, చెరుకురసం బండి రాగానే సందులోకి తిరగగానే వచ్చేస్తుంది.. అమ్మమ్మ తాతయ్య ఇద్దరూ ఇంట్లోనే ఉంటారు.. అమ్మ లాగా ఇద్దరూ టీచర్లేనంట.. కానీ చాలా రోజులు స్కూల్ కెళ్ళిన తర్వాత రెస్ట్ తీసుకుందామని ఇంట్లోనే ఉన్నారంట.. తాతయ్య అయితే హెడ్మాస్టర్ అంట.. అంటే టీచర్లందరికీ పెద్ద టీచర్ అన్న మాట..

గేట్ తీస్తుంటే గర్‌ర్ ర్‌ర్ అని శబ్దం వచ్చింది.. "ఎవరదీ" తాతయ్య గొంతు వినిపించింది.. "మేమే నాన్నా" అంటూ అమ్మ చెప్పులు విప్పి "కాస్త బయట లైట్ వేసుకోవచ్చు కదా" అని లోపలికి వెళ్ళిపోయింది..

తాతయ్య నా చేయి పట్టుకుని "సిరీ ఎలా చదువుతున్నావు? లెక్కల్లో మంచి మార్కులు వస్తున్నాయా?" అనడిగారు.. "మొన్న సండే వచ్చినప్పుడే కద తాతయ్యా అడిగావు.. మళ్ళీ ఎగ్జామ్స్ ఏమీ జరగలేదు" అని చెప్పా.. "పరీక్షలు లేవని లెక్కలు చేయడం మానేయకు.. ఎక్కాలు బాగా గుర్తు పెట్టుకుంటున్నావా?" అని మళ్ళీ అన్నారు..

నాకు తాతయ్యే చెప్పారు టేబుల్స్‌ని తాతయ్య వాళ్ళ స్కూల్ లో ఎక్కాలు అనే వాళ్ళంట.. "బాగా నేర్చుకుంటున్నా తాతయ్యా.. నాన్న చూడకుండా కూడా రాయిస్తున్నారు" అన్నా.. "మరి పన్నెండు ఆర్లు ఎంత?" అనడగుతూ కుర్చీలో కూర్చున్నారు..

'పన్నెండా! నైన్ తొమ్మిది.. టెన్ పది.. లెవన్ పదకొండు.. ట్వెల్వ్ పన్నెండు' లోపలే అనుకుని "అమ్మో లేదు తాతయ్యా నాకు టెన్ వరకే వచ్చు.. లెవన్ నించి తర్వాత క్లాస్ లో నేర్చుకుంటాను" అని చెప్పాను.. "మీ పెద్దమామయ్య నాలుగో తరగతికి వచ్చేసరికే ఇరవై వరకూ అప్పచెప్పేవాడు.. అందుకే పెద్ద ఇంజనీర్ అయ్యాడు.. మరి నువ్వు అలా అవ్వాలంటే ఇలా చదివితే లాభం లేదు" అంటుంటే "సరే ఇంక బాగా చదువుతా తాతయ్యా" అని చెప్తుంటే "నా తల్లే.. నా తల్లే" అని వళ్ళో కూర్చోబెట్టుకున్నారు..

తాతయ్యకి బాగా చదివేవాళ్ళంటే చాలా ఇష్టమని అమ్మ ఎప్పుడూ చెప్తుంది.. మాట్లాడితే లెక్కలు, ఇంగ్లీషు గ్రామరు అని ఏదో ప్రశ్న వేస్తారు.. "ఇంగ్లీషు మీడియంలో చదివితే సరిపోదు గ్రామరు బాగా తెలియాలి" అంటారు.. అదేదో పెద్ద పుస్తకం ఇచ్చి దేనికి అర్థం తెలీకపోయినా ఇందులో ఉంటుందని చెప్తారు..

"ఇవాళ స్కూల్లో ఏం చెప్పారు?" అని తాతయ్య అడుగుతుంటే నాకు మా రమా టీచర్ చెప్పిన విషయం గుర్తొచ్చింది.. వెంటనే తాతయ్యకి చెప్పేసాను.. "బావుందే! అప్పుడే పిల్లలతో ప్రసంగాలు ఇప్పిస్తున్నారు" అంటుంటే "ప్రసంగం అంటే?" అనడిగా.. "అదే తల్లీ మీ చేత మాట్లాడిస్తున్నారు కదా.. ఇంతకీ నువ్వు దేని మీద మాట్లాడుతున్నావో చెప్పావా?" అనడిగితే "లేదు తాతయ్యా.. నువ్వే చెప్పవా" అని తాతయ్య వళ్ళోంచి జారి చేతులు పట్టుకుని ఊపుతూ అడిగాను..

"నీకే విషయం అంటే ఇష్టమో దాని గురించి మాట్లాడు సిరీ" అని తాతయ్య చెప్తుండగానే "అయితే అప్పుడు మనందరం కలిసి తిరుపతి వెళ్ళాము కదా.. సెవన్ కొండలు బస్సులో వెళ్ళాము.. నాకది బాగా ఇష్టం.. దాని గురించి చెప్పనా?" అని తాతయ్య వంకే చూసాను..

"అది మంచి ఆలోచనే కానీ ఇలా అందరి ముందూ మాట్లాడేటప్పుడు మంచి విజ్ఞానదాయకమైన విషయం గురించి మాట్లాడితే మీ టీచర్లు ఇంకా మెచ్చుకుంటారు.." "విజ్ఞాన.." అని నాకు నోరు తిరగక పేసాను.. "నీ మొహం.. తెలుగు పదాలు కూడా సరిగ్గా పలకడం లేదు నువ్వు" అని కసిరి "ఎవరన్నా సైంటిస్ట్‌లు, ఇన్వెంటర్స్ గురించి మాట్లాడు తల్లి, బావుంటుంది" అన్నారు..

నాన్న ఎప్పుడూ అంటారు సైంటిస్ట్‌లు అంటే మనకి పనికి వచ్చే వాటిని కనిపెడుతూ ఉంటారంట.. వాళ్ళు చాలా చాలా తెలివైన వాళ్ళంట!! మరి ఇన్వెంటర్స్ అంటే ఎవరో!?

అంతలో తాతయ్య లేచి వెళ్ళి ఒక బుక్ తెచ్చారు.. "ఇందులో అలాంటివాళ్ళ వివరాలు చాలా ఉన్నాయి.. నువ్వే చూసుకో ఎవరి గురించి మాట్లాడాలో" అని అది నాకిచ్చారు.. అంతలోనే "అందులోంచి ఒక్క పేజీ అన్నా చిరిగినట్లు నలిగినట్లు కానీ కనిపిస్తే ఊరుకోను.. జాగ్రత్త!" అని చెప్పారు..

అమ్మతో ఇంటికి వస్తూ చెప్పాను, మాకు స్కూల్లో చెప్పిన విషయం, ఇంకా తాతయ్య పుస్తకం ఇచ్చిన సంగతి.. "అంతమంది ముందు మాట్లాడగలవేమే!!" అనడిగింది.. "ఎందుకు మాట్లాడలేనమ్మా.. మా టీచర్స్ అందరూ నాచేతే కదా టెక్స్ట్ బుక్ చదివిస్తారు.. అప్పుడు అందరి ముందూ టిచర్ పక్కనే నిలబడి చదువుతాను.. నాకేం భయం లేదు" అని చెప్పాను..

అమ్మ నాన్నతో చెప్పి "ఏంటో ఈ వయసులోనే వీళ్ళ చేత స్పీచ్ లు ఇప్పించేస్తున్నారు!" అంది.. నాన్నేమో "ఇప్పించనీ మంచిదేగా" అని నావైపు తిరిగి, "మరి దేని గురించి చెప్తావు సిరి తల్లీ" అని అడిగారు..

తాతయ్య ఇచ్చిన బుక్ చూపించాను.. కాసేపు పేజీలు తిప్పి "చాలా మంచి పుస్తకం.. ఇందులో రేడియో, టెలిగ్రాఫ్, పెన్సిలిన్ , విమానం, ఎలెక్ట్రిక్ బల్బ్ ఇలా ఎన్నో విషయాలు కనిపెట్టిన వాళ్ళ వివరాలు ఉన్నాయి.. నీ ఇష్టం మరి" అని చెప్తుంటే "ఎయిరో ప్లేన్ సైంటిస్ట్ నాన్నా" అని అరిచాను.. "వెరీ గుడ్, కానీ సైంటిస్ట్ కాదు ఇన్వెంటర్.. అది కూడా ఒక్కరు కాదు ఇద్దరు" అని నాన్న పేజీ తీసి

నాకిచ్చారు..

"ఆ తేడా ఏంటో కూడా చెప్పండి" అమ్మ వెనక గది నించి గట్టిగా అంది.. నాన్న "ఇన్వెంటర్ అంటే అప్పటి వరకూ ఎప్పుడూ ఎవరూ కనుక్కోని కొత్త విషయాన్ని కనుక్కునేవాళ్ళు.. ఎయిర్ ప్లేన్‌ని రైట్ బ్రదర్స్ ముందు ఎవరూ కనిపెట్ట లేదు.. ఇక సైంటిస్ట్ అంటే సైన్స్ గురించి బాగా చదివి, ఎక్స్‌పరిమెంట్లు చేసి అందరికీ పనికి వచ్చే వస్తువులు, మందులు, లాంటివి తయారు చేస్తారు" అని నాన్న చెప్తే "మరి ఇద్దరిలో ఎవరికి చాలా తెలివి ఉంటుంది నాన్నా?" అని అడిగాను..

"ఇద్దరూ తెలివైన వాళ్ళేనమ్మా, ఒక్కోసారి ఒకళ్ళే రెండు పనులూ చేస్తారు" అంటుంటే "అయితే నేను పెద్దయ్యాక అదే అవుతా నాన్నా.. డాక్టరు చదవను" అని అన్నా..

"సరే దానికి ఇంకా చాలా టైం ఉంది కానీ ముందు ఈ రైట్ బ్రదర్స్ గురించి రాసిస్తాను నీకు" అని బుక్ తీసుకున్నారు.. తర్వాత నాన్న నన్నూ, నానీ ని పిలిచి వాళ్ళ గురించి చెప్తుంటే భలే బావుంది..

రైట్ బ్రదర్స్ అంటే  ఆర్విల్ రైట్, విల్బర్ రైట్ అనే అన్నదమ్ములంట.. అమెరికా అనే దేశం లో పుట్టి పెరిగారంట.. మొత్తం ఏడు మంది రైట్ పిల్లలలో వీళ్ళిద్దరే ఎప్పుడూ కలిసి ఆడుకోవడం చేసేవాళ్ళంట.. వాళ్ళ నాన్నగారు ఉద్యోగం కోసం వేరే వేరే ఊళ్ళు మారుతుంటే వీళ్ళు కాలేజీ కూడా వెళ్ళలేకపోయారంట.. ఇద్దరూ ఎప్పుడూ పక్షుల వెనకే తిరుగుతూ అవి ఎలా ఎగురుతున్నాయో.. ఎలా రెక్కల్ని  ఆడిస్తున్నాయో చూస్తూ మనమూ అలానే ఎగిరితే ఎంత బావుంటుందో కదా అనుకుని, సైకిల్ షాప్ నించి పాత ట్యూబులు, రేకులూ లాంటివి తెచ్చి ఫస్ట్ విమానాన్ని చేసారంట!!

నాన్న రాసిచ్చిందంతా నాకు టూ డేస్‌లో వచ్చేసింది.. మధ్యలో క్రాంతి వాళ్ళు, రమా టీచర్ అడిగారు దేని గురించి మాట్లాడుతున్నావని.. విమానం కనిపెట్టిన వాళ్ళ గురించి అని చెప్తే టీచర్ "నిజంగానా! మంచి టాపిక్.. మరి బాగా ప్రాక్టీసు చేసుకో" అన్నారు.. ఇంకా ప్రాక్టీస్ ఏమిటి నాకు చూడకుండా చెప్పడం ఎప్పుడో వచ్చేసిందిగా అనుకున్నా.. అప్పుడే మా కన్నా పెద్ద క్లాసుల్లో ఉండే వాళ్ళు, మా 'ఎ' సెక్షన్  నించి రమేష్ అందరూ ఒక్కొక్కళ్ళు మాట్లాడేస్తున్నారు.. తర్వాత టీచర్ చెప్పారు, వచ్చే మండే నే నువ్వు అసెంబ్లీ లో మాట్లాడాలని..

రోజు పొద్దున్నే త్రీ టైం స్ చదివాను మళ్ళీ.. అమ్మ కి కూడా చూడకుండా చెప్పాను.. అమ్మ అంది, "బాగా చెప్పావు.. అక్కడ కూడా ఇలానే చెప్పు.. ఏం భయపడకు.. సరేనా".. అసెంబ్లీ లో ప్రేయర్ అయిన తర్వాత మా హెడ్ మిస్ మైక్ లో నా పేరు చెప్పగానే నేను లేచి వెళ్ళాను.. మా రమ టీచర్ కూడా వచ్చి నా పక్కనే నిలబడ్డారు.. నేను చిన్నగా ఉన్నానని మైక్ ని కిందకి వంచేసారు.. టిచర్ పక్కనించి "ఒకసారి 'నమస్తే' అని చూడు సరిగ్గా పలుకుతుందో లేదో" అనగానే నేను ఒక్కసారే "నానీగా" అని అరిచినట్లు "నమస్తే" అన్నాను... అంతే మైక్ లోంచి ఎంత పెద్దగా వినిపించిందో! ఇంకా కుయ్‌య్ య్‌య్ మని శబ్దం కూడా వచ్చింది.. వెంటనే టీచర్ "ష్ ష్ ష్ అంత పెద్దగా కాదు.. నాతో ఏదన్నా చెప్తుంటే ఎలా మాట్లాడతావో అలా నెమ్మదిగా మాట్లాడు" అన్నారు.. అంతలో పిల్లల్లోంచి ఎవరో కొంతమంది నవ్వినట్లు కూడా అనిపించింది.. 'ఎవరా!?' అని ముందుకి చూసాను.. అంతే! ఇంతమంది మా స్కూల్లో ఎప్పుడు చేరారు అనుకున్నా.. పెద్దవాళ్ళు, చిన్నవాళ్ళు అందరూ వరుసగా నిలబడి నా వంకే చూస్తున్నారు.. నాకు పొట్టలో ఏమిటోగా అనిపించింది.. రమ టిచరేమో 'ఇంక చెప్పు సిరీ" అంటున్నారు..

నేను నెమ్మదిగా

""Today I would like to talk about Wright Brothers who invented the Aeroplane.. Wilbur Wright and Orville Wright are the two brothers of seven children. They both.."  అని అలా పక్కకి కళ్ళు తిప్పాను..

అస్సలు చూడలేదు, మా ప్రిన్సిపాల్ గారి రూం అక్కడే ఉంది.. రూం కిటికీ లోనుంచి ప్రిన్సిపాల్ గారు నావంకే చూస్తున్నారు..

నాకింకా చాలా భయం వేసేసింది.. ఠక్కున ముందుకి కళ్ళు తిప్పేసుకున్నా.. అక్కడ ఎదురుగా ఉన్న లైన్లో వాళ్ళు ఏదో నవ్వుతూ అనుకుంటూ నా వంకే చూస్తూ అంటున్నారు.. ఎక్కడో దూరంగా ఒక చెయ్యి గాల్లో పైకి లేచి నాకు టాటా చెప్తుంది.. మళ్ళీ పక్కనుంచి రమా టీచర్, "సిరీ టైం ఎక్కువ లేదు, తొందరగా చెప్పమ్మా" అన్నారు..

అయ్యో ఎక్కడ పానో గుర్తు రావటం లేదేంటి.. ఇంకా చాలా భయం వచ్చేసింది.. కాళ్ళు వణుకుతున్నాయి.. టీచర్ నా చెయ్యి పట్టుకుని "They both. తర్వాత?" అంటున్నారు.. నేను ఒకసారి కళ్ళు మూసుకుని చదివింది గుర్తు తెచ్చుకుందామనుకున్నా.. ప్చ్ కొంచెం కూడా గుర్తు రాలేదు..

అంతలో గేమ్స్ టీచర్ వచ్చి "పాపం భయపడుతున్నట్లు ఉంది ఇంక చాల్లెండి" అని అన్నారు.. రమా టీచర్ కూడా తల ఊపేసరికి నేను మా క్లాసు వాళ్ళున్న వైపుకి పరిగెత్తాను.. నా బాగ్ తీసుకుంటుంటే అందరూ "ఏంటి అలా ఆపేసావు?" అని అడగడం మొదలు పెట్టారు.. అసలక్కడికి వెళితే ఎంత భయం వేస్తుందో చెప్తుంటే నాకు ఏడుపు వచ్చేసింది..

క్లాసులోకి వచ్చాక కూడా ఆగలేదు.. "టీచర్ వస్తున్నారు సిరీ" అంటూ గుసగుసలాడింది.. తలెత్తి చూస్తే రమా టీచర్ ఎదురుగా ఉన్నారు.. "అలా ఏడవకు సిరీ.. ఏం పర్వాలేదు, ఈసారి బాగా నేర్చుకుని చెబుదువుగానీ" అంటుంటే "అమ్మో మళ్ళీనా!!" అనుకున్నా.. చైర్ దగ్గరికి వెళ్ళబోతూ వెనక్కి తిరిగి "ఇంతకీ ఇంట్లో చెప్పావు కదా ఇవాళ అసెంబ్లీ లో మాట్లాడాలని?" అనడిగారు.. "యెస్ టీచర్" అంటే "మరి మీ పేరెంట్స్ నీతో సరిగ్గా ప్రాక్టీస్ చేయించలేదా!? అయినా ఎన్ని రోజుల ముందు చెప్పాను నీకు!" అక్కడే నుంచుని అడిగారు.. "మా నాన్న గారే నాకు పేపర్ మీద రాసిచ్చారు టీచర్" అంటే "రాసివ్వడం కాదు, అంతమంది ముందు నిలుచుని ఎలా మాట్లాడాలో, చదివింది ఎలా గుర్తు ఎలా పెట్టుకోవాలో చెప్పాలి కదా!" అనేసి వెళ్ళిపోయారు..

ఇంటికెళ్ళగానే అమ్మ అడిగింది 'ఎలా చెప్పావే' అని.. నాకు అక్కడ నుంచో గానే ఎంత భయం వేసిందో, అంతా ఎలా మర్చిపోయానో చెప్తూ "అమ్మా, బోల్డు మంది ముందు ఎలా మాట్లాడాలో మీ పేరెంట్స్ ఎందుకు చెప్పలేదని మా రమా టీచర్ అన్నారు.. మరి.." అని నేనింకా చెప్తున్నా అమ్మ "మేము నేర్పించడం ఏమిటి!! ఇంత చిన్న పిల్లల చేత అంత మంది ముందు స్పీచ్ లిప్పించమని మేము చెప్పామా!? అసలు ఆలోచన వచ్చినపుడు ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో నేర్పించకుండా అంతా పెరెంట్స్ మీద తోసేయడమే!" కోపంగా అంటుంటే అప్పుడే లోపలికొచ్చిన తాతయ్య "ఏంటి లక్ష్మీ ఎవరి మీద కోపం" అన్నారు.. అమ్మ అంతా చెప్పి "అమ్మా నాన్నా తేరగా ఉన్నారని ప్రతీ విషయాన్ని వాళ్ళకి వదిలేయడం!!" అంటుంటే "అదేంటీ, నువ్వు కూడా టీచరువే కదా.. వాళ్ళు ఏది ఎందుకు చేస్తారో నీకు తెలీదా!? సరే నాక్కొంచెం మంచినీళ్ళివ్వు" అని నా చేయి పట్టుకుని టీవి రూం లోకి వెళ్ళారు..

"అయినా సిరీ, ఏదైనా కొత్త పని చేసేటప్పుడు ఎలా చేయాలో మీ అమ్మానాన్నని కానీ ఇంకెవరినైనా కానీ అడగాలనే విషయం నీకు తెలీదా? నీకు తెల్సు కదా వాళ్ళిద్దరికీ ఎన్ని పనులుంటాయో, నువ్వు అడగకపోతే వాళ్ళకెలా తెలుస్తుంది నీకేమి కావాలో? కనీసం నన్నన్నా అడగలేదు, రోజు పుస్తకం తీసుకున్నావు మళ్ళీ కనిపించలేదు!"

అదేంటీ టీచరేమో పేరెంట్స్ ఎందుకు నేర్పించలేదు అన్నారు.. అమ్మేమో టీచరే చెప్పాలంది.. ఇప్పుడు తాతయ్యేమో 'ఎందుకు ఎవరినీ అడగలేదని' నన్ను తిడుతున్నారు!

అంతలో తాతయ్యే "ఎందుకమ్మా అలా బిక్కమొహం పెట్టావు.. అసలు వాళ్ళే నీకు అన్నీ వివరించి చెప్పాలి.. అలా చేయనప్పుడు అడిగి తెలిసికోవడం తప్పు కాదు.. స్కూల్లో ఏదైనా కొత్త రకమైన వర్క్ చేస్తే ఎందుకు చేయమన్నారు అంతకన్నా ముంఖ్యంగా ఎలా చేస్తే అందరూ మెచ్చుకుంటారు లాంటి ప్రశ్న లన్నీ నీకు రావాలి" "అలా అడుగుతుంటే అమ్మే 'నువ్వు ఒక ప్రశ్న ల పుట్టవే' అంటుందిగా తాతయ్యా?" అని నేను మధ్యలో అడ్డు వచ్చి అన్నాను..

"పని ఎక్కువగా ఉన్నప్పుడు అలా అని ఉంటుందిలే.. ప్రతి విషయాన్ని బాగా పరిశీలించడం .. తెలుసుకోవాలన్న కుతూహలం

నీకు ఇప్పటినుంచే ఉండాలి.. అలా ఉండబట్టే నువ్వు చదువుకున్న రైట్ బ్రదర్స్ విమానాన్ని కనిపెట్టారు" అని తాతయ్య చెప్తుంటే "అలాగే అడుగుతాను తాతయ్యా.. పెద్దయ్యాక నాకు మాత్రం కనిపించే పెన్సిల్ ని కనిపెడతాను" అంటుంటే తాతయ్య పెద్దగా నవ్వారు..

"అసలు టేబుల్స్ ఎందుకు నేర్చుకోవాలి తాతయ్యా?" ఎప్పుడూ అడుగుదామని, తాతయ్యకు కోపం వస్తుందేమోనని భయపడి అడగని ప్రశ్న అడిగాను...

# క్రికెట్ వీరుడు

ట్రాఫిక్ పోలీసు అటూ ఇటూ వస్తున్న బళ్ళని ఆపి మా వంక చూసి చెయ్యి ఊపగానే మేము గుంపుగా గబా గబా రోడ్డు దాటి ఫుట్ పాత్ ఎక్కేసాము.. సాయంత్రం రావడానికి కుదరదని సాంబయ్య మొన్నే చెప్పాడు.. మా రిక్షా లో వచ్చే శ్రీధర్, కావ్య వాళ్ళ ఇళ్ళు కూడా మా ఇంటికి దగ్గరే కాబట్టి అందరం కలిసి నడిచి వచ్చేస్తామని మా ఇళ్ళల్లో చెప్పాము..

ఇలా రోడ్డు మీద కబుర్లు చెప్పుకుంటూ వెళ్తుంటే బావుంది.. శ్రీధర్ మా క్లాసే కానీ నానీకి బాగా ఫ్రెండ్. మా ఇంటికొచ్చి నానీతో ఆడుకుంటూ ఉంటాడు.. కావ్య నా కంటే చిన్నది.. ఎక్కువ మాట్లాడదు.. అందరి కంటే ఫస్ట్ వాళ్ళ ఇల్లే వస్తుంది.. తనని దించేసి మేము ముగ్గురం నడుస్తుంటే శ్రీధర్ "నానీ, నా దగ్గర కొత్త సచిన్ పోస్టర్ ఉంది చూస్తావా?" అనడిగాడు.. నానీ వెంటనే నా వంక చూసి "అక్కా టూ మినిట్స్ లో చూసి వచ్చేద్దాము, ప్లీజ్ ప్లీజ్" అని బతిమాలాడాడు.. "సరే పద తొందరగా వచ్చేద్దాము" అని శ్రీధర్ తో పాటు వాళ్ళింటికి వెళ్ళాము..

శ్రీధర్ వాళ్ళ నాన్న గారు రైల్వే లో పెద్ద ఆఫీసర్ అంట.. అందుకే వాళ్ళు రైల్వే క్వార్టర్స్ లో ఉంటారు.. అక్కడ అపార్ట్మెంట్స్ లా ఉండే ఇళ్ళు చాలా ఉంటాయి.. వాటికి కొంచెం దూరం లో పాతగా ఉండే పెద్ద పెద్ద ఇళ్ళు కూడా ఉంటాయి.. వాటిని బంగళా అంటారంట.. శ్రీధర్ వాళ్ళు బంగళాలోనే ఉంటారు.. బయటికి పాతగా కనిపించినా ఇల్లు చాలా పెద్దది.. లోపల బోల్డన్ని గదులుంటాయి.. ఒక్కొక్కళ్ళకి ఒక్కో గది ఉంటుంది.. ఇంటి వెనక మామిడి, నేరేడు, బాదం, చీంచింతకాయ లాంటి చెట్లు చాలా ఉంటాయి.. నేను శ్రీధర్ వాళ్ళింటికి వచ్చేది ఈ కాయలు కోసుకోడానికే!

నానిని శ్రీధర్ తన గదిలోకి తీసుకెళ్ళాడు.. నేను తిన్నగా వెనక్కి వెళ్ళాను.. అక్కడ ఆంటీ వాళ్ళ పనబ్బాయితో ఏవో పూలమొక్కలు పెట్టిస్తున్నారు.. నన్ను చూడగానే "ఏంటి సిరీ ఇంకా ఇంటికెళ్ళలేదా?" అనడిగారు.. శ్రీధర్ నానీకి చూపిస్తానన్న పోస్టర్ గురించి చెప్పాను.. ఆంటీ నవ్వి "ఇంట్లో అందరూ బావున్నారా?" అనడిగితే నేను "బావున్నారాంటీ" అని తలూపి అక్కడున్న చెట్ల వంక చూసాను, ఏమన్నా కాయలు కనబడతాయేమోనని..

ఒక్క చీంచింతకాయలు తప్ప ఇంకేం కాయలు కనిపించలేదు.. చెట్టు కిందకెళ్ళి కింద పడిన కాయల కోసం అటూ ఇటూ చూస్తుంటే ఆంటీ అన్నారు, "ఉండు సిరీ, రాజుతో చెట్టుమీదున్నవి కోయిస్తాను".. అంతలో నేను లోపలికెళ్ళి ప్లాస్టిక్ కవర్ తెచ్చుకున్నా.. ఆ సంచి నిండా కోయించుకుని, ఆంటీకి థాంక్స్ చెప్పేసరికి నానీ కూడా వచ్చాడు..

ఇంట్లోకి అడుగు పెడుతూనే అమ్మ "ఇంతసేపు పట్టిందేమిటి.. మీ కోసం చూస్తూ ఇంట్లోకి బయటకీ లోపలికీ ఎన్నిసార్లు తిరిగానో తెలుసా!" అని గట్టిగా అడుగుతూ వచ్చింది.. శ్రీధర్ చూపించిన పోస్టర్ గురించి నానీ చెప్తుంటే అమ్మ "అలా మీ అంతట

మీరు చెప్పా పెట్టకుండా అక్కడా ఇక్కడా తిరిగేసి వస్తే ఇంట్లో ఎంత కంగారు పడతారో ఆలోచించారా?" అని కోప్పడుతుంటే "నానీ టూ మినిట్స్ అని చెప్పాడమ్మా అందుకే వెళ్ళాము" అని తప్పంతా వాడి మీదకి తోసేసా..

"టూ మినిట్స్ ట్వెంటీ మినిట్సో ఇంటికొచ్చి చెప్పి వెళ్ళాలని పెద్దదానివైనా నీకు తెలీదా?" అమ్మ మళ్ళీ నన్నే తిట్టింది.. ఎప్పుడూ ఇంతే!! వాడి తప్పులకి కూడా నన్నే తిడుతుంది.. గబగబా లోపలికి వెళ్తుంటే "మళ్ళీ కోపానికేం తక్కువలేదు, ఇంతకీ ఆ సంచిలో ఏమున్నాయి?" అనడిగింది..

"చీంచింతకాయలు" అని చెప్పి సంచి అక్కడే పెట్టాను.. "చీంచింతకాయలేంటి నీ మొహం.. సీమ చింతకాలు అను" అని సంచిలోకి చూసి "చాలానే తెచ్చుకున్నావే!" అంది.. "రేపు స్కూల్ కి తీసుకెళ్తానమ్మా.. మా ఫ్రెండ్స్ అందరికీ పంచుతాను" అని చెప్పాను..

"సర్లే.. అదే పనిగా ఇవే తినకండి.. గొంతులో నుస చేరి పాడైపోతుంది" అని ఒకటి తీసుకుని వెళ్ళిపోయింది.. అమ్మ అటు వెళ్ళగానే నానీ నా పక్కకొచ్చి "అక్కా, ఇందాక శ్రీధర్ చెప్పాడు, వచ్చే సండే చాలామంది కలిసి గ్రౌండ్స్ లో క్రికెట్ మాచ్ ఆడుతున్నారంట.. వీళ్ళ టీంలో ఒక్కళ్ళు తక్కువయ్యారంట.. నన్ను రమ్మంటున్నాడు.. నా దగ్గర బాట్ కూడా ఉందిగా నాకు వెళ్ళాలని ఉంది.. అమ్మానాన్న ఒప్పుకుంటారా?" అని మెల్లగా చెప్పాడు..

"ఎందుకొప్పుకోరు.. నువ్వు చిన్నవాడివిగా అన్నీ ఒప్పుకుంటారు.. వెళ్ళి అడుగు" అని కాళ్ళు నేలకేసి దబదబా కొట్టుకుంటూ అక్కడనించి వెళ్ళిపోయాను. అలా నడిస్తే అమ్మకి చాలా కోపం.. "ఏంటా నడవడం.. ఇంటికి మంచిది కాదు" అంటుంది.. అదే అమ్మమ్మ అయితే "ఆడపిల్లవయ్యుండి ఏంటా నడక.. నెమ్మదిగా నడవలేవూ!" అని ఇంకాస్త గట్టిగా అరుస్తుంది.. కాసేపు ఆడపిల్లని.. కాసేపు ఇద్దర్లో పెద్దదాన్ననీ అన్నిటికీ నన్నే తిడతారు!!

మర్నాడు నేను చీంచింతకాయలు తీసుకెళ్ళి మా ఫ్రెండ్స్ అందరికీ పంచాను.. వాటిలో ఉండే చిన్న చిన్న నల్ల గింజలతో మేమొక ఆట ఆడతాము.. పైనున్న నల్ల తొక్కు తీసేసి గింజని రెండుగా చీల్చాలి.. అదీ 50 లెక్కపెట్టేలోపు! మేం పోటీగా ఆ గింజలని వలుస్తుంటే శ్రీధర్ వచ్చాడు.. "సిరీ, రేపు మాతో ఆడటానికి నానీ వస్తున్నాడా?" అని అడిగాడు..

"నాకేం తెల్సు? నువ్వే వెళ్ళి అడుగు" అని చెప్పా.. "ప్లీజ్ చెప్పు సిరీ" ఏందుకో పాపం బతిమాలుతూ అడిగాడు.. పోనీలే నిన్న వాళ్ళింటినించే కదా ఇన్ని చీంచింతకాయలు తెచ్చుకుంది అనుకుని, "వాడింకా ఇంట్లో చెప్పనేలేదు శ్రీధర్.. మరి నాన్న ఒప్పుకుంటారో లేదో తెలీదు.. ఇంతకీ ఎంతసేపు ఆడతారు?" అని అడిగా.. మళ్ళీ వాడు ఆడుకునే టైం నా టైం కంటే ఎక్కువైతే ఎలా!

"పొద్దున్న టిఫిన్ తినేసి వెళ్ళి మళ్ళీ మధ్యాహ్నం అన్నం టైం కి వచ్చేస్తాము" అని చెప్పి "సిరీ, నువ్వు కూడా చెప్పు నానీ ని పంపమని.. మా టీం లో బాట్ ఉన్నబ్బాయి ఇంక మాతో ఆడటానికి రానని చెప్పాడు" అంటుంటే నాకు అప్పుడు అర్థం అయింది.. "ఓ! నానీ దగ్గర బాట్ ఉందనా ఇంత బతిమాలుతున్నాడు!" అనుకున్నా.. పైకి మాత్రం "చెప్తాలే.. నాన్న వాడితో ఎప్పుడూ 'అక్కని చూసి నేర్చుకో' అంటారు.. నేను కూడా అడిగితే పంపిస్తారు" అని గర్వంగా చెప్పాను..

ఇంటికి వెళ్తూ ఒకవేళ అమ్మానాన్నా వద్దంటే నేను కూడా నానీ తరుపున ఎలా బతిమాలాలా అని అలోచించాను.. నేను స్నానం చేసి వచ్చేసరికి నానీ ఎగురుకుంటూ వచ్చి "అక్కా, నాన్న సరే అంటే అమ్మ వెళ్ళమంది" అన్నాడు.. 'అదేంటీ అమ్మ అలా ఒప్పేసుకుంది! అదే నేను రేఖతో ఎక్కడికన్నా వెళ్తానంటే చాలా ప్రశ్నలు వేసి వద్దు అనేస్తుంది! వీడు చిన్నోడు కదా.. ఏమైనా చేయొచ్చు!!' నాకు కోపం వచ్చి డ్రాయింగ్ బుక్ తీసి ఏదో బొమ్మ గీస్తూ కూర్చున్నా..

నాన్న కూడా ఒప్పుకున్నారుగా ఇంక వీడికి ఎంత సంతోషమో!! బాట్ తీసి దాన్నొక పది సార్లు తుడిసాడు.. అది పట్టుకుని బాల్ ని కొడుతున్నట్టు ఎక్కడ పడితే అక్కడ ఫోజులు కొట్టడం మొదలు పెట్టాడు.. సండే అయితే మా అందరి కంటే ముందే లేచి రెడీ

అయిపోయాడు.. టిఫిన్ హడావిడిగా కొంచెం కొంచెం తినేసి, షూ వేసుకుని, బాట్ పట్టుకుని రెడీ అయిపోయాడు..

"అదేంట్రా ఇంకా తొమ్మిది కూడా కాలేదు.. ఒక్కళ్ళు కూడా వచ్చి ఉండరు" అని అమ్మ అంటే "నేను శ్రీధర్ వాళ్ళింటికెళ్ళి ఇద్దరం కలిసి వెళ్తామమ్మా" అనేసి తుర్రుమన్నాడు.. అప్పుడు వెళ్ళినవాడు సరిగ్గా అన్నం తినే ముందు వచ్చాడు.. జుట్టు రేగిపోయి, మొహమంతా నల్లగా, బట్టలన్నీ దుమ్ము దుమ్ముగా అచ్చం మా సందులో ఇల్లు కట్టడానికి వచ్చే కూలీ అబ్బాయిలా ఉన్నాడు.. వస్తూనే నాన్న పక్కకి జేరి "నాన్నా, నేను ఫోర్ ఓవర్స్ బాటింగ్ చేసా!" అని తల ఎగరేసి చెప్పాడు.. "ఓవర్స్ కాదురా.. రన్స్ ఎన్ని చేసావో చెప్పు ముందు" అన్నారు.. "లెవన్ " మళ్ళీ తల ఇంకాస్త ఎగరేసాడు..

"సర్లే ముందు స్నానం చేసిరా.. ఈ అవతారంతో చూడలేకపోతున్నాం నిన్ను" అమ్మ అంటూ ఉండగానే స్నానానికి పరిగెత్తాడు.. 'పది సార్లు చెప్పించుకుంటాడు.. ఇదేంటి ఇలా గుడ్ బోయ్ లా వెళ్తున్నాడు!' అనుకున్నా.. అన్నం తింటుంటే నాన్న చెప్పారు "ఈసారి నించి నీ కాప్ తీసుకెళ్ళు.. లేకపోతే ఎండకి కళ్ళు తిరుగుతాయి" అని జాగ్రత్తలు చెప్తున్నారు.. ఈ ఒక్క రోజే కాదు మళ్ళీ వెళ్తాడన్నమాట!!

ఇక ఆరోజంతా ఎవరెవరు ఎలా ఆడారో.. రోడ్డు మీదకి పరిగెత్తి మరీ కాచ్ లు ఎలా పట్టుకున్నారో.. లాంటి విషయాలన్నీ చెప్తూనే ఉన్నాడు.. "గ్రౌండ్స్ లో అంత స్థలం ఉంటే రోడ్డు మీదకి వెళ్ళడం ఎందుకు" అని అడిగాను.. "మేమే కాదక్కా ఇంకా అక్కడ చాలా మంది ఆడతారు" అన్నాడు..

ఇంక ఇంట్లో, స్కూల్లో వీడి క్రికెట్ గురించి వినడం చూడడం సరిపోయింది.. బబుల్గం తో పాటు వచ్చే క్రికెట్ ప్లేయర్ షీట్స్ దాయడం.. బాట్ మీద క్రికెట్ బొమ్మలు అతికించడం.. ఏ పుస్తకంలో అయినా క్రికెట్ బొమ్మలు కనబడితే కట్ చేసి ఒక పుస్తకం లో అతికించడం.. ఇంతే కాక ఈ మధ్య స్కూల్లో లంచ్ టైం లో అన్నం గబగబా తినేసి ఆడటం మొదలుపెట్టారు.. అప్పుడు తెలిసింది శ్రీధర్, నానీ ఏ కాకుండా ఇంకా చాలా మంది కూడా సండే గ్రౌండ్స్ కెళ్ళి ఆడతారని!

నాక్కూడా ఇప్పుడు క్రికెట్ చాలా బాగా అర్థం అవుతుంది.. కానీ టివిలో వచ్చేటప్పుడు నో బాల్, ఎల్.బి.డబ్ల్యు అని అరుస్తుంటే అర్థం కాదు.. నాక్కుడా ఎక్కడన్నా క్రికెట్ బొమ్మలు దొరికితే తెచ్చి నానీకి ఇస్తున్నా..

అమ్మ మాత్రం అప్పుడప్పుడు "ఈ క్రికేట్ గోలలో పడి నీ చదువు తక్కువైపోతుంది.. టెస్టుల్లో మార్కులు తగ్గాయో ఆ బాట్ విరిచి పొయ్యిలో పెడతాను" అని అంటుంది.. నిజమే! లంచ్ టైం లో కూడా ఆడుతున్నాడు గా, ఇంటికొచ్చాక నాతో అస్సలు ఆడటం లేదు.. పుస్తకాల ముందు కూర్చుని పెద్ద పెద్దగా ఆవలిస్తున్నాడు.. రాత్రి చాలా తొందరగా పడుకుంటున్నాడు..

ఒక సండే మధ్యాహ్నం అన్నం టైం అయిపోయినా నానీ ఇంటికి రాలేదు.. అమ్మ నన్ను వెళ్ళి వాడిని తీసుకు రమ్మంటే నేను, రేఖ కలిసి గ్రౌండ్స్ కి వెళ్ళాము.. నాకైతే అక్కడ ఏం జరుగుతుందో అర్థం కాలేదు.. రోజూ స్కూల్ కి వెళ్ళేటప్పుడు ఖాళీగా ఉండే గ్రౌండ్స్ లో ఇప్పుడు ఎంత మంది జనాలో! మా అంత చిన్న పిల్లల నించి మా అనిల్ అన్నయ్య అంత వాళ్ళు, కాలేజ్ కి వెళ్ళే కుమార్ అన్నయ్య అంత వాళ్ళు, ఇంకా మా చిట్టి బాబాయంత పెద్దవాళ్ళు కూడా ఉన్నారు.. అసలు ఎవరు ఎవరితో ఆడుతున్నారొ తెలీటంలేదు.. అంతా అరుపులూ.. కేకలూ.. గందరగోళంగా ఉంది.. ఇంకా రోడ్డు పొడవునా సోడా, చెరుకు రసం, సబ్జా నీళ్ళూ, చెరుకులు, పల్లీలు, బఠాణీలు అమ్మే బళ్ళు కూడా ఉన్నాయి.. నాకైతే అప్పుడెప్పుడో మా నాన్న తీసుకెళ్ళిన మరియమ్మ తిరునాళ్ళు గుర్తొచ్చాయి..

'అమ్మో ఇంత జనంలో నానీ వాళ్ళు ఎక్కడ ఉన్నారో' అని నేనూ, రేఖా అందరిని చూసుకుంటూ పక్కగా నడుస్తూ వెళ్తున్నాం.. అంతలో ఒక బాల్ ఫాస్ట్గా మాముందు నించి దొర్లుకుంటూ వెళ్ళింది.. పక్కనే ఆడుతున్న గుంపులోనించి ఎవరో "పాపా కాస్త ఆ బాల్ విసిరేయవా?" అన్నారు.. నేను పరిగెత్తుకెళ్ళి అది తెచ్చి వాళ్ళ వైపు విసిరేసాను.. "గుడ్ త్రో!" అని మెచ్చుకున్నారు.. 'అమ్మో! ' ఆ బాలేంటీ అంత గట్టిగా ఉందీ!! అచ్చు రాయిలా ఉంది.. దీనితో దెబ్బ తగిలితే ఇంకేమైనా ఉందా!' అనిపించింది..

అంతలో రేఖ "అదిగో సిరీ, నానీ వాళ్ళు" అని అరిచింది.. వీళ్ళు ఎక్కడో మూల కొంచెం గడ్డి మొక్కలు ఉన్నచోట ఆడుతున్నారు.. చిన్న వాళ్ళనేమో మంచి ప్లేస్ దొరకలేదు అనుకున్నా.. నానిని "రా రా.. ఇంట్లో అమ్మ కోపంగా ఉందని" చెప్పి లాక్కొస్తున్నా నాకే అక్కడ నించి రావాలనిపించడం లేదు! ఇప్పుడు తెలిసింది, సండే వస్తే చాలు వీడు ఇక్కడికెందుకు పరిగెత్తుకొస్తాడో!!

ఇంటికి వస్తూ నానీ అంటున్నాడు "అక్కడున్నా పెద్ద పెద్ద వాళ్ళు అయితే సాయంత్రం వరకూ ఆడుతూనే ఉంటారక్కా.. మధ్యలో బళ్ళ వాళ్ళు అమ్మేవన్నీ తింటూ తాగుతుంటారు".. కానీ అమ్మతో మాత్రం వాడికి చాలా తిట్లు పడ్డాయి.. నాన్న ఏమనలేదు గానీ ఇంకెప్పుడూ లేట్ చేయొద్దని చెప్పారు..

సాయంత్రం మేడ మీద అంటుకునే ఆట ఆడదాము అంటే "మేము ఒక పెద్ద మాచ్ ఆడబోతున్నాము" అని కొంచెం ఆగి "డబ్బులకి!" అన్నాడు.. నేను గట్టిగా "ఏంటీ!" అనగానే "అరవొద్దక్కా.. ఒక్కొక్కళ్ళకి జస్ట్ వన్ రూపీనే" అని చెప్పాడు.. "ఓస్ అంతేనా" అంటుంటే "అందుకే నేను బాగా ప్రాక్టీస్ చేయాలక్కా.. మనిద్దరం ఆడదామా?" అంటే నేను సంతోషంగా తలాడించేసాను..

మరుసటిరోజు క్లాస్ లో శ్రీధర్ నా దగ్గరకి వచ్చి "సిరీ, నానీ ఏడి? వాళ్ళ క్లాస్ లో లేడు.. చెయ్యి బాగా నొప్పెడుతుందని ఇంట్లో ఉండి పోయాడా?" అనడిగాడు..

"చెయ్యి నొప్పెట్టడం ఏమిటి?" అర్థం కాక అడిగాను.. "అదే చేతికి తుమ్మ ముల్లు గుచ్చుకుందిగా!" అన్నాడు..

"అవునా! నాకు తెలీదు.. అమ్మక్కూడా తెలీదు" అనగానే "నిన్న తుప్పల్లో పడిన బాల్ తీయబోతే ఇంత పొడవున్న ముల్లు గుచ్చుకుంది.. బ్లడ్ కూడా చాలా వచ్చింది.. తర్వాత ఆగిపోయిందిలే" అన్నాడు..

వాడు కనబడగానే అడిగాను ముల్లు సంగతి.. "ఇప్పుడేమీ నొప్పి వేయటం లేదక్కా.. ప్లీజ్ నువ్వు అమ్మకి చెప్పకు.. తెలిస్తే మళ్ళీ నన్ను మాచ్ ఆడటానికి పంపివ్వదు" అన్నాడు.. ముల్లు గుచ్చుకున్న కుడి చెయ్యి పట్టుకిని చూస్తే అక్కడ చిన్న మచ్చలా ఉబ్బి ఉంది అంతే.. "నొప్పేమీ లేదుగా?" ఇంకోసారి అడిగితే "గాడ్ ప్రామిస్.. నిజ్జంగా లేదక్కా" అన్నాడు.. "సరే చెప్పనులే" అన్నాను..

కానీ రెండు రోజుల తర్వాత అన్నం కలుపుకోడానికి స్పూన్ తెచ్చుకుంటే అమ్మ "ఏంట్రా చేయ్యేమైంది స్పూన్ తెచ్చావ్?" అనగానే "కొంచెం నొప్పిగా ఉందమ్మా" అన్నాడు.. అమ్మ వెంటనే చెయ్యి పట్టుకు చూసింది.. అప్పుడు చిన్న బొడిపెలా ఉన్న చోట ఇంత లావుగా వాచిపోయి పుండులా ఉంది.. నాకైతే చూడగానే భయం వేసింది..

అమ్మ కంగారుగా "ఏమైందిరా? ఇప్పటి వరకూ ఎందుకు చెప్పలేదు?" అని అడుగుతుంటే నేను ముల్లు గుచ్చుకున్న సంగతి చెప్పేసా.

ఇంకంతే అమ్మకి చాలా కోపం వచ్చేసింది.. "అప్పుడెప్పుడో గుచ్చుకుంటే చెప్పకుండా ఏం చేస్తున్నావురా.. infection వస్తే ఏమౌతుందో తెల్సా! చెయ్యి ఇక్కడి వరకూ తీసేస్తారు.. మళ్ళీ క్రికెట్ జోలికి పోయావో ఇంకేం లేదు.. అసలు బాట్ పట్టుకున్నట్లు తెల్సిందా కాళ్ళు రెండూ విరగ్గొట్టి మూల కూర్చోబెడతాను" అంటూ తిడుతూ నా వైపు తిరిగి "నీకు తెల్సి కూడా నాకెందుకు చెప్పలేదు.. పెద్దదానివన్న బాధ్యత కూడా లేదు నీకు" అని నావంక కోపంగా చూసింది.. వెంటనే పక్క సందులో ఉన్న హాస్పిటల్ కి తీసుకెళ్ళి చేతికి బాండేజ్ వేయించుకొచ్చింది.

వాడు ఆటలు ఆడి దెబ్బలు తగిలించుకున్నా నాకే తిట్లు!! అయినా చెయ్యి తీసేస్తారంటే 'అమ్మో!' అనిపించింది.. ఇంకెప్పుడూ ఇలాంటివి చెప్పకుండా ఉండకూడదు అనుకున్నా.. నాన్నకి కూడా కోపం వచ్చి వాడిని ఇంక క్రికెట్ ఆడటానికి వెళ్ళొద్దన్నారు..

స్కూల్లో శ్రీధర్ చెప్పాడు వాళ్ళు మాచ్ ఆపేసారని.. నానీ చెయ్యి సరిగ్గా అవ్వగానే ఆడతారని అన్నాడు.. అమ్మానాన్న నానీ ని ఇంక పంపరని చెప్తే "నిజంగానా!" అన్నాడు..

"ఇప్పుడెలా సిరీ? మా టీం లో నానీ చాలా బాగా ఆడతాడు.. వాడు రాకపోతే మేము తప్పకుండా ఓడిపోతాము" అనేసి వెళ్ళిపోయాడు.. నానీ బాగా ఆడతాడని చెప్తే భలే సంతోషం వేసింది.. కానీ పాపం ఇంక వెళ్ళడుగా అనుకున్నా..

నానీ చెయ్యి తొందరగానే తగ్గిపోయింది కానీ వాడు మళ్ళీ క్రికెట్ అనే మాట అనలేదు.. యూనిట్ టెస్ట్ మార్కులు సరిగ్గా రాలేదని అమ్మ వాడిని రోజూ దగ్గరుండి చదివిస్తుంది..

ఒక సండే పొద్దున్నే నాన్న నేను కూరగాయలు తేవడానికి వెళ్ళాము.. వచ్చేటప్పుడు గౌండ్స్ పక్కనించీ వస్తుంటే నాన్నకి నానీ వాళ్ళు ఆడే ప్లేస్ చూపించాను.. "ఏంటో! అక్కడ ఖాళీగా ఉంది! శ్రీధర్ వాళ్ళెవరూ లేరేంటీ?" నాన్నతో అంటే ఇవాళ ఆడటం లేదేమోలే అని నాన్న కూడా అక్కడున్న వాళ్ళ వైపు చూసి "చాలా మంది ఉన్నారే!" అన్నారు..

ఇంటికెళ్ళాక నానీకి చెప్పా వాళ్ళ ఫ్రెండ్స్ ఎవరూ ఆడటం లేదని.. "అవునంటక్కా, శ్రీధర్ చెప్పాడు ఎవరూ రావటం లేదంట" అన్నాడు.. పోన్లే నానీ ఒక్కడే కాదు ఎవరూ వెళ్ళటం లేదు, అమ్మయ్య అనుకున్నా..

సెకండ్ సాటర్ డే మా అందరికీ సెలవని నాన్న కూడా ఊరికే సెలవు పెట్టారంట.. సాయంత్రం సినిమాకి వెళ్దామని మాకు చెప్పారు.. ఇంక మేమిద్దరం పేపర్ ముందు పెట్టుకుని ఏ సినిమాకి వెళ్ళాలా అని చూడటం మొదలు పెట్టాము..

అంతలో బయట నించి ఎవరో "నానీ" అన్నట్లు వినిపించింది.. వాడు పరిగెత్తుకెళ్ళి మళ్ళీ అంతే స్పీడుగా వచ్చి "అక్కా, శ్రీధర్ వాళ్ళంతా వచ్చారు" అన్నాడు.. " `వాళ్ళంతా` ఎవరు? " నేనంటుంటే బోల్డు మంది అబ్బాయిలు ముందు రూం లోపలికి వచ్చారు.. అంతలో నాన్న వచ్చి "ఏంటి వానర సైన్యం అంతా ఇక్కడికొచ్చారు?" అని నవ్వుతూ అడిగారు.. "మేమందరం క్రికెట్ ఫ్రెండ్స్ అంకుల్" అని శ్రీధర్ చెప్పగానే నాన్న "అవునా! మరైతే ఇవాళ ఆడటం లేదా?" డిగారు..

"లేదంకుల్.. మేము చాలా రోజుల నించీ ఆడటం లేదు.. నానీ మానేసిన దగ్గర నించీ ఎవరూ సరిగ్గా రావటం లేదు.. అందరికి interest పోయింది.. మా టీం లో నానీ చాలా బాగా ఆడతాడు.. నిజంగా అంకుల్.." అని వాళ్ళు చెప్తుంటే నాన్న "ఓ అయితే వీడిని మళ్ళీ పంపమని అడగడానికి వచ్చారన్నమాట!!" అనగానే అందరూ ఒకేసారి "అవునంకుల్.. నానీ చాలా బాగా ఆడతాడు.. పంపించండి అంకుల్, ప్లీజ్ ప్లీజ్" అని బతిమాలడం మొదలుపెట్టారు..

అంతలో అమ్మ కూడా వచ్చింది.. "ఏంట్రా క్రికెట్లో నువ్వు పెద్ద వీరుడివా?" అని నవ్వుతూ అంటుంటే వాళ్ళందరూ అమ్మ వైపు వచ్చేసి "ఆంటీ మీరైనా చెప్పండి అంకుల్ కి పంపమని" అని మళ్ళీ వెనక బోల్డు `ప్లీజ్ లు` పెట్టారు..

"సరే గానీ, ఇంకోసారి వేళకి తిరిగి రాకపోయినా, దెబ్బలు తగిలినప్పుడు వెంటనే చెప్పక పోయినా ఇంక పంపేది లేదు, జాగ్రత్త మరి" అని నాన్న అనగానే అందరూ పెద్దగా "అలాగే అలాగే" అనుకుంటూ కాసేపు గొడవ గొడవ చేసారు..

వాళ్ళు వెళ్ళిపోయాక నాన్న నానీతో "అయితే నువ్వు బాగానే ఆడతావన్న మాట!" అంటుంటే వాడు సంతోషంగా ఎప్పుడెప్పుడు ఎలా ఆడింది చెప్పడం మొదలు పెట్టాడు..

అమ్మ అడిగినట్లు వీడు క్రికెట్ ఆడటంలో ఎంత వీరుడో నాకు సరిగ్గా తెలీదు కానీ అసలు వాళ్ళందరూ కలిసి ఇంటికి వచ్చి అమ్మానాన్నని ఎందుకు అంత బతిమాలారో నాకు తెల్సు.. మరి వీళ్ళ టీంలో వీడొక్కడి దగ్గరే బాట్ ఉందిగా!!

# ఇంటా - బయటా

"ఏంట్రా, ఇవాళ చాలా మందే చేరారు ఆటలకి?" అన్నారు నాన్న బయటకొచ్చి..

"అవునంకుల్ ఇవాళ అందరూ ఇక్కడే ఆడుకుంటున్నాము" అని రేఖ చెప్పుండగానే నేను "నాన్నా మీరెక్కడికి వెళ్తున్నారు? ఇవాళ సండే కదా!" అన్నానో లేదో అమ్మ లోపల నించి "సిరీ, ఎన్ని సార్లు చెప్పాలి నీకు.. బయటకి వెళ్ళేటప్పుడు 'ఎక్కడికి' అని అడగొద్దని" అని విసురుగా అంది.. 'అబ్బా.. ఎప్పుడూ ఇది అనొద్దు.. అలా చేయొద్దు అని చెప్తూనే ఉంటుంది' అనిపించింది..

పక్కనించి నానీ "రేఖా, ఇంకా క్రోడు రాలేదేంటీ?" అనడిగాడు.. అక్కడే ఉన్న నాన్న ఫట్ మని వాడి బుర్ర మీద ఒక్కటిచ్చారు!

"ఏంట్రా ఆ పిలవటం.. వాడికి పేరు లేదా?" అని "ఇంకోసారి ఇలా నోటివెంట వినబడిందా తోలు తీస్తాను" చాలా కోపంగా అన్నారు..

నాన్న మమ్మల్ని తిట్టడం చాలా తక్కువ.. ఎప్పుడూ అమ్మే కోప్పడుతుంది.. అలాంటిది నాన్నని అంత కోపంగా చూస్తే భయం వేసింది.. అప్పుడెప్పుడో రేఖకి ముందు పళ్ళు ఊడిపోతే నేను 'తొర్రిపళ్ళూ' అని ఎక్కిరిస్తే ఇలానే గట్టిగా కోప్పడ్డారు.. అలా పేర్లు పెట్టి పిలవడం ఎక్కిరించడం చాలా తప్పని చెప్తారు..

"సరే రోడ్ల మీద పరిగెత్తకుండా ఇక్కడే ఆడుకోండి" అని చెప్పి బయటకి వెళ్ళిపోయారు..

మా చుట్టుపక్కల పిల్లలందరం కలిస్తే దొంగా పోలీసు, నేలా బండా, కుంటుళ్ళు ఇలా బోల్డన్ని ఆటలు ఆడుకుంటాం.. చాలా రోజుల తర్వాత అలా అందరం కలిసామని చాలా హుషారుగా ఆడుకుంటున్నాం.. దొంగా పోలీస్ లో రేఖ దొంగ అయింది.. నేను మెట్ల వెనక పాత పెట్టెల వెనక దాక్కున్నా.. కొంచెం కూడా కనబడకుండా నక్కి నక్కి దాక్కున్నా..

రేఖ ఒకరి తర్వాత ఒకరిని అందరినీ కనిపెట్టేయడం వినబడుతూనే ఉంది.. నేను అస్సలు కనబడకూడదని ఇంకాస్త లోపలికి జరిగాను.. మోకాలి దగ్గర ఏదో గండు చీమ కుట్టినట్లు అనిపించింది.. "సిరీ, నువ్వెక్కడ ఉన్నావో నాకు తెలీటం లేదు.. బయటకొచ్చేయ్" అని రేఖ అరవగానే నేను ఆ పెట్టె చాటు నించి ఇంక ఆగలేక గభాల్న వచ్చేసాను..

"నన్ను పట్టుకోలేకపోయావుగా.. మళ్ళీ నువ్వే దొంగ" అని నేను ఎగురుతూ అరుస్తుంటే అందరూ నా కాలివంకే చూస్తూ "సిరీ, నీ కాలి కేదో అయింది చూడు.. ఎంత బ్లడ్ వస్తుందో!!" అనగానే నేను వెంటనే కిందకి చూసా..

ఎడమకాలి మోకాలి కింద నించి రక్తం కారిపోతూ ఉంది.. అంత రక్తం చూడగానే ఒక్కసారే నాకు చాలా భయం వేసి గట్టిగా ఏడవడం మొదలుపెట్టా..

అప్పుడే గేట్ తీసుకుని రాములు తాత లోపలికి వస్తూ నా ఏడుపు విని "ఏమైంది పాపా?" అంటూ గబగబా దెబ్బ తగిలిన కాలు పట్టుకుని చూసాడు..

"ఎంత రక్తం పోతుందో! అసలు దెబ్బ ఎలా తగిలింది?" అనడుగుతుంటే రేఖ మెట్ల కింద పెట్టెలు చూపిస్తూ "మేము దొంగా పోలీసు ఆడుతుంటే అదిగో ఆ పెట్టెల వెనక దాక్కుంది.. బయటకి రాగానే తన కాలు నించి రక్తం వస్తుంది" అని చెప్పింది..

రాములు తాత వెంటనే ఆ పెట్టెల వెనక్కి వెళ్ళి చూసొచ్చి మళ్ళీ నా కాలు పట్టుకుని చూసాడు.. ఆ వెంటనే "అయ్యో, మేకు గుచ్చుకుందమ్మా.. చూడు ఇంక నీ కాలుకే ఉంది అది" అని మోకాలి కింద చూపించాడు.. అక్కడ ఒక చిన్ని మేకు రక్తంలో కనీ కనబడకుండా ఉంది.. నాకింకా భయం వేసి ఇంకాస్త ఏడవడం మొదలు పెట్టాను..

"అబ్బబ్బా, ఏంటా ఏడుపు.. మళ్ళీ కొట్టుకుంటున్నారా!" అంటూ అమ్మ బయటకి వచ్చింది.. రక్తం కారుతున్న కాలుని బార

జాపి గట్టిగా ఏడుస్తున్న నన్ను చూడగానే కంగారుపడి "అయ్యో అంత పెద్ద దెబ్బ ఎలా తగిలింది" అంటుండగానే రాములు తాత మేకు గుచ్చుకున్న సంగతి చెప్పాడు..

అమ్మ వెంటనే మళ్ళీ ఇంట్లోకి వెళ్ళి కాఫీ పొడి తెచ్చి దెబ్బ తగిలిన చోట గట్టిగా అద్దింది.. అప్పుడు వరకూ నొప్పి లేకపోయినా రక్తం చూసి ఏడుస్తున్న నాకు ఒక్కసారి బోల్డంత మంట పుట్టింది..

"ఆ పాత పెట్టెల మేకంటే తుప్పు పట్టిందే అయి ఉంటుంది.. సెప్టిక్ అవ్వకుండా ఇంజెక్షన్ చేయిద్దామంటే ఇవాళ ఆదివారం హాస్పిటల్స్ కూడా ఉండవు.. సమయానికి ఈయన కూడా ఇంట్లో లేరు.. ఈ పిల్లలు ఒకచోట ఉండరు కదా!" అమ్మ కంగారులో గబగబా మాట్లాడేస్తోంది..

అంతలో రాములు తాత "జనతా హాస్పిటల్ ఆదివారం కూడా ఉంటుంది కదమ్మా.. నేను ముందు పాపని తీసుకెళ్తాను.. మీరు డబ్బులూ అవీ తీసుకుని ఇల్లు చూసుకుని నెమ్మదిగా రండి" అనేసి నన్ను చేతుల్తో ఎత్తుకుని ఆటోలో కూర్చోబెట్టుకుని హాస్పిటల్‌కి తీసుకెళ్ళాడు.. నాకప్పుడూ కాలి దెబ్బకంటే ఇంజెక్షన్ భయం పట్టుకుని వద్దంటే వద్దని రాములు తాతని బతిమాలడం మొదలుపెట్టాను..

కానీ రాములు తాత ఏవేవో కబుర్లు చెప్తూ నాకస్సలు తెలీకుండానే ఇంజెక్షన్ చేయించి, కట్టు కట్టించి అమ్మ కూడా రాకుండానే ఇంటికి తీసుకొచ్చేసాడు..

అప్పుడే తాళం వేసి బయటికొస్తున్న అమ్మ మమ్మల్ని చూడగానే "అప్పుడే అయిపోయిందా!" అని తాళం తీసి నన్ను తాత చేతుల్లోంచి తీసుకుంది..

"ఇవాళ ఆదివారం కదా.. ఎవ్వరూ లేరమ్మా అక్కడ" అని తాత చెప్తుండగానే అమ్మ లోపలికెళ్ళి మంచినీళ్ళు తెచ్చి తాతకిచ్చింది..

"భయం ఏమీ లేదమ్మా.. రోజూ ఈ ఆయింట్‌మెంట్ రాస్తూ, పప్పులాంటివి పెట్టొద్దన్నారు" అంటూ ఏదో కాయితం అమ్మ చేతికిచ్చాడు..

అమ్మ వెంటనే పక్కనే ఉన్న బాగ్ లోంచి డబ్బులు తీసి ఇస్తే రాములు తాత "పెద్ద నోటు ఇచ్చారు, నా దగ్గర చిల్లర లేదమ్మా" అంటుంటే అమ్మ "పర్వాలేదు ఉంచు రాములూ.. సమయానికి నువ్వొచ్చావు కాబట్టి సరిపోయింది.. నాకైతే ఆ కంగారులో కాళ్ళూ చేతులూ ఆడలేదు" అని "అయినా ఈ వేళప్పుడు వచ్చావేంటి రాములూ?" అనడిగింది..

"ఇవాళ పొద్దున్న మా తెల్సిన వాళ్ళ పెళ్ళి ఉంటే అది చూసుకుని అమ్మా నాన్నని ఒకసారి కలిసి పోదామని వచ్చానమ్మా.. వాళ్ళు లేరు.. మీ ఇంటిదగ్గర ఉన్నారేమోనని ఇటువైపొచ్చా" అన్నాడు..

"ఓ అవునా.. వాళ్ళు కూడా పెళ్ళికెళ్ళారు రాములూ.. నేను చెప్తాలే నువ్వొచ్చి వెళ్ళావని" అని "ఉండు 5 నిమిషాల్లో రెడీ చేస్తాను భోజనం చేసి వెళ్దువుగాని" అమ్మ చెప్తుంటే "అయ్యో ఇప్పుడెందుకమ్మా మీకు శ్రమ" అని తాత అన్నాడు..

"శ్రమేమీ లేదు రాములూ.. మళ్ళీ నువ్వు బస్సు పట్టుకుని ఊరు చేరుకునే సరికి చాలా లేట్ అయిపోతుంది" అనేసి లోపలికెళ్ళింది.. అంతలో తాత కూడా బయటకెళ్ళి ఒక 5 నిమిషాల తర్వాత వచ్చాడు.. అమ్మ భోజనానికి రమ్మని పిలవగానే జేబులోంచి డబ్బులు తీసి "ఇదిగోమ్మా మిగిలిన చిల్లర" అని ఇచ్చాడు.. అమ్మ "అయ్యో ఇదేంటీ! చిల్లర వద్దని చెప్పాగా.. అయినా ఇప్పటికిప్పుడు బయటకెళ్ళి తీసుకు రావాల్సిన అవసరం ఏముంది?" అని కొంచెం గట్టిగా అడిగింది..

తాత నవ్వేసి భోజనానికి కూర్చున్నాడు.. అమ్మ నాకు పాలు కలిపి తెచ్చింది.. అంతలో నాన్న కూడా వచ్చేసారు.. ఇక నానీ ఊరుకుంటాడా! చేతులూపుకుంటా అంతా చెప్పడం మొదలుపెట్టాడు..

అంతా విని నాన్న "దాక్కోటానికి నీకింకో ప్లేస్ దొరకలేదా సిరీ!! ఆ పెట్టెలు ఎండకి వానకి ఎప్పటినించో అక్కడే ఉంటున్నాయి

కదా.. పురుగులేమన్నా ఉంటాయన్న భయం కూడా లేదు నీకు!" అని కోప్పడుతుంటే మధ్యలో నానీ గాడు "మేమెవరం అటువైపు వెళ్ళం నాన్నా.. అందుకే రేఖ కూడా అక్కని పట్టుకోలేకపోయింది" అని వాళ్ళందరూ చాలా మంచి వాళ్ళన్నట్లు ఫోజుగా చెప్పాడు..

రాములు తాత భోజనం చేసేసి నాన్నతో కాసేపు మాట్లాడి, మళ్ళీ వచ్చే ఆదివారం వస్తానని అమ్మమ్మ వాళ్ళతో చెప్పమని బస్సుకి టైం అవుతుందంటూ వెళ్ళిపోయాడు.. అమ్మమ్మ వాళ్ళకి అదేదో ఊళ్ళో పొలాలు ఉన్నాయంట.. అవన్నీ రాములు తాతే చూస్తాడంట.. దాన్నే కౌలుకి తీసుకోవడం అంటారని నాన్న చెప్పారు.. అమ్మమ్మ వాళ్ళింటికెప్పుడూ వస్తూనే ఉంటాడు.. నన్నూ, నానీని చూడగానే మా స్కూల్ విషయాలన్నీ అడిగి చెప్పించుకుంటాడు.. బాగా చదువుకోవాలని చెప్తాడు.. వాళ్ళ మనవడు సెవెంత్ క్లాస్‌లో జిల్లా ఫస్ట్ వచ్చాడని ఎప్పుడూ చెప్తాడు.. ఇంకా గట్టు మీద కాసాయని పెద్ద సంచీలో బోల్డన్ని కూరగాయలు, పళ్ళు అమ్మమ్మ వాళ్ళతో పాటు మాక్కూడా తెచ్చిస్తాడు..

నడిచేటప్పుడు కొంచెం నొప్పిగా ఉందని ఆ మరుసటి రోజు అమ్మ నన్ను స్కూల్ కి పంపలేదు.. తర్వాత రోజు వెళ్ళగానే క్రాంతి వాళ్ళంతా కాలికి కట్టు చూసి ఏమైందని అంతా చెప్పేవరకు వదల్లేదు.. అంతలో పక్కనుంచి శ్రీసుధ "అయితే వచ్చే వారం కల్లా తగ్గిపోతుందని చెప్పారా డాక్టర్? లేకపోతే నిన్ను దీపావళికి టపాకాయలు కాల్చనివ్వరేమో మీ ఇంట్లో!" అనంది..

'అమ్మో నిజమే కదా.. వచ్చే వారమే దీపావళి!' ఇంటికెళ్ళగానే అమ్మని అడగ్గానే అమ్మ నవ్వుతూ "అప్పటికి తగ్గిపోతుందిలేవే" అంది.. 'హమ్మయ్య' అనుకున్నా.. ఇంక నేను, నానీ ఈసారి ఏమేమి కొనుక్కోవాలో నాన్న రాగానే లిస్ట్ చెప్పేసాము.. నాన్న కూడా "సరే వచ్చే ఆదివారం పొద్దున్నే వెళ్ళి కొందాము" అన్నారు..

సండే పొద్దున్నే మేమిద్దరం అమ్మనడిగి సంచి తీసుకుని టపాకాయల కోసం రెడీ అయిపోయాం.. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లోనే అటుపక్కగా వరుసగా బోల్డన్ని షాపులు ఉన్నాయి.. "అమ్మో ఎన్ని కొట్లున్నాయో!" అంటూ నానీ నాన్న చేతినొదిలేసి పరిగెడుతున్నట్టుగా నడవడం మొదలుపెట్టాడు..

నాన్నకి తెలిసినవాళ్ళు కూడా ఒక షాప్ పెట్టారంట.. నాన్న మిగతా కొట్లవాళ్ళు "రండి సార్.. రండి సార్" అని అరుస్తున్నా తిన్నగా ఆ షాప్ దగ్గరకే వెళ్ళారు.. నాన్నని చూడగానే షాప్ అంకుల్ రెండు ప్లాస్టిక్ సంచిలు తీసి ఇచ్చారు..

"అదేంటి నాన్నా, మాకిష్టమైనవి తీసుకుంటానన్నారుగా" నానీ ఏడుపు మొహం పెట్టి అడిగాడు.. "మొన్న మీరు చెప్పినవే ఇమ్మని ముందే చెప్పి ఉంచారా" అని ఆ రెండు బాగ్స్‌ని మేము తెచ్చిన సంచిలో పెట్టారు.. నేనింకా చాలా సేపు షాపంతా తిరిగి కొనుక్కుంటామనుకున్నాను.. అప్పుడే వెనక్కి వచ్చేస్తుంటే నాన్న అన్నారు "చూసారా ఎంత మంది జనం వస్తున్నారో.. వీళ్ళలో ఇరుక్కున్నామంటే మనం అన్నం టైం కి కూడా బయటకి రాలేము".. నిజమే కదా అనుకున్నా..

నాన్న పట్టుకున్న సంచి మీదే మా ఇద్దరి చూపులు ఉన్నాయి.. "ఒకటి చిన్నది ఒకటి పెద్దది ఉన్నాయేంటి నాన్నా? చిన్నది నానీకా?" ఇందాకటినించీ అందామనుకున్న మాట అనేసాను..

వెంటనే నానీ నడిచేవాడల్లా ఆగిపోయి మరీ "అవునా నాన్నా??" అన్నాడు.. "అబ్బా కాదులేరా.. ఐనా అప్పుడే పేచీలా!" అని "పెద్దది మీ ఇద్దరికి, రెండోది రాములు తాతకి" అన్నారు..

అందుకా రెండు బాగులు.. అవును ఇవాళ తాత వస్తానని చెప్పాడుగా! ఇంటికెళ్ళి అన్నం తినగానే మేమిద్దరం మా బాగ్‌లో ఏమేం టపాకాయలు ఉన్నాయో చూడబోతుంటే నాన్న "అది సాయంత్రం చూద్దురుగానీ ముందు ఆ రెండో బాగ్ తీసుకెళ్ళి అమ్మమ్మ వాళ్ళింట్లో ఇచ్చి రాములు తాత వస్తే ఇమ్మని చెప్పండి" అన్నారు..

సరేనని మేమిద్దరం వెళ్ళబోతుంటే అమ్మ "నువ్వుండరా నానీ.. అక్కా, నేనూ వెళ్ళొస్తాము" అంటుంటే "నేను లేకుండా వీడిని ఏమీ చూడనీయకండి నాన్నా" అని చెప్పి అమ్మతో బయలుదేరాను..

మేమెళ్ళేసరికే రాములు తాత అమ్మమ్మ వాళ్ళింట్లో ముందు వరండాలో కూర్చుని తాతయ్యతో కబుర్లు చెప్తున్నాడు.. నేను వెంటనే తాతకి టపాకాయల బాగ్ ఇస్తే తాత అవి చూసి "అయ్యో ఇప్పుడివన్నీ ఎందుకమ్మా" అన్నాడు.. అంతలో లోపలనించి అమ్మమ్మ "సిరీ, ఒకసారి ఇలా రా" అని పిలిచింది..

లోపలికెళుతూనే నా చేతిలో డబ్బులు పెట్టి "వెంటనే వెళ్ళి కొట్లో ఒక ఐదు విస్తరాకులు తీసుకు రా" అంటుంటే "ఇవాళ పండగ కాదు కదా.. ఇప్పుడెందుకవి" అనడిగాను.. "ఎందుకో.. ఏమిటో.. నీకన్నీ ప్రశ్నలే! ముందెళ్ళి చెప్పిన పని చెయ్యి" ఇంకాస్తగట్టిగా చెప్పింది..

నేను విస్తరాకులు తెచ్చివ్వగానే గబగబా రెండు కడిగి అవి, అన్నం గిన్నె తను పట్టుకుని నాచేతికో రెండు కూర గిన్నెలు ఇచ్చి వరండాలోకి వెళ్ళింది అమ్మమ్మ.. అవన్నీ అక్కడ పెట్టి తను తాతకి అన్నం పెడుతూ నన్ను లోపలకెళ్ళి మంచినీళ్ళు, మజ్జిగ తీసుకు రమ్మంది..

నాకర్థం కాలేదు.. లోపల భోజనాల గదిలో కాకుండా ఇలా గేట్ ఎదురుగా వరండాలోనే పెట్టేస్తుందేమిటి అన్నం!! తాత అన్నం తినేసి నిమ్మచెట్టు మొదట్లో చేతులు కడుక్కుంటుంటే నేను తను తిన్న విస్తరాకు తీయడానికి వంగాను.. వెంటనే అమ్మమ్మ "సిరీ, లోపల మీ అమ్మఏదో అంటుంది చూడు" అని గట్టిగా అరిచినట్లు చెప్పింది..

నేను లోపలికెళ్ళగానే నా వెనకే వచ్చింది.. "నీకేం పని లేదా.. పోయి పోయి ఎంగిలి విస్తరాకు తీస్తున్నావ్" అని నెత్తి మీద మొడుతూ కోపంగా అడుగుతుంటే "అదేంటి అమ్మమ్మా, ఎప్పుడూ తాతయ్య విస్తరాకు తీయమని, అలా తీస్తే మంచిదని అంటావుగా!" నాకేమీ అర్థం కాక అడిగాను.. "నీకు రాములు, మీ తాతయ్య ఒకరేనే!?" ఇంకాస్త గట్టిగా అంటుంటే పక్కనించి అమ్మ "దానికి తెలీక చేసిందిలే అమ్మా.. ఇంక మేమెళ్తాము.. కాసేపు కునుకు తీస్తేగానీ ఆదివారం అనిపించదు" అంటూ నా చేయి పట్టుకుని అక్కడనించి లాక్కొచ్చేసింది..

ఇంటికి రాగానే నాన్నతో "అబ్బబ్బా, ఇంకా మా అమ్మని పనికిరాని పట్టింపులు వదలడంలేదు" అని రాములు తాతకి వరండాలో అన్నం పెట్టడం గురించి చెప్పింది.. అయితే నాకే కాదు, అమ్మకి కూడా అలా చేయడం నచ్చలేదన్నమాట!! అలా అనిపించగానే నేను నాన్నతో "ఇవాళ పండగ నన్ను కొట్టుకి పంపించి మరీ విస్తరాకులు తెప్పించి అందులో పెట్టింది నాన్నా.. తాతేమనుకుంటాడు.. అమ్మమ్మ వాళ్ళకి అసలు అన్నం పళ్ళాలే లేవనుకోడూ!" అన్నాను..

నాన్న నవ్వి "తాతకి తెలుసు సిరీ, ఇంట్లో పళ్ళాలు ఉన్నా సరే తనకి ఆకులో పెట్టారని" అన్నారు.. "మరెందుకు అమ్మమ్మ అలా చేసింది?" మళ్ళీ నేనడిగిన ప్రశ్నకి "మీ అమ్మమ్మకి వాళ్ళు వాడే పళ్ళాల్లో తాతకి అన్నం పెట్టడం ఇష్టం లేదు" అని సమాధానం చెప్తే "అదే ఎందుకని నాన్నా?" నేనడుగుతుంటే నాన్న కాసేపు ఆగి "తాత వాళ్ళు మన వాళ్ళు కాదని మీ అమ్మమ్మ అనుకుంటుంది సిరీ.. అయినా ఇవన్నీ నీకర్థం కావు" అనేసి వెళ్ళిపోయారు..

నాకు నిజంగానే అర్థం కాలేదు.. కానీ అమ్మమ్మ అలా చేయటం నాకస్సలు నచ్చలేదు.. తాతయ్య కూడా అలా చేయొద్దని ఎందుకు చెప్పలేదో!

అంతలో నానీ పిలిస్తే మాకోసం తెచ్చుకున్న టపాకాయలు చూడటానికి పరిగెత్తాను.. చాలా ఎండగా ఉందని నాన్న వాటిని డాబా మీద ఎండబెట్టమని చెప్పారు.. అలా చేస్తే ఇంకా బాగా పేలతాయంట..

మర్నాడు స్కూల్ లో అందరం ఎవరెవరు ఏమేం టపాకాయలు కొనుక్కున్నామో చెప్పుకోవడమే!! ఆరోజు రాత్రి నాన్నతో నానీ "నాన్నా మా ఫ్రెండ్ వాళ్ళ అన్నయ్యలు, నాన్న గారు కలిసి వాళ్ళ టపాకాయలు వాళ్ళే చేసుకుంటున్నారంట.. అలా అయితే మనకి కావాల్సినన్ని చేసుకోవచ్చు.. త్రీ డేస్ వరకూ కాల్చుకోవచ్చంట!" అని చెప్తుంటే నాన్న "నువ్వు బాగా పెద్దయిన తర్వాత మనం కూడా

చేసుకుందాంలే.. ఇప్పటికి ఇవి కాల్చుకోండి'' అన్నారు.. ప్రతి పనీ పెద్దయిన తర్వాతే చేయాలంటారేంటో!!

పక్కనించి అమ్మేమో ''మీ టపాకాయల గొడవేమోకానీ ఆరోజు సాయంత్రం నా లక్ష్మి పూజ దగ్గర సర్దడంలో హెల్ప్ చేయాలి మీరిద్దరూ'' అని ''సిరీ, మీ క్రాంతి వాళ్ళ అమ్మగారిని కూడా పిలిచాను పూజకి'' చెప్పింది..

దీపావళి ముందు రోజుని నరక చతుర్దశి అంటారని, ఆరోజే రాక్షసుడిని చంపిన రోజని అమ్మెప్పుడో చెప్పింది.. మాకు అదే రోజు తలస్నానం చేయిస్తుంది.. ఇంకా దీపాలు వెలిగించే మట్టి ప్రమిదలన్నీ పొద్దున్నే నీళ్ళలో నానేసి మధ్యాహ్నం అన్నాలు అవ్వగానే వాటిని బయటకి తీసి డాబా మీద ఎండలో పెట్టి ఆరబెడుతుంది..

పండగరోజు తొందరగా లేచి తయారయిపోయి నేను, నానీ పూజ మడపం దగ్గర అమ్మ చెప్పినట్లే సర్దడం మొదలుపెట్టాము.. తర్వాత ప్రమిదలన్నీ వరుసగా ఎక్కడెక్కడ పెట్టాలో చూపించింది.. దీపావళికి మేమెప్పుడూ రెండుసార్లు కొత్తబట్టలు వేసుకుంటాము.. పొద్దున్నపూట అంతకు ముందే ఉన్న కొత్త బట్టలు వేసుకుని, సాయంత్రం పూజకి అసలు కొత్తబట్టలు వేసుకుంటాము..

అమ్మ పూజ మొదలుపెట్టిన కొంచెం సేపటికే రేఖా వాళ్ళమ్మ గారు, ఇంకా మా సందులో ఉండేవాళ్ళు తెలిసిన ఆంటీలు రావడం మొదలుపెట్టారు.. మేమిద్దరం మంచినీళ్ళు ఇస్తూ అటూ ఇటూ తిరిగేస్తున్నాం.. అంతలో ఎవరో ''అమ్మో సిరీ తెగ పని చేసేస్తున్నావుగా!'' అని అంటే గుమ్మం వైపు చూసాను.. క్రాంతి వాళ్ళ అమ్మగారు ఎవరో మామ్మగారితో లోపలికొ స్తున్నారు..
వెంటనే పరిగెత్తుకెళ్ళి ఆంటీ వెనకగా చూసాను క్రాంతి కోసం.. ఎక్కడా కనబడలేదు.. ''మీ ఫ్రెండ్ రాలేదమ్మా.. నేను నానమ్మ గారే వచ్చాము'' అని ఆంటీ చెప్పారు.. 'అయ్యో క్రాంతి రాలేదా.. మా కొత్తబట్టలు ఒకరికొకరు చూపించుకుందామనుకున్నాంగా' అనుకున్నా.. తర్వాత ఆంటీకి, మామ్మ గారికి మంచినీళ్ళు ఇస్తే మామ్మ గారు వద్దన్నారు.. క్రాంతివాళ్ళ నాన్నమ్మ గారిని చూడటం అదే మొదటిసారి.. మొఖానికి పెద్దబొట్టు, చీర భుజాల చుట్టూ కప్పుకుని కళ్ళజోడు లోంచి అమ్మ పూజ చేస్తుంటే అటే చూస్తున్నారు..

పూజ అయ్యాక అంతకుముందే ప్లేట్లలో సర్దిన కారప్పూస, లడ్డూ అందరికీ ఇస్తుంటే మళ్ళీ మామ్మగారు తీసుకోలేదు.. కానీ వాళ్ళు తెచ్చుకున్న బాగ్ లోనించి మరచెంబు తీసి అందులో నీళ్ళు తాగారు.. 'అదేంటీ, ఇందాక నీళ్ళిస్తే వద్దన్నారుగా' అనుకుని మళ్ళీ అడిగాను ''మామ్మగారూ మంచినీళ్ళు తీసుకురానా?'' అని.. ఆంటీ ''లేదమ్మా మామ్మ గారికి మడి.. ఆ చెంబులో నీళ్ళే తాగుతారు'' అని చెప్పారు..

పూజ అయిపోవడంతో నేను, నానీ అక్కడనించి వరండాలోకి వచ్చేసాము.. అప్పటికే నాన్న మా టపాకాయలన్నీ సర్ది పెట్టి ఉంచారు.. మమ్మల్ని చూడగానే ''వెళ్ళి కొత్తబట్టలు తీసేసి రోజూ వేసుకునే బట్టలు వేసుకునిరండి.. ఇంక మొదలుపెడదాం'' అన్నారు.. అంటే నిప్పురవ్వలూ, టపాకాయల మసీ అంతా అంటి కొత్తబట్టలు పాడవ్వకుండా ఉండటానికన్నమాట!

కాసేపట్లో ఢాం ఢాం అంటూ ఆపకుండా పేలడం మొదలుపెట్టాయి.. నానీ అప్పుడప్పుడూ రోడ్డు మీదకి పరిగెత్తుకెళ్ళి ఎవరెవరు ఏమేమి కాలుస్తున్నారో చెప్తున్నాడు.. మేము అన్నీ ఒకేసారి అప్పుడే కాల్చేయకుండా నాన్న కొన్ని దాచిపెట్టారు రేపటి కోసం.. శబ్దాలన్నీ కొంచెం కొంచెం తగ్గుతూ అప్పుడప్పుడూ ఒకటో రెండో పేలుతున్నట్లు వినిపిస్తున్నాయి.. నాకైతే చాలా ఆకలేస్తుంది.. కాళ్ళూ చేతులూ శుభ్రంగా కడుక్కుని మేమిద్దరం అన్నం తినడానికి వెళ్ళాము..

అంతలో ఉన్నట్టుండి మా సందులోనే పెద్ద పెద్దగా టపాకాయలు పేలుతున్న శబ్దం వచ్చింది.. అంతే, నానీ ఒక్క పరుగు తీసాడు.. ఒక్క నిమిషంలో బయటనించే ''అక్కా తొందరగా రా!'' అంటూ గట్టిగా పిలిచాడు.. నన్ను చూడగానే ''పక్కింటి అశోక్ అన్నయ్య వాళ్ళు మన సందంత పొడవున్న సీమటపాకాయ పేలుస్తున్నారు, నాన్న కూడా అక్కడే ఉన్నారు'' అంటూ నా చెయ్యి పట్టుకుని రోడ్డు మీదకి లాక్కెళ్ళాడు.. మరి ఒక్కడే వెళ్ళడానికి అవి మీద పడతాయేమో అన్న భయం కదా!!

మా సందులో వాళ్ళంతా బయటకొచ్చేసి చూస్తున్నారు!! అది చాలాసేపు పేలుతుందని, చాలా ఖరీదని చెప్పుకుంటున్నారు..

కాసేపు నుంచున్న తర్వాత పొద్దున్నే స్కూల్ కి వెళ్ళాలని అమ్మా మా ఇద్దరినీ లోపలికి లాక్కొచ్చేసింది..

తర్వాత స్కూల్లో మా ఫ్రెండ్స్ అందరికీ ఆ పెద్ద సీమటపాకాయ గురించి చెప్పాను.. క్రాంతి నేనూ లంచ్ చేస్తున్నప్పుడు తనని అడిగాను వాళ్ళ మామ్మ గారు మరచెంబులో నీళ్ళే ఎందుకు తాగుతారని..

"ఓ అదా.. మీరు మేము వేరు కదా.. మీ ఇళ్ళల్లో మా నానమ్మ ఏమీ తినదు, తాగదు" రేఖ అంటుంటే "వేరేంటీ?" అనడిగాను.. "అదే, మీరు చికెన్ లాంటివన్నీ తింటారు కదా.. అందుకే.. నానమ్మ మా దగ్గర ఉన్నప్పుడు మీలాంటి వాళ్ళు ఎవరు వచ్చినా వాళ్ళు వెళ్ళగానే గదిలో పసుపు నీళ్ళు చల్లి శుద్ధి చేస్తుంది" అని రేఖ చెప్తుంటే నాకు రాములు తాత గుర్తొచ్చాడు..

అంటే అమ్మమ్మ రాములు తాతని వేరేగా చూసినట్టు నానమ్మ గారు మమ్మల్ని చూస్తారా! అయినా రాములు తాత కూడా మాలానే చికెన్ తింటాడని తెలుసు.. అయినా అమ్మమ్మ బయటే ఎందుకు పెట్టింది?? ఇంటికొచ్చి అమ్మని అదే అడిగితే అమ్మ నవ్వింది.. "ఇట్రా" అని తను కూరగాయలు కోస్తూ పక్కన కూర్చోమంది.. "మనం పుట్టిన కుటుంబం వలన ఈ ఎక్కువ తక్కువలు ఉంటాయి.." అని చెప్తుంటే "వేరే ఎలా అమ్మా.. మనందరం దీపావళి చేసుకున్నాము కదా.. మన సందులో ఉత్తం వాళ్ళలా జీసస్ పండగ చేసుకోము కదా?" అనడిగాను..

"ఒకే పండగలు చేసుకున్నా మనలో మనకే ఒకరు తక్కువ ఒకరు ఎక్కువ అనే తేడాలున్నాయమ్మా" అమ్మ అంటే "నానీ, రాజేష్ ని కర్రోడా అని పిలిస్తే నాన్న ఎంత కోప్పడతారో కదమ్మా.. 'అలా నల్లగా వాడు కావాలని పుట్టాడా? అలా ఎక్కిరించకూడదు' అని చెప్తారు.. అలానే రాములు తాత కావాలని తక్కువ వాళ్ళ ఇంట్లో పుట్టలేదుగా!?" అన్నాను..

"ఇలాంటి పద్ధతులన్నీ ఇవాళ్టివి కాదు సిరీ, ఎప్పుడో తాత ముత్తాతల నించి వస్తున్నాయి.. అప్పట్లో వాళ్ళు ఎవరి ఎవరి కుటుంబం పనులు వాళ్ళు చేసుకునేవాళ్ళు.. అంటే వ్యవసాయం, వ్యాపారం, వస్తువులు చేయడం ఇలా ఇలా వాళ్ళ వాళ్ళ కుటుంబం ఎందులో ఉంటే అదే పని.. అందుకే తేడాలు తేడాలన్నీ అలానే ఉంటూ వచ్చాయి.. కానీ ఇప్పుడు చాలామటుకు ఉద్యోగాలు చేస్తున్నారు.. ఒకరితో ఒకరు ఎక్కువ కలవడం , ఒకరి ఒకరి అవసరం ఒకరికి ఉండటం వల్ల ఇలాంటి ఎక్కువ తక్కువలన్నీ నెమ్మదిగా పోతున్నాయి.. అంతెందుకు నీకు కాలికి దెబ్బ తగిలిన రోజు రాములు తాత మనింట్లో అన్నం తిన్నాడు కదా.. ఎక్కడ తిన్నాడు?" అనడిగింది..

కాస్త గుర్తు తెచ్చుకుని చెప్పా "మన డైనింగ్ టేబుల్ మీద" అని.. "మరి నేను అమ్మమ్మలా బయట విస్తరాకేసి పెట్టలేదుకదా! అలానే, మొన్న మామ్మ గారు మనింట్లో ఏమీ ముట్టుకోలేదు కానీ ఆంటీ అన్నీ తిన్నారు, తాగారు కదా" అమ్మ అంటుంటే "నిజమే అమ్మా" అన్నా..

"నువ్వు కాస్త పెద్దయ్యేటప్పటికి నీకే తెలుస్తాయి ఇలాంటి తేడాలన్నీ అసలెలా వచ్చాయని.. నువ్వు మాత్రం ఇలాంటి ఆలోచనలు పెట్టుకోక మేమెలా ఉంటే అలానే ఉండు" అన్ని అమ్మ చెప్పింది..

అంతలో పక్కనే అరుపులు.. "తొర్రిపళ్ళ రేఖా" అంటూ నానీగాడు పారిపోతుంటే "ఇవాళ నీపని అయిపోయిందే దొప్ప చెవులోడా" అని రేఖ వాడెనకాలే పరిగెడుతుంది..

# అమ్మ ఒక బొమ్మ నాన్న ఒక బొమ్మ

ఈ ఆదివారం సాయంత్రం మా ఫ్రెండ్స్ ఎవరూ ఆడుకోవడానికి రాలేదు.. నేనూ, నానీ మా గుమ్మం ముందే కూర్చుని ఏవో కబుర్లు చెప్పుకుంటుంటే నాన్న లోపలనించి పిలిచారు.. మేము లేచి లోపలికి వెళ్ళగానే "ఇవాళ టివిలో మంచి సినిమా వస్తుంది.. చూస్తారా?" అన్నారు..

అమ్మ పక్కనించి "హిందీ సినిమా వాళ్ళకేమి అర్థం అవుతుంది చెప్పండి" అంటే "చూసినంతవరకు చూడనీలే" అని నాన్న అనగానే మేమిద్దరం నాన్నకి చెరోవైపు చేరిపోయాము.

ఆ సినిమా పేరు 'సీతా ఔర్ గీతా" అంట.. మొదట్లో ఏమీ అర్థం కాకపోయినా ఒకేలా ఉన్న ఇద్దరు అమ్మాయిలని చూసేసరికి అలా కూర్చుండిపోయాము.. ఇద్దరూ అక్క చెల్లెళ్ళే అయినా చిన్నప్పుడే విడిపోతారంట.. ఒకమ్మాయితో వాళ్ళ చుట్టాలు ఎంత పని చేయించినా, ఎంత తిట్టినా ఏమీ అనదు.. ఇంకో అమ్మాయి మాత్రం అందరితో పోట్లాడుతూ అందరినీ భయపెడుతూ ఉంటుంది.. తర్వాత వాళ్ళిద్దరూ ఒకరి ఇంట్లోకి ఇంకొకరు మారి ఆ చుట్టాలని తెగ ఏడిపించడం భలే నచ్చాయి.. నాన్న మధ్య మధ్యలో కథ చెప్తుంటే ఇంకా బాగా అర్థం అయింది..

అప్పటి నించి మమ్మల్ని కూడా మామూలు సినిమాలు చూడనిచ్చేవారు.. లేకపోతే ఇదివరకు వినాయక విజయం, భక్త ప్రహ్లాద, ఆంధ్రకేసరి, సీతారామరాజు ఇలాంటి సినిమాలైతేనే టివి దగ్గరికి రానిచ్చేవారు..

తర్వాత రోజు స్కూల్ కెళ్ళి నేను ఆ సినిమా కథని లంచ్ టైంలో మా ఫ్రెండ్స్ అందరికీ చెప్పేదాన్ని.. అందులో నేను కథలు బాగా చెప్తానని అందరూ అంటారు.. అందుకే వాళ్ళందరూ ఎప్పుడు లంచ్ టైం అవుతుందా అని ఎదురు చూస్తుంటారు..

మళ్ళీ ఆదివారం వచ్చింది.. పొద్దున్నే నేను పాలు, నాన్న కాఫీ తాగి సంచి పట్టుకుని మస్తాన్ షాప్ కి వెళ్ళాము, మటన్ తీసుకురావడనికి.. ఆ పక్కనే ఉన్న కూరగాయల కొట్టులో కొత్తిమీర, పుదీనా కట్టలు తీసుకుని ఇంటికి వచ్చాము..

నాన్నా సంచి అమ్మకిస్తూ "ఇదిగో నువ్వు చెప్పినవన్నీ తెచ్చాను" అనగానే "ఆ పుదీనా కట్టల్ని వాళ్ళకిచ్చి ఆకులు వొలవమని చెప్పండి" అంది.. వెంటనే మేమిద్దరం "అబ్బా ఇప్పుడా!" అని ఒకేసారి అన్నాము..

"ఎంతసేపురా 10 నిమిషాల్లో అయిపోతుంది. అమ్మ మన కోసం కష్టపడి మటన్ కూర, పులావ్ చేసిపెడుతుంది కదా.. ఈ మాత్రం హెల్ప్ చేయకపోతే ఎలా!" అని నాన్న గబగబా పాత న్యూస్ పేపర్, పుదీనా కట్టలు తెచ్చి మాముందు పెట్టారు..

అమ్మ పులావు వండుతుందంటే నాన్నేంటో భలే సంతోషంగా ఉంటారు.. హడావిడిగా ఇల్లంతా తిరిగేస్తూ అమ్మ ఏం పని చెప్పినా ఠకీమని చేసేస్తారు.. ఇవాళైతే అమ్మ అడగకుండానే ఉల్లిపాయలు కూడా కోసేస్తున్నారు!!

మధ్యాహ్నం అన్నాలు అవ్వగానే వక్కపొడి వేసుకుంటూ "అహా ఇవాళ కురా, పులావ్ రెండూ బ్రహ్మాండంగా కుదిరాయి కదా" అని "ఇంక సాయకాలం టివి వాడు ఒక మంచి సినిమా వేసేస్తే ఈ ఆదివారాన్ని ఆనందంగా ముగించేయొచ్చు" అన్నారు..

నాన్న అనుకున్నట్టుగానే ఆ సాయంత్రం ఒక ఛానెల్‌లో మంచి సినిమా వస్తుందంట.. మాక్కూడా చెప్పారు చూడమని.. అంతే, నేనూ నానీ కారప్పూస గిన్నె పట్టుకుని టివి దగ్గరికి వచ్చేశాము..

సినిమా పేరు 'లేత మనసులు' అంట.. ఇందులో కూడా ఇద్దరు కవలపిల్లలు ఉన్నారు.. కానీ వాళ్ళ అమ్మానాన్నలు ఎందుకో పోట్లాడుకుని వాళ్ళిద్దర్నీ చెరొకళ్ళు తీసుకెళ్ళిపోతారు.. ఆ పిల్లలిద్దరూ ఒకసారి పిక్నిక్ లో అనుకోకుండా కలుసుకుని వాళ్ళిద్దరూ అక్కా

వెళ్ళేల్లే అని తెలుసుకుంటారు.. అప్పటినించి వాళ్ళిద్దరు వాళ్ళ అమ్మానాన్నని కలపడానికి చాలా ప్రయత్నించి చివరికి ఇద్దరూ కలిసి ఇంట్లోంచి పారిపోయి తిరుపతి కొండకి వెళ్తారు..

సినిమాలో చివరికి అందరూ కలుసుకున్నా ముందు మాత్రం వాళ్ళని చూస్తే పాపం అనిపించింది.. అంత మంచి అమ్మా నాన్నా ఉన్నా వేరువేరుగా పెరుగుతారు.. మరుసటిరోజు మా ఫ్రెండ్స్ కి ఈ కథ చెప్పగానే శ్రీలత అంది "మా పక్కింట్లో ఉండే అనూరాధ వాళ్ళ అమ్మానాన్న కూడా అంతే, వేరువేరుగా ఉంటారు.. అనురాధకి ఒక అన్నయ్య కూడా ఉన్నాడంట.. ఆ అబ్బాయి వాళ్ళ నాన్న గారి దగ్గర ఉంటారంట.. వాళ్ళెప్పుడూ వీళ్ళని చూడటానికి రాలేదు!"

సాయంత్రం ఇంటికి వస్తుంటే నానీతో అన్నా 'నిన్న సినిమాలోనే కాదు మా ఫ్రెండ్ వాళ్ళ పక్కింట్లో కూడా అమ్మానాన్నలు వేరుగా ఉన్నారు' అని శ్రీలత చెప్పిన అనూరాధ వాళ్ళ గురించి చెప్పాను.. తర్వాత నాన్న టివీలో అంత మంచి సినిమాలు రాలేదని మమ్మల్ని చూడనీయకపోయినా బయట ధియేటర్ కి తీసుకెళ్ళి మరీ చూపించారు..

ఒకరోజు చాలా హుషారుగా వచ్చి అమ్మతో "షోలే మళ్ళీ వచ్చింది.. ఈ శుక్రవారం వెళ్దాం.." అని చెప్పి మాతో ఆ సినిమా గురించి చెప్పడం మొదలుపెట్టారు.. వాళ్ళు చదువుకునే రోజుల్లో ఆ సినిమా వచ్చినప్పుడు టికెట్స్ దొరక్క ఎంత కష్టపడ్డారో, చూసిన తర్వాత బాగా నచ్చి మళ్ళీ ఎన్నిసార్లు చూసారో, మొదటిసారి చూసినప్పుడు అమ్మకి కూడా ఎంత బాగా నచ్చేసిందో.. ఇలా చెప్తుంటే మధ్యలో నానీకి "అయితే మమ్మల్ని కూడా తీసుకెళ్తారా నాన్నా?" అనడిగాడు.. ఎందుకంటే చాలాసార్లు మమ్మల్ని అమ్మమ్మ వాళ్ళ ఇంట్లో వదిలేసి వాళ్ళిద్దరే వెళ్ళిపోతారు సినిమాలకి..

"మీరు కూడా వస్తున్నారా.. అందుకే ఇంతలా చెప్తున్నా దాని గురించి" అన్నారు.. ఇక మేమిద్దరం శుక్రవారం ఎప్పుడొస్తుందా అని చూడటం మొదలుపెట్టాం.. మా ఫ్రెండ్స్ కి కూడా చెప్పేసాము..

శుక్రవారం సాయంత్రం అయితే ఇంటికి తొందరగా వెళ్ళాలని ఫాస్ట్‌గా పోనివ్వమని సాంబయ్యని తెగ హడావిడి పెట్టేసాడు నాని.. రిక్షా ఇంకా సరిగ్గా ఆగకుండానే ఇద్దరం ఒక్క దూకు దూకి ఇంట్లోకి పరిగెత్తుకుంటూ వెళ్ళాము.. బయట చెప్పులు విడుస్తుంటే లోపలనించి పెద్దపెద్దగా మాటలు వినబడుతున్నాయి..

ఎవరా అని చూస్తే అమ్మా నాన్నే! వాళ్ళే ఎందుకో గట్టిగా మాట్లాడుకుంటున్నారు.. నాన్న ఎప్పుడు అంత గట్టిగా మాట్లాడటం మేము వినలేదు.. "నీ మాట నీదే కానీ నేను చెప్పేది కాస్త కూడా పట్టించుకోవుగా!" అంటూ అమ్మని అంటుంటే, అమ్మ ఇంకా గట్టిగా "అదే నేను మిమ్మల్ని అడుగుతున్నా.. నా మాట గురించి ఆలోచించొచ్చు కదా!" అనంది..

"ఇప్పటి వరకూ విన్నవి చాలుగానీ ఇంక మాట్లాడకు" అని ఇంకాస్త గట్టిగా అన్నారు.. నాకైతే చాలా భయం వేసింది.. నెమ్మదిగా వెళ్ళి బట్టలు మార్చుకుంటుంటే నానీ "సినిమాకి ఎన్నింటికి వెళ్దాం నాన్నా?" అని అడగటం వినిపించింది.. అంతే నాన్న కోపంగా "సినిమా లేదు గినిమా లేదు.. పోయి స్నానం చేసి పుస్తకాలు తియ్యండి ఇద్దరూ" అని గట్టిగా అరిచారు..

నానీ నెమ్మదిగా నాదగ్గరకొచ్చి "ఏమైందక్కా? నాన్నెందుకు అంత కోపంగా ఉన్నారు?" అనడిగితే "అమ్మా నాన్నా పోట్లాడుకుంటున్నారు" అని నేను కూడా నెమ్మదిగా చెప్పా.. తర్వాత మేమిద్దరం అస్సలు శబ్దం చేయకుండా కూర్చుని చదువుకోవడం మొదలుపెట్టాం..

తర్వాత మా ఇద్దరికీ అన్నం పెట్టేటప్పుడు అమ్మ మాటిమాటికీ కళ్ళు తుడుచుకుంటుంది.. మేము అన్నం తినగానే తను అన్నం తినకుండానే వెళ్ళి పడుకుంది.. "ఇలా అన్నం మానేసి ఎవర్ని సాధిద్దామని" అని నాన్న తన పళ్ళెం ఠంగ్ మని శబ్దం వచ్చేలా పడేసి అన్నం పెట్టుకోవడం మొదలుపెట్టారు.. మేమిద్దరం నెమ్మదిగా వెళ్ళి పడుకుండిపోయాము..

మరుసటిరోజు పొద్దున్న లేచేసరికి ఇల్లు చాలా నిశ్శబ్దంగా ఉంది.. మామూలుగా అయితే అమ్మ ఏవేవో మాట్లాడుతూ మమ్మల్ని

స్కూల్ కు రెడీ చేస్తుంది.. నాకైతే సాంబయ్య ఎప్పుడొస్తాడా, స్కూల్ కి ఎంత తొందరగా వెళ్దామా అనిపించింది..

అప్పటినించీ అమ్మా నాన్నా ఇద్దరూ అస్సలు మాట్లాడుకోవటం లేదు.. మాతో కూడా 'స్నానం చెయ్యి' 'పాలు తాగు' 'హోం వర్క్ పూర్తయిందా' అనే గానీ ఇంకేమీ అడగటంలేదు..

"ఈ మరకలన్నీ ఏంటి.. ఇది అసలు ఉతికిన టవలేనా! సిరీ, మీ అమ్మని ఇంకో టవల్ ఇమ్మను".. "అన్నమా, బియ్యమా? ఇంత పలుకుల్లా ఉంటే గొంతెలా దిగుతుంది" అని నాన్న, "కాఫీపొడి అయిపోవచ్చని చెప్పి ఎన్నాళ్ళు అయింది! ప్రతీది నేనే చూసుకుని నేనే తెచ్చుకోవాలంటే ఎక్కడ కుదురుతుంది.. ఒరే నానీ, మీ నాన్నతో చెప్పు రేపొద్దున్న కాఫీ కావాలంటే సాయంత్రం కాఫీ పౌడర్ తేవాలని" అంటూ అమ్మ! ఇలా ఇద్దరూ మాతోనే మాట్లాడుతూ పనులు చేయించుకుంటున్నారు..

మేమిద్దరం కూడా ప్రశ్నలేమీ అడగకుండా వాళ్ళు ఏం చెపితే అది గబగబా చేసేస్తున్నాము.. నాకంటే పాపం నానీకి ఇంకా భయం వేస్తున్నట్లుంది.. ఎప్పుడూ నా పక్కనే ఉంటున్నాడు.. రాత్రి హోం వర్క్ చేసేసిన తర్వాత ఆకలైనా అమ్మకి చెప్పడం లేదు.. అమ్మ ఎప్పుడు పెడితే అప్పుడే తినేసి, నాతో పాటే నా మంచం మీదే పడుకుంటున్నాడు..

ఒకరోజు స్కూల్లో క్లాస్‌లో ఉంటే నానీ వాళ్ళ క్లాస్ అబ్బాయి వచ్చి మా టీచర్ ని ఎక్స్‌క్యూజ్ అడిగి, నన్ను వాళ్ళ టీచర్ పిలుస్తున్నారని తీసుకెళ్ళాడు.. మళ్ళీ ఈ నానీగాడు ఏం చేసాడో అనుకుంటూ వెళ్ళాను..

నన్ను చూడగానే వాళ్ళ టీచర్ "సిరీ, మీ తమ్ముడికి చాలా జ్వరంగా ఉంది.. నేను రిక్షా పిలిపిస్తాను ఇంటికి తీసుకెళ్ళు" అన్నారు.. వెంటనే నానీ కోసం చూస్తే వాడు పక్కనే బెంచీలో పడుకుని ఉన్నాడు.. ముందే డబ్బులిచ్చేసి టీచర్ గారే దగ్గరుండి మా ఇద్దర్నీ రిక్షా ఎక్కించారు.. నా వళ్ళో తలపెట్టుకుని పడుకున్న నానీని చూస్తే నాకు చాలా ఏడుపు వచ్చేసింది..

ఆ టైం లో అమ్మానాన్నా ఇద్దరూ ఇంట్లో ఉండరు కాబట్టి అమ్మమ్మ వాళ్ళింటికి తీసుకెళ్ళమని రిక్షా అబ్బాయికి చెప్పాను.. మమ్మల్ని చూడగానే అమ్మమ్మ చాలా కంగారు పడింది.. నానీని గబగబా ఇంట్లోకి తీసుకెళ్ళి, బలవంతంగా పాలు తాగించి టాబ్లెట్ వేసింది.. చిన్న తడి టవల్ తల మీద పెట్టి నెమ్మదిగా వత్తుతూ "సిరీ, ఇంత జ్వరంలో వీడిని స్కూల్ కి ఎందుకు పంపింది మీ అమ్మ" అనడిగితే "అమ్మకి తెలీదుగా అమ్మమ్మా.. వీడు కూడా అస్సలేమీ చెప్పలేదు" అన్నాను..

ఇంకో గంట తర్వాత కూడా జ్వరం అస్సలు కొంచెం కూడా తగ్గకపోతే తాతయ్య హాస్పిటల్ కి తీసుకెళ్ళడానికి వాడిని నెమ్మదిగా లేపుతుంటే కళ్ళు కొంచెం తెరిచి "అక్కా" అంటూ నా చెయ్యి పట్టుకుని వదలకపోతే తాతయ్య నన్ను కూడా రమ్మన్నారు.. తిరిగొచ్చిన తర్వాత మా ఇంటికి కాల్ చేసారు.. అప్పటికి అమ్మ వచ్చినట్లుంది, నానీ సంగతి వినగానే వెంటనే వచ్చేసింది..

నానీని స్కూల్ కి ఎందుకు పంపావని అంటున్న అమ్మమ్మతో అమ్మ "బాలేదని తెలిస్తే ఎందుకు పంపుతానమ్మా?" అంటే, "మరి అంత జ్వరం అప్పటికప్పుడు ఎలా వస్తుంది? ఎప్పుడూ ఎగురుతూ గెంతులు వేస్తూ అల్లరి చేసేవాడు నెమ్మదిగా ఉంటే అనుమానమన్నా రాలేదా నీకు!" అని ఇంకాస్త గట్టిగా అడిగింది.. అమ్మ ఏం చెప్పలేదు.. అసలు అమ్మమ్మకి తెలీదుగా మేమిద్దరం చాలా రోజులనించి ఇంట్లో అసలు అల్లరి చేయటం లేదని!

తాతయ్య ఆ రాత్రి నానీని అక్కడే ఉంచమన్నారు.. నేనూ, అమ్మా ఇంటికి వచ్చేసరికే నాన్న ఉన్నారు.. అమ్మ గబగబా వెళ్ళి "నానీకి మంటల జ్వరమండి.. స్కూల్ నుంచి మధ్యాహ్నమే సిరితో పంపించేసారంట" అని చెప్పింది.. నాన్న కూడా కంగారుగా "అవునా.. ఏడీ వాడు?" అనడిగితే తాతయ్య వాళ్ళింట్లోనే ఉంచేసిన సంగతి చెప్పింది..

నాన్న హడావిడిగా వెళ్ళారు అక్కడికి.. కాసేపైన తర్వాత వచ్చి "ఇంత సడెన్ గా అంత జ్వరం ఎలా వచ్చిందంటావ్?" అంటూ అమ్మ దగ్గరే కూర్చున్నారు.. అప్పుడనుకున్నా 'హమ్మయ్యా అమ్మానాన్నా మళ్ళీ మాట్లాడుకుంటున్నారు' అని.. సంతోషం వేసింది కానీ అంతలోనే జ్వరంతో పడుకున్న నానీ గుర్తొచ్చి ఏడుపు వచ్చింది.. అన్నం కూడా తినబుద్దికాలేదు.. అమ్మే ముద్దలు కలిపి పెడితే తిని

పడుకున్నా..

"సిరి సిరీ.. ఒకసారి లేమ్మా" నన్ను లేపుతున్న నాన్న గొంతు వినబడుతుంది.. 'అప్పుడే పొద్దున్న అయిపోయిందా!' అనుకుని కళ్ళు తెరిస్తే ఇంకా లైట్ వెలుగుతూ కిటికీలోంచి చీకటిగానే అనిపించింది.. "ఒక్క ఐదు నిమిషాలు లేమ్మా.. అమ్మమ్మ వాళ్ళింటికెళ్ళి పడుకుందువు గానీ" అని నన్ను లేపి నుంచోబెట్టారు.. ఇప్పుడు అమ్మమ్మ వాళ్ళింటికి ఎందుకో అనుకున్నా!

నిద్రలో ఎప్పుడు అమ్మమ్మ వాళ్ళిల్లు వచ్చిందో తెలీదు.. మమ్మల్ని చూడగానే తాతయ్య వచ్చి నా చెయ్యి పట్టుకుని లోపలికి తీసుకెళ్ళారు.. అక్కడ మంచం మీద లేచి కూర్చుని నానీ ఏడుస్తూ ఉన్నాడు.. నన్ను చూడగానే అమ్మమ్మ "ఇదిగో మీ అక్క వచ్చేసింది ఇంక ఏడుపు ఆపేసి పడుకో నాన్నా.. మా మంచి నానీవి కదూ" అంటూ నన్ను మంచం మీద కూర్చోబెట్టింది..

పక్కనే తాతయ్యేమో అమ్మతో "ఉన్నట్టుండి నిద్రలోంచి లేచి అక్క ఏదని ఒకటే ఏడుపు.. మీ ఇంట్లో ఉంది రేపొద్దున్నే వచ్చేస్తుందంటే అసలు వింటేగా! ఇంక ఇంత రాత్రైనా మిమ్మల్ని లేపక తప్పలేదు" అని చెప్తున్నారు.. ఇక అందరం అక్కడే పడుకున్నాము..

పొద్దున్నే మళ్ళీ వాడిని హాస్పిటల్ కి తీసుకెళ్ళారు నాన్నా, తాతయ్య కలిసి.. నన్ను స్కూల్ కి కూడా పంపలేదు.. తిరిగొచ్చిన తర్వాత నాన్న అంటున్నారు "ఇది ఏదో భయం వలన వచ్చిన జ్వరం అంట.. దేన్నో చూసి దడుచుకుని ఉంటాడని డాక్టర్ అన్నారు".. అమ్మేమో "ఎందుకు భయపడ్డాడో ఏమిటో" అంటూ వెళ్ళి ఉప్పు తెచ్చి దిష్టి తీయడం మొదలుపెట్టింది..

ఆ రోజు కూడా అందరం అమ్మమ్మ వాళ్ళింట్లోనే ఉన్నాము.. సాయంత్రానికి వాడు కళ్ళు తెరిచి చూడటం మొదలుపెట్టాడు.. జ్వరం మొత్తం పోవడానికి 2 డేస్ పట్టింది.. ఇంక మా ఇంటికి వచ్చేసాక నానీకి నీరసంగా ఉందని అమ్మ కూడా సెలవు పెట్టి ఇంట్లో ఉండిపోయింది.. నేను కూడా స్కూల్ నించి రాగానే వాడి దగ్గరే కూర్చుని హోం వర్క్ చేసుకుంటున్నా..

"ఎలా ఉందిరా ఇప్పుడు?" అంటూ అమ్మమ్మ తాతయ్య వచ్చారు.. "ఇదిగో ఇప్పుడే పథ్యం తినిపిస్తున్నా" అంది అమ్మ.. 'అదేంటి అమ్మ వాడికి పెడుతుంది చారన్నం కదా.. అదేదో పథ్యం అంటుందేమిటీ!'

నాన్న కూడా వచ్చేసారు ఆఫీస్నించి.. అంతలో తాతయ్య నానీతో "ఎంత కంగారు పెట్టేసావురా అందరినీ.. ఇంతకీ నీకు జ్వరం రాకముందు ఏదైనా భయం వేసేది చూసావా?" అనడిగారు.. నేను కూడా నా హోం వర్క్ ఆపేసి వాడి వంకే చూసాను.. వాడేమో "లేదు" అని తల అడ్డంగా ఊపాడు..

అమ్మేమో "లేదేంటి!! అంతలా ఉలికిలికి పడితేనూ.. అక్కని కూడా వదల్లేదు ఆ రెండు రోజులు" అంది..

నాన్న "మేమేమీ అనములే.. సరిగ్గా గుర్తు తెచ్చుకోరా.. మళ్ళీ ఇలా జ్వరం వస్తే ఎలా చెప్పు.. ఇప్పటికే నీ ఫ్రెండ్స్ అందరూ అడుగుతున్నారు, నువ్వు ఆడుకోవటానికి ఎప్పుడు వస్తావని" అన్నారు..

నానీ ఒకసారి నాన్న వైపు భయంగా చూసాడు.. తాతయ్య వాడిని వళ్ళో కూర్చోబెట్టుకుంటూ "భయపడకుండా చెప్పరా" అని మళ్ళీ అడిగారు..

వాడు అమ్మా నాన్న వైపు చూస్తూ "అప్పుడు సినిమాలో లాగా మీ ఇద్దరూ గట్టిగట్టిగా పోట్లాడుకున్నారు కదా.. అలా పోట్లాడుకుంటే అక్కనీ, నన్నూ వేరే వేరే ఇంటికి తీసుకెళ్ళిపోతారు కదా.." అని అన్నాడు..

ఎందుకో మరి ఎవ్వరూ ఏమీ మాట్లాడటం లేదు.. అమ్మమ్మ తాతయ్యేమో అమ్మానాన్న వంకే చూస్తున్నారు.. అమ్మ ఏడవడం మొదలుపెట్టేసింది.. నాన్న మాత్రం నానీని తాతయ్య దగ్గరనించి తీసుకుని "అలా సినిమాల్లో చూపించినట్లు ఎప్పుడూ బయట జరగవురా" అంటే వాడు "అక్క వాళ్ళ ఫ్రెండ్ కూడా చెప్పింది, వాళ్ళ పక్కింటి ఆంటీ వాళ్ళు కూడా అలానే తీసుకెళ్ళిపోయారని.. మళ్ళీ వాళ్ళు ఎప్పుడూ చూసుకోలేదంట!!"..

"అసలు పిల్లల ముందు ఈ గొడవలేంటమ్మా!" అని అమ్మమ్మ ఏదో అనబోతుంటే నాన్న "మేమెప్పుడూ అలా చేయము సరేనా..

నువ్వెప్పుడూ అంటావే, అలా గాడ్ ప్రామిస్.. అయినా మేము మీ చేతుల్లో బొమ్మల్లాంటివాళ్ళం.. మేం చేసేవన్నీ మీకోసమే కదా.. బాటరీ అయిపోయినప్పుడు బొమ్మలు ఎలా గర్ర్ మని శబ్దాలు చేస్తాయో మా గొడవలు కూడా అంతే! మేము అమ్మమ్మ తాతయ్య అంత.. మీరు మా అంత అయిపోయాక కూడా అందరం ఒకేచోట ఉంటాం.. సరేనా?" అని అన్నారు..

తర్వాత అమ్మమ్మ అమ్మని లోపలికి తీసుకెళ్ళి ఏదో చెప్పింది.. తాతయ్యేమో "మనం నల్ల చెరుకులు తీసుకురావాలి.. మరవి మొయ్యడానికి తొందరగా అన్నం తినేసి మళ్ళీ బలం తెచ్చేసుకో" అని నానీతో అంటున్నారు..

నాకైతే అస్సలు అనిపించలేదు అమ్మానాన్నా మమ్మల్ని వేరే వేరే ఇంట్లో పెట్టేస్తారని.. పాపం నానీ ఇంకా చిన్నవాడుగా, అందుకే నా అంత బాగా తెలీదు!

నాన్న "ఇంక మిమ్మల్ని టివి జోలికి రానిచ్చేది లేదు" అంటూ రేడియో పెట్టారు.. అందులోంచి "కోడి ఒక కోనలో.. పుంజు ఒక కోనలో" అని ఏదో పాట వస్తుంది.. ఎందుకో మరి ఠకీమని అది కూడా ఆఫ్ చేసేసారు!!

# ఏది పెద్ద తప్పు?

ఆరోజు ఎందుకో లంచ్ చాలా తొందరగా అయిపోయింది.. ఇంకా బెల్ కొట్టడానికి బోల్డంత టైం ఉందని ఏదన్నా ఆట ఆడుకుందామని మా ఫ్రెండ్స్ అందరం అనుకుంటుంటే అంతలో శ్రీలత వచ్చి "ఆటలొద్దు కానీ తోటలోకి వెళ్ళి ఏమన్నా కాయలు పడ్డాయేమో చూసొద్దామా?" అంది.

తోటంటే మనం బస్సులో వెళ్ళేటప్పుడో, లేక అత్త వాళ్ళ ఊరికెళ్ళినప్పుడో కనిపించేంత పెద్దది కాదు.. అసలు అక్కడ నాలుగైదు చెట్లే ఉంటాయి.. మా స్కూల్ గోడ లోపలే.. మా క్లాస్ బిల్డింగ్, హాస్టల్ బిల్డింగ్ కూడా దాటేసిన తర్వాత ఆ చివరగా ఉంటుంది.

అసలు అటువైపు ఎవరూ వెళ్ళరు.. అప్పుడెప్పుడో హాస్టల్ వైపు వెళ్ళినప్పుడు శ్రీలతే అక్కడేం చెట్లు ఉన్నాయో చూద్దామని మమ్మల్ని లాక్కెళ్ళింది.. ఆ తోటలో నేరేడు, జామ, చింతకాయ, బూరుగు దూది చెట్లు ఉంటాయి.

ఈవాళ మాత్రం ఎవరూ అంత దూరం రానంటే నేనూ, శ్రీలతే కబుర్లు చెప్పుకుంటూ వెళ్ళాము.. అక్కడక్కడా నేరేడు పళ్ళు రాలి ఉన్నాయి కానీ చూడటానికే అవి బాలేదు.. రాళ్ళతో కొట్టినా కాయలేమీ కింద పడలేదు.. జాంకాయలైతే అసలే లేవు.. "ఇంత దూరం అనవసరంగా వచ్చాం శ్రీలతా" అని నేనంటుంటే నా మాట వినిపించుకోకుండా శ్రీలత మా స్కూల్ కాంపౌండ్ గోడ వైపు వెళ్ళింది.

"సిరీ, ఆ అరటిచెట్టు చూడు" అంటూ తను చూపెట్టిన వైపుకి చూశాను.. మా స్కూల్ గోడకి ఆనుకునే ఉన్న ఇంట్లో ఉన్న అరటిచెట్టు సగం మా స్కూల్ వైపుకి వాలి పోయి ఉంది.. దానికి మూడు అరటి గెలలు కూడా వున్నాయి.

"ఏంటీ అరటిపళ్ళు కోసుకుందామా? అవి ఇంకా చాలా పచ్చిగా ఉన్నాయి కదా!" అన్నా.

"అహ.. అరటి పళ్ళు కాదు ఆ అరటి పువ్వులు చూడు.. చాలా పెద్దగా భలే ఉన్నాయి" అని శ్రీలత అంటే "దాన్నేం చేసుకుంటాం!?" అర్థం కాక అడిగాను తనని..

"ఏం చేసుకుంటాం ఏంటి.. అరటి పువ్వుతో కూర భలే ఉంటుంది తెలుసా" అంది.

అరటిపువ్వుతో కూరా! నేనెప్పుడూ వినలేదు.. అమ్మ ఎప్పుడూ చేయలేదు.. మా చుట్టాల ఇంట్లో కూడా తిన్నట్టు గుర్తులేదు నాకు.

అందుకే "నాకొద్దులే శ్రీలతా.. అది నువ్వే తీసుకో" అని చెప్పా.

"నిజంగానా! మొత్తం నేను తీసుకోనా? మళ్ళీ కాసేపాగి సగం ఇవ్వమని అడగవుగా" అంది.

"అబ్బా నిజంగా అడగను.. ప్రామిస్" అని నేను చెప్పగానే గబగబా ఆ అరటిపువ్వు ఉన్న కొమ్మని మాకు అందేట్లు కిందకి లాగి పట్టుకుని "సిరీ, అక్కడ కాడ దగ్గర పట్టుకుని కొయ్యి" అంది..

కాస్త గట్టిగా అటూ ఇటూ ఊపగానే వచ్చేసింది అరటిపువ్వు.. నేనెప్పుడూ అరటిపువ్వుని అంత దగ్గర నించి చూడలేదు.. దాన్ని అటూ ఇటూ తిప్పుతూ "భలే ఉంది కదా!" అన్నా.

"అవును కానీ చాలా పెద్దగా ఉంది.. ఇప్పుడు దీన్ని పట్టుకుని క్లాస్ వరకూ వెళ్ళడం ఎలా?" అంటూ శ్రీలత చుట్టూ చూసింది.. మళ్ళీ నావైపు తిరిగి "ప్చ్ ఇక్కడ పాత పేపర్లు కూడా ఏమీ లేవు.. సిరీ, నీ స్కర్ట్ కి చాలా కుచ్చులు ఉన్నాయి కదా.. నువ్వు పక్కనే స్కర్ట్‌లో చుట్టేసి పట్టుకుని పద.. నేను నీ పక్కనే నడుస్తాను.. అప్పుడు ఎవరికీ కనిపించదు" అంది.

అసలు కనిపించకుండా ఎందుకు పట్టుకోవాలో నాకర్ధం కాలేదు.. కానీ మా లంచ్ టైం అయిపోయినట్లు దూరంగా ఫస్ట్ బెల్ కొట్టారు.. మూడో బెల్ కల్లా టీచర్ వచ్చేస్తారు.. అందుకే ఇంక ఏం మాట్లాడకుండా తను చెప్పినట్లే ఆ అరటిపువ్వుని నా స్కర్ట్‌లో చుట్టేసి, ఇద్దరం పక్కపక్కనే నడుచుకుంటూ వచ్చేసాం.

క్లాస్ లోకి వెళ్ళగానే శ్రీలత గబగబా పువ్వుని నా దగ్గర నించి తీసుకుని, తన లాంగ్ నోట్‌బుక్ లోంచి 4, 5 పేజీలు బరబరా చింపి, వాటిలో దాన్ని చుట్టేసింది. అంతలో క్రాంతి చూసి "ఏంటది శ్రీలతా?" అనడిగింది.

శ్రీలత వెంటనే "ఏం లేదు.. మేమిందాక వెళ్తుంటే మాతో రాలేదుగా.. అందుకే మేమేమి నీకు చెప్పం.. కదా సిరీ!" అని నా వైపు చూసి నవ్వింది.

నాకది నచ్చలేదు. క్రాంతి కూడా మా ఫ్రెండ్ కదా! అందుకే టీచర్ క్లాస్ లోకి వచ్చి మమ్మల్ని బుక్స్ తీయమని చెప్తుంటే నేను క్రాంతికి అరటిపువ్వు గురించి చెప్పేశా.

"అవును మీరు చేసుకుంటారా దానితో కూర?" అనడిగితే తను మాత్రం "అమ్మో! అయితే మీరు దొంగతనం చేశారన్నమాట!" అని కళ్ళు ఇంత పెద్దవి చేసి నావంక చూసింది. క్రాంతి కళ్ళు అలా పెద్దవి చేస్తే నాకు చాలా భయం. సినిమాల్లో చూపించే అమ్మవారి కళ్ళు గుర్తొస్తాయి. ఇప్పుడు తను అన్నది వింటే ఇంకా భయం వేసింది!

"దొంగతనం ఏంటి!? అక్కడుంటే కోసుకొచ్చాం.. అంతే!" అని నేనంటే క్రాంతి వెంటనే "కానీ అది వేరే వాళ్ళ ఇంట్లోది కదా.. వాళ్ళని అడగకుండా కోసుకుంటే మరి అది దొంగతనమే కదా" అనడిగింది.. మళ్ళీ తనే "దొంగతనం కాకపోతే అలా ఎవరికీ కనబడకుండా దాచి ఎందుకు తెచ్చారు?" అని ఈసారి కళ్ళు పైకి లేపి అడిగింది.

నేను వెంటనే "నేను కాదు, శ్రీలతే అలా తెద్దామని చెప్పింది" అని చెప్పాను.. "మరి అయితే శ్రీలతే ఎందుకు తన స్కర్ట్ లో దాచుకుని తీసుకుని రాలేదు? అంటే తనకి కూడా తెలుసు మీరు దొంగతనం చేసారని.. ఎవరన్నా పట్టుకుని అడిగితే తను అంతా నీ మీదే తోసేసేది తెలుసా!" అని గుసగుసగా చెప్పింది.

"శ్రీలత అలా ఏం చెయ్యదు" అని డబాయించి చెప్పాగానీ నాకు అనిపించింది. నన్నే కోయమంది.. నన్నే దాచి తీసుకురమ్మంది.. అంటే శ్రీలతకి తెలుసా మేం చేసింది దొంగతనమని!! అప్పటికే క్రాంతి చాలా సార్లు అనేసింది 'దొంగతనం చేశారు' అని. నాకు

భయంగా అనిపించింది.

మళ్ళీ క్రాంతి నావైపు చూసి 'సిరీ, నువ్వు వెళ్ళి మన టీచర్ కి చెప్పేయ్" అంటే "నేనెందుకు చెప్పాలి? దాన్ని నేను మా ఇంటికి తీసుకెళ్ళడం లేదుగా!" అని అలానే కూర్చున్నా.

"నీ ఇష్టం.. నా ఫ్రెండ్ అని చెప్తున్నా.. పైనించి దేవుడు అన్నీ చూస్తూనే ఉంటాడు.. మనం దొంగతనం అంటే, మనది కాని వస్తువుని ఎవరికీ తెలియకుండా తీసుకుంటే ఆయన ఏం చేస్తాడో తెలుసా!?" అనడిగింది.

"తెలీదు.. అసలివన్నీ నీకెవరు చెప్పారు" అన్నా.

"మా బామ్మ చెప్పిందిలే.. మనం దొంగతనం చేస్తే దేవుడు వేరేవాళ్ళు మన దగ్గరి నించి, మనకిష్టమైంది దొంగతనం చేసేట్లు చేసి మనల్ని పనిష్ చేస్తాడు" అంది..

నాకు భయం ఇంకా ఎక్కువైంది.. ఇంక శ్రీలత మీద చాలా కోపం కూడా వచ్చింది.. అంతా తన వల్లనే! తప్పులన్నీ నాతో చేయించి తను మాత్రం చక్కగా కూర తింటుంది!!

అంతలో క్రాంతి "ఏయ్ సిరీ, నీ స్కర్ట్‌కి చూడు ఏదో అంటుకుంది" అని చూపించింది.. మట్టిలో పడ్డట్టుగా అరటిపువ్వు చుట్టిన చోటంతా పైనించి కింద వరకూ పెద్ద పెద్ద మచ్చలు పడ్డాయి!

ఆరోజు సాటర్ డే కాబట్టి మాకు ఫుల్ వైట్ డ్రెస్! అందుకే ఆ మచ్చలు ఇంకా బాగా కనబడుతున్నాయి.. నాకైతే కాళ్ళు వణకడం మొదలుపెట్టాయి..

"మేమెక్కడా మట్టిలో ఆడలేదు కదా.. ఇవెలా అంటుకున్నాయి?" అని క్రాంతి వైపు ఏడుపు మొహం వేసుకుని చూసాను.

"అవి మట్టి మరకలు కాదు.. అరటిపువ్వు పసరు.. అంటుకుంటే పోవటం చాలా కష్టం!" మళ్ళీ కళ్ళు పెద్దవి చేసింది..

నాకెందుకో క్రాంతి మీద కూడా బాగా కోపం వస్తుంది.. ఏదీ మంచిగా చెప్పటం లేదు ఇవాళ! అయినా ఏంటో, ఇలాంటివన్నీ తనకు ఎలా తెలుస్తాయో!

సాయంత్రం ఇంటికి వెళ్ళేటప్పుడు కాళ్ళు వణుకుతున్నాయి.. 'అమ్మ డ్రెస్ ఎలా పాడైంది?' అంటే ఏం చెప్పాలని.. దొంగతనం చేసానని తెలిస్తే అస్సలూరుకోదు.. నాన్న అయితే బెత్తం బయటికి తీస్తారు!

రిక్షా దిగుతూనే భయంగా ఇంట్లోకి చూశా.. అమ్మ ముందు గదుల్లో కనిపించలా.. అంతే గబా గబా స్కూల్ డ్రెస్ మార్చుకుని ఆ బట్టల్ని విడిచిన బట్టల బుట్టలో అడుక్కి తోసేసా..

'హమ్మయ్య, రేపు చాకలి ఈ బట్టలన్నీ ఉతికేస్తుంది.. అమ్మ చూడకుండానే ఆ మచ్చలన్నీ పోతాయి' అనుకున్నా.. అప్పుడు కొంచెం గెంతుకుంటూ అమ్మెక్కడ ఉందో చూడటానికి వెళ్ళాను.

కానీ మరుసటిరోజు ఆదివారం సాయంత్రం అమ్మ ఉతికిన బట్టలు మడత పెడుతూ "సిరీ, నీ వైట్ స్కర్ట్ నిండా ఈ మచ్చలేమిటే!" అని అడిగేసరికి పక్కనే బొమ్మలు గీసుకుంటున్న నాకు మళ్ళీ కాళ్ళు వణకడం మొదలుపెట్టాయి..

"అదా! నిన్న లంచ్ లో ఆడుకుంటుంటే బురద నీళ్ళల్లో పడ్డానమ్మా" అని ఏంటో నోటికి వచ్చింది అనేసాను..

"బురదలోనా!? వర్షాల్లేవని అందరూ గగ్గోలు పెడుతుంటే నీకు బురద నీళ్ళు ఎక్కడనించి వచ్చాయి? అయినా మీ స్కూల్లో చిన్న కాయితం ముక్క పడేసినా ఫైన్ వేస్తారు కదా.. అలాంటిది పిల్లలాడుకునే గ్రౌండ్స్ లో బురద నీళ్ళు ఎలా వదిలేసారు!?" కాస్త గట్టిగా అడిగింది..

"గ్రౌండ్స్ లో కాదమ్మా.. హాస్టల్ పక్కనున్న తోటలో ఆడుకుంటుంటే పడ్డాను" అని నేను చెప్తే "అంత దూరం వెళ్ళి ఆడుకోవాల్సిన అవసరం ఏమొచ్చింది?" అంటూ అమ్మ ఇంకా ఏదో అడగబోతుంటే నాన్న "అబ్బా! పిల్లలు ఎక్కడ పడితే

ఆడుకుంటారు.. ముందు దానికి దెబ్బలేమైనా తగిలాయేమో చూడు" అన్నారు..

నేను వెంటనే "లేదు నాన్నా.. దెబ్బలు అస్సలు తగల్లేదు.. నొప్పి ఉంటే నిన్నే అమ్మకి చెప్పేదాన్ని" అని తల అడ్డంగా గబగబా ఊపేస్తూ చెప్పాను..

అమ్మ మాత్రం "మీకేం బానే చెప్తారు కబుర్లు.. మల్లెపువ్వులా ఉండే తెల్ల స్కర్ట్ మీద ఈ మరకలు వదిలించేసరికి నా తల ప్రాణం తోక్కొస్తుంది" అంటూ విసుక్కుంటూ ఆ స్కర్ట్ పట్టుకెళ్ళింది.. మళ్ళీ ఉతకడానికి కాబోలు! నేను మాట్లాడకుండా తల వంచుకుని బొమ్మలు గీసుకుంటూ కూర్చున్నా..

రెండు రోజుల్లో ఆ స్కర్ట్ తీసుకొచ్చి నాన్న ముందు పెడుతూ "ఇక నా వల్ల కాదండి ఈ మచ్చల్ని పోగొట్టడం.. వేడినీళ్ళల్లో నానేసాను.. మన చాకలి చెప్పిన చిట్కాలన్నీ వాడాను.. ఊహూ.. కొంచెం కూడా వదల్లేదు.. ఇంకోటి కొనాల్సిందే. అయినా ఆ బురదేం బురదండి బాబు.. తుమ్మ జిగురులా పట్టి వదలనంటుంది!" అని అమ్మ చెప్తుంటే నేను 'అరటిపువ్వు పసరు గురించి క్రాంతి చెప్పింది నిజమే అన్నమాట!' అనుకున్నా..

"ఈ వారం సెకండ్ సాటర్ డే కాబట్టి ప్రోబ్లెం లేదు" అని అమ్మ హడావిడి పడతూ తర్వాత వైట్ డ్రెస్ సాటర్ డే కల్లా కొత్త స్కర్ట్ కుట్టించేసింది.. ఇంకెప్పుడూ నేను వెనకనున్న తోట వైపు వెళ్ళకూడదనుకున్నా..

"రేపు మాకు సెలవమ్మా" నానీ అరుచుకుంటూ వెళ్ళాడు ఇంట్లోకి.. "అవునురా, కృష్ణాష్టమి కదా" అని అమ్మ చెప్తూండగానే ఫోన్ మోగింది. నేను పరిగెత్తుకెళ్ళి తీసి "హలో" అనగానే అటువైపు నించి "ఎవరూ సిరీ?" అని అమ్మమ్మ గొంతు వినిపించింది..

వెంటనే అమ్మని పిలిచి ఫోన్ ఇచ్చేసా.. అమ్మ "సర్లే.. నానీగాడు కూడా ఇప్పుడే అడుగుతున్నాడు సెలవెందుకని.. సాయంత్రం స్నానం అవగానే వస్తాం" అని పెట్టేసింది..

నాకర్థం అయిపోయింది.. "ఓ అయితే రేపు నానీ చిన్ని కృష్ణుడవుతాడు కదా!" అని నేనగానే "కరెక్ట్.. నీకెన్ని తెలివితేటలే సిరీ" అని అమ్మ నవ్వుతూ "రేపు అమ్మమ్మ వాళ్ళింట్లో అడుగులేసి రావాలి మరి" అంది.

ప్రతి కృష్ణుడి పుట్టినరోజుకీ అమ్మ నానీని అచ్చు కాలెండర్ లో ఉన్న చిన్ని కృష్ణుడిలా తయారుచేస్తుంది.. తర్వాత సాయంత్రం అమ్మమ్మ వాళ్ళింటికి వెళ్ళి గేట్ నించి పూజ గది వరకు వీడితో అడుగులేయించి, అమ్మమ్మ పెట్టిన అప్పచ్చులు తినేసి వస్తాం. రాగానే మా ఇంట్లో కూడా అమ్మ వాడితో అడుగులు వేయిస్తుంది.

అదేదో బియ్యం పిండి నీళ్ళంట, అవి ప్లేట్ లో పోసి, వాడిని ఆ ప్లేట్ లో నించోబెట్టి, కాళ్ళు ముంచి వేయిస్తారు అడుగులు.. ఒకసారైతే నేను బాగా గొడవ చేసానంట నేను వేస్తానని.. కానీ తమ్ముడు అబ్బాయి కదా అందుకే వాడే వెయ్యాలని అమ్మ చెప్తుంది.

మరుసటి రోజు పొద్దున్నే మా ఇద్దరికి తలస్నానాలు చేయించేసి, పూజ సాయంత్రం అని చెప్పి ఆడుకోవడానికి పంపేసింది.. సాయంత్రం మాములు స్నానం చేయించి ముందు వాడిని రెడీ చేసింది.. వాడికి ఆ పంచె లాంటి పాంట్ లూజ్ అయిందంట.. మాటాడితే పైకి లాక్కుంటూ చేతిలో ఒక బెత్తం లాంటిది పట్టుకుని తిరిగేస్తున్నాడు.. ఆ బెత్తం కృష్ణుడి చేతిలో ఉండే ఫ్లూట్ అంట!

అమ్మ నాకు పట్టులంగా వేసి గొలుసు పెడుతుంటే నేను "అమ్మా, నాకు ఈ చిన్న గొలుసు వొద్దు.. బారు గొలుసు వేయమ్మా" అనడిగాను.. "మొన్న పండగకి వేసుకున్నావు కదే. అయినా ఎప్పుడూ ఆ గొలుసేనా!" అని విసుక్కుంటూనే బారు గొలుసు వేసింది.

తర్వాత నాన్న మమ్మల్ని తీసుకెళ్ళి అమ్మమ్మ వాళ్ళింట్లో దింపి పనుందని వెళ్ళిపోయారు.. అమ్మమ్మ నానీ కృష్ణుడి పాదాలు వేయించి, పూజ చేసుకుని మాకు ప్రసాదాలు పెట్టింది.. "ఇద్దరూ ఇవాళ తెగ ముద్దొస్తున్నారే" అని మా ఇద్దరికీ దిష్టి తీసింది.. అంతలో అమ్మ ఫోన్ చేసిందనుకుంటా, అమ్మమ్మ మాట్లాడుతూ "మీ నాన్నగారింకా రాలేదే. ఒక 10 నిమిషాల్లో పంపిస్తాలే" అని చెప్తుంది.

అటునించి అమ్మ ఏమందో మరి అమ్మమ్మ "సరే మరి" అని ఫోన్ పెట్టేసి మావైపు తిరిగి "తన పూజకి టైం అవుతుందంట

మీ అమ్మ మిమ్మల్ని ఇంటికి వచ్చేయమందిరా.. మరి జాగ్రత్తగా వెళ్ళగలరా?" అనడిగింది..

"ఎందుకెళ్ళము అమ్మమ్మా.. ఎప్పుడూ వెళ్ళినట్లే పక్కనే నడుచుకుంటూ వెళ్ళిపోతాము" అని నేను, నానీ గెంతుకుంటూ బయటికొచ్చి చెప్పులు వేసుకుంటుంటే "అదిగో ఆ పరుగులే వద్దు.. నిదానంగా ముందూ వెనకా చూసుకుంటూ వెళ్ళండి" అమ్మమ్మ గట్టిగా చెప్పింది.

మేమిద్దరం చేతులు పట్టుకుని కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నాం.. మధ్యమధ్యలో కొంతమంది ఆంటీలు ఆగి నానీని చూసి "చిన్ని కృష్ణుడు భలే ముద్దుగా ఉన్నాడు" అని బుగ్గలు పిండి వెళ్తున్నారు.

అంతలో ఒక సైకిల్ అబ్బాయి స్పీడ్ గా మావైపే వచ్చేస్తుంటే మా ఇద్దరికీ భయం వేసి అక్కడే నిలబడిపోయాం.. ఆ అబ్బాయి సైకిల్ని అటూ ఇటూ ఊపేస్తూ నా పక్కనే వచ్చి ఢామ్మని పడ్డాడు. అటు జరగబోయి పట్టులంగా అడ్డుపడి నేనూ ఢామ్మని పడ్డాను.. ఆ అబ్బాయి వెంటనే లేచి నన్ను కూడా లేవదీసి నా బట్టలకి అంటిన మట్టి దులుపుతూ "సారీ పాపా, నా సైకిల్ బ్రేక్ పనిచెయటంలేదు.. దెబ్బలు తగిలాయా నీకు?" అనడిగాడు.

నేను తల అడ్డంగా ఊపితే, "నిజంగా సారీ అమ్మా.. ఈ అబ్బాయి మీ తమ్ముడా? చాలా ముద్దొస్తున్నాడు..ఇదిగో ఈ చాక్లెట్లు తీసుకోండి.. తింటూ ఇంటికెళ్ళండి" అని జేబులోంచి చాలా కాడ్బరీ చాక్లెట్లు తీసి ఇచ్చాడు.

"వద్దండీ.. వేరే వాళ్ళిచ్చినవి తీసుకుంటే మా అమ్మ తిడుతుంది" అని నేను నానీ చెయ్యి పట్టుకుని గబగబా లాక్కెళ్ళిపోయాను.

ఇంటికి వెళ్ళగానే అమ్మ "అమ్మయ్యా, వచ్చేశారా! ముందు వెళ్ళి కాళ్ళు కడుక్కురండి" అని మేమొచ్చాక నానీతో మా ఇంట్లో కూడా అడుగులు వేయించింది.. తర్వాత "బయటకి వెళ్ళకండి. హారతి తీసుకోవాలి" అని పూజ చేసుకోవడానికి వెళ్ళిపోయింది.. కాసేపైన తర్వాత గంట మోత వినబడగానే అమ్మ పిలవకుండానే మేమిద్దరం పూజ గదిలోకి పరిగెత్తాం.

హారతి కళ్ళకద్దుకుని, దేవుడికి దండం పెట్టుకోగానె అమ్మ ప్రసాదం పళ్ళెంతో రెడీ గా ఉంది. లడ్డూని సంగం చేసి నా చేతిలో పెట్టగానే నేను నోట్లో వేసుకోబోతుంటే "అదే వద్దనేది.. కళ్ళకద్దుకో ముందు" అని చేతిని పట్టి ఆపేసింది.

ఇంకో సగం నానీకి ఇవ్వబోతూ మళ్ళీ నావైపు తిరిగి "సిరీ, నీ గొలుసేమైంది?" అనడిగింది.. నేనూ మెడ మీద చెయ్యి పెట్టుకుని చూసా.. గొలుసు తగల్లేదు!!

"ఏమో అమ్మా" అంటే "ఏమో ఏంటే! అమ్మమ్మ వాళ్ళింట్లో ఏమైనా తీసావా?" అని అడుగుతూ గబగబా అమ్మమ్మకి ఫోన్ చేసింది.

"అసలు తీయలేదా? అయితే కాస్త ఇల్లంతా వెతుకమ్మా.. నేను కూడా ఇక్కడ వెతుకుతాను" అని నన్నూ, నానీని టీవి రూంలో వెతకమని తను ఇంటి ముందు వెతకడానికి వెళ్ళింది.

ఇల్లంతా వెతికాము అయినా ఎక్కడా కనబడలేదు.. అంతలో అమ్మమ్మ, తాతయ్య కూడా వచ్చేసారు.. "మా ఇంట్లో ఎక్కడా లేదే తల్లీ. అయినా నాకు బాగా గుర్తు, బయలుదేరినప్పుడు దీని మెడలో గొలుసు చూసినట్లు.. వచ్చేటప్పుడు దారంతా చూసుకుంటూనే వచ్చాము.. మధ్యలో ఎక్కడైనా జారిపడిందేమోనని" అని చెప్పారు.

నాన్న లోపలికొస్తూనే మమ్మల్ని చూసి "ఏంటీ హడావిడి?" అనడగగానే అమ్మ నా గొలుసు సంగతి చెప్పింది.

నాన్న నన్ను పక్కకి లాగి "సిరీ సరిగ్గా గుర్తు తెచ్చుకో.. ఆటల్లో ఎక్కడన్నా గొలుసు పట్టేసినట్లు అనిపించిందా?" అన్నారు.. నేను తల అడ్డంగా ఊపాను.

"మరైతే రోడ్డు మీద వచ్చేటప్పుడు పరుగులు పెట్టుకుంటూ వచ్చారా?" అంటే నేను "లేదు నాన్నా, ఇద్దరం చేతులు పట్టుకునే నడుచుకుంటూ వచ్చాము" అన్నాను.

పక్కనించి నానీ "కానీ ఆ సైకిలబ్బాయి గుద్దినప్పుడు పడ్డావు కదక్కా" అన్నాడు.

వెంటనే అందరూ "ఏ సైకిలబ్బాయి?" అనడగగానే నానీ అంతా చెప్పి "ఆ అబ్బాయి చాక్లెట్లు ఇచ్చినా వద్దని అక్క నన్ను లాక్కొచ్చేసింది నాన్నా" అన్నాడు.

"అయితే గొలుసు ఖచ్చితంగా అక్కడే పడి ఉంటుంది" అని అమ్మ అనగానే నాన్న "ఇంకెక్కడ గొలుసు! ఈ పాటికి ఆ రాస్కెల్ ఏ మార్వాడీ దగ్గరో దాన్ని అమ్మేసి ఉంటాడు" అన్నారు.

అమ్మమ్మ తాతయ్య వెంటనే "అవును ఖచ్చితంగా ఆ దొంగ వెధవ పనే ఇది.. లేకపోతే వాడి దగ్గర టైంకి చాక్లెట్లు ఎలా వస్తాయి!?" అని అంటుంటే అమ్మేమో "అప్పటికీ నాన్నగారు వచ్చేదాక ఆగమని నువ్వు చెప్పినా నేనే వినకుండా పంపించేయమన్నానమ్మా.. అంత ఎండగా ఉంది.. పైగా జనాలు ఎప్పుడూ తిరుగుతూనే ఉంటారు.. భయమేముంది అనుకున్నా!" అని చీర కొంగుతో కళ్ళు తుడుచుకుంది.

నాన్నేమో నానీని తీసుకుని ఆ సైకిలబ్బాయి గురించి ఆ సందులో ఉండే కొట్ల వాళ్ళని అడుగుతానని వెళ్ళారు.

"మళ్ళీ అది చేయించాలంటే ఇప్పట్లో అయ్యే పనేనా!" అని అమ్మ దిగులుగా అంటుంటే తాతయ్య "ఉరుకో లక్ష్మీ.. గొలుసు పోతే పోయింది.. పిల్లలు క్షేమంగా ఉన్నారు.. వాడు పిల్లల్ని ఏమైనా చేసుంటే ఏమయ్యేది!?" అని అనగానే అమ్మ వెంటనే నన్ను దగ్గరకి లాక్కుని ముద్దు పెట్టుకుంటూ "నిజమే నాన్నా, వీళ్ళిద్దరికీ ఏం కాలేదు" అంది.

కాసేపాగి నాన్నా, నానీ తిరిగి రాగానే అమ్మమ్మా వాళ్ళు వెళ్ళి పోయారు.. అమ్మ మాకు అన్నం పెట్టి, మా కొత్త బట్టలు బట్టల స్టాండ్ మీద వేస్తూ "సిరీ, నీ పట్టులంగా జరీ చూడు ఎలా పీలికల్లాగా వచ్చేస్తుందో! నీ దగ్గర బట్టలు అస్సలు ఆగవు కదా.. మొన్నటికి మొన్న వైట్ స్కర్ట్ నిండా మచ్చలు చేసుకొచ్చావు" అంటుంటే నాకు వెంటనే ఆ రోజు క్రాంతి చెప్పింది గుర్తొచ్చింది.

'మనది కాని వస్తువుని ఎవరికీ తెలియకుండా తీసుకుంటే దేవుడి మన దగ్గరనించి వేరేవాళ్ళు మనకిష్టమైంది తీసేసుకునేట్లు చేస్తాడు'!

'అవును అందుకే ఇవాళ నాకిష్టమైన బారు గొలుసు పోయింది.. అమ్మ ఏడ్చింది పాపం.. నా వల్లే జరిగింది' అనుకున్నా.. మళ్ళీ అరటిపువ్వు కోసిన రోజు అనిపించినట్లే భయం వేసింది.. ఇంక ఏడుపు కూడా బాగా వచ్చేసింది.

నేనలా గట్టి గట్టి గా ఏడుస్తుంటే అమ్మా నాన్నా ఇద్దరూ నా దగ్గరికి వచ్చేసి "ఏమైంది ఏమైంది" అని అడుగుతున్నారు.. నాన్నేమో "భయపడినట్లుంది" అంటే "తల్లీ, పిచ్చి గొలుసు పోతే పోయింది.. ఏడవకు... నువ్వు మా దగ్గరే ఉన్నావు కదా.. అస్సలు భయం లేదు ఇంక" అని అమ్మ చెప్తుంటే నేను "అది కాదు.. నేను.. నేను దొంగతనం చేసాను.. అందుకే దేవుడు నా గొలుసు పోగొట్టాడు" అని ఇంకా పెద్దగా ఏడవటం మొదలు పెట్టాను.

"దొంగతనం ఏమిటీ?" నాన్న అమ్మ వంక చూస్తూ అడిగారు.. "నాకేం తెలుసు? దాన్నే అడగండి" అని "సిరీ ఏం దొంగతనం చేసావే?" కోపంగా అంది.

నేను శ్రీలతతో కలిసి అరటిపువ్వు కోసుకొచ్చిన సంగతంతా చెప్పాను.. "అయితే స్కర్ట్ మీద పడినవి బురద మరకలు కాదా!" అని అమ్మ ఇంకా కోపంగా ఏదో అనబోతుంటే నాన్న "సర్లే ఏడుపు ఆపి వెళ్ళి పడుకో.. రేపు మాట్లాడదాం" అన్నారు.. నేను అయినా ఏడుస్తానే ఉన్నా.

"ఏడుపు ఆపమని చెప్పింది నీక్కాదూ" అని నాన్న గట్టిగా అరవగానే నాకు భయం వేసి ఠక్కున ఆపేసి నా మంచం దగ్గరికి వెళ్ళిపోయా.

తర్వాత రోజు స్కూల్ నించి ఇంటికొచ్చేసరికే నాన్న ఇంట్లో ఉన్నారు.. మమ్మల్ని చూస్తూనే 'సిరీ, బట్టలు మార్చుకుని ఇటా"

అన్నారు.. కోపంగా ఉన్నారని అర్థం అయిపోయింది!

నేను వెళ్ళగానే "చేతులు కట్టుకుని నించో" అని "నువ్వు చేసింది ఒక తప్పు కాదు, రెండు! ఏంటో తెల్సా" అనడిగితే తెలీదన్నట్లు తల అడ్డంగా ఊపాను.. కాళ్ళు అయితే ఒకచోట ఉండటంలేదు.

"దొంగతనం.. అబద్ధం చెప్పడం" అని మళ్ళీ నాన్నే చెప్పారు.. "ఎన్నిసార్లు చెప్పాను.. నీది కాని వస్తువు మీద చెయ్యి వేయొద్దని! అయినా ఆడుకోవడానికి అలా చెట్లలోకి పుట్లలోకి వెళ్ళాల్సిన అవసరం ఏమొచ్చింది!! పైగా ఇంటికొచ్చి ధైర్యంగా మాతోనే అబద్ధమా, బురదలో పడ్డానని!" అని నాన్న మొహం కోపంగా పెట్టి మాట్లాడుతుంటే నాకు కళ్ళల్లోంచి నీళ్ళు కారిపోతున్నాయి.

"ఆ మరకలు పోగొట్టడానికీ, మళ్ళీ గబగబా కొత్త స్కర్ట్ కుట్టించడానికీ మీ అమ్మ ఎంత హైరానా పడిందో నీ కళ్ళతో చూస్తూనే ఉన్నావు. అయినా నోరు తెరిచి అసలు జరిగింది ఇదని చెప్పావా.. లేదు!" ఇంకా గట్టిగా అరిచారు.

నాన్నకి బాగా అంటే బాగా కోపం వచ్చిందని తెలిసిపోయింది నాకు. "సారీ నాన్నా, ఇంకెప్పుడూ అబద్ధం చెప్పను. ప్రామిస్" అని ఏడుస్తూనే చెప్పాను.

"ఇంత లేరు అప్పుడే ఈ ప్రామిస్‌లొకటి! ముందా ఏడుపాపి మొహం కడుక్కుని రా" అన్నారు. అక్కడ నించి వెంటనే పరిగెత్తాను.

నీళ్ళ పంపు దగ్గరే కావాలనే మొహం 4 సార్లు కడుక్కుని, కాళ్ళు కూడా మళ్ళీ కడుక్కున్నా.. ఇంట్లోకి వెళ్ళాలంటే నాన్న కోపంగా ఉన్న మొహమే గుర్తొస్తుంది.

నెమ్మదిగా వెనక నించి వెళ్ళబోతే వంటగదిలో నాన్న అమ్మతో అంటున్నారు "ఒకటీ రెండు దెబ్బలు తప్ప ఎప్పుడన్నా వీళ్ళని చితకబాదడం.. భయపెట్టడం లాంటివి చేసామా అసలు! వాళ్ళల్లో కలిసిపోయి మంచీ చెడ్డా నేర్పిస్తామే! అయినా మన దగ్గర చిన్న చిన్న విషయాలు కూడా దాచే రోజు వచ్చిందంటే నాకు బాధగా ఉంది".

నిజమే కదా! ఎప్పుడన్నా చిన్నగా కోప్పడటం తప్ప అమ్మా నాన్నా మమ్మల్ని ఎప్పుడూ కొట్టరు.. మా రేఖా వాళ్ళ నాన్న గారైతే ఎదైనా తప్పు చేస్తే చాలు బెత్తం పట్టుకుని కొడతారు.. అసలు అంతా క్రాంతి వల్లే జరిగింది! తనే వాళ్ళ బామ్మ గారు చెప్పినవన్నీ నాకు చెప్పి నన్ను భయపెట్టేసింది.. తనేమి అనకపోతే ఆ రోజు ఇంటికి రాగానే అమ్మకి మరకల గురించి చెప్పేసేదాన్ని.. అవును తప్పంతా క్రాంతిదే!! నాకు కొంచెం భయం తగ్గింది. నాన్నకి ఇంకెప్పుడూ ఇంత కోపం తెప్పించనుగాక తెప్పించను అనుకున్నా.

నాన్న మళ్ళీ పిలిచి "ఇంతకీ నీ పనిష్మెంట్ ఏంటో తెల్సా? వారం రోజులు ఇంటికి రాగానే టేబుల్స్, 2 పేజెస్ కాపీ రైటింగ్ రాసి నాకు చూపించాలి.. మళ్ళీ అబద్ధం ఆడినట్లు తెల్సిందో ఈసారి ఇలా టేబుల్స్ రాయించను.. వీపు చిట్లిపోతుంది జాగ్రత్త" అన్నారు.

"అలాగే నాన్నా" అని తల ఊపి నేను నా బుక్స్ తెచ్చుకోవడానికి వెళ్తుంటే నాన్నే "ఇంకో విషయం.. నిన్న నీ గొలుసు పోయినదానికి, నువ్వు చేసిన పనికీ అస్సలు సంబంధం లేదు.. అలాంటి పిచ్చి పిచ్చి ఆలోచనలు మానెయ్యి" అన్నారు.

టేబుల్స్ రాసుకుంటుంటే నాకు అనిపించింది 'ఇంతకీ నాన్నకి నేను అరటిపువ్వు కోసినందుకు అంత కోపం వచ్చిందా లేక స్కర్ట్‌కి అయిన మచ్చల గురించి చెప్పనందుకు వచ్చిందా!?!?' మరి ఏది పెద్ద తప్పో మాత్రం నాకు తెలీలేదు! ఇవాళ నాన్నని అడిగే ధైర్యం కూడా లేదు.. నా పనిష్మెంట్ అవ్వగానే అడుగుతాను.

నాన్న కాదని చెప్పినా ఈ సంగతి గురించి క్రాంతి వాళ్ళ బామ్మ గారు చెప్పిందే రైటు! పాపం ఆ సైకిలబ్బాయికి తెలీదు, దేవుడు అంతా చూసేసాడని! ఇంకొన్ని రోజుల్లోనే తన దగ్గరనించి కూడా ఏదన్నా పోతుందని!!

# చాలా నేర్చుకోవాలి

ఇవాళ పొద్దునించీ ఒకటే వర్షం.. 'రాక రాక ఇవాళే రావాలా ఈ వర్షం.. దుప్పట్లు ఉతికిద్దామనుకున్నాను.. చీరలకి గంజి పెట్టుకుందామనుకున్నాను" అంటూ అమ్మ విసుక్కుంటూ టివి ముందు కూర్చుండి పోయింది..

శ్రీధర్ ఏదో కొత్త గేం కొనుక్కున్నాడంట.. చూడ్డానికి నానీని రమ్మని పిలిచాడంట.. 'వర్షం ఇంకెంతసేపట్లో తగ్గిపోతుందని' అమ్మని ఇప్పటికే చాలా సార్లు అడిగాడు.. "నా చేతిలో ఏమన్నా స్విచ్ ఉందా రా! నాకెలా తెల్సు కరెక్ట్ గా ఎప్పుడాగిపోతుందో" అని అమ్మ అంటుంటే వరండాలో కొచ్చి నిలబడి "ఇందాకటి కంటే చిన్న చినుకులు పడుతున్నాయి కదక్కా!?" అని అడిగి నేను 'అవును.. కాదు' అని చెప్పేలోపులే మళ్ళీ లోపలికి వెళ్ళిపోతున్నాడు!

నేనూ, నాన్నే వర్షం గురించి ఏమీ అనకుండా ఉన్నాము.. నాన్న పడక్కుర్చీలో ఏదో పుస్తకం చదువుకుంటూ ఉన్నారు.. నేను వరండాలో బల్ల మీద కూర్చుని మెష్ లోనించి వర్షాన్ని చూస్తున్నా.. అహా కాదు కాదు.. పక్కనే ఉన్న కనకాంబరం మొక్కల్లో నించి అప్పుడప్పుడూ బయటకొచ్చి మళ్ళీ ఆ గుబురులోకి వెళ్ళిపోతున్న ఉడుతని చూస్తున్నా..

ఆ చెట్టు గుబురు లో కూడా పాపం బాగా వర్షం పడుతున్నట్లుంది, ఇంకెక్కడైనా దాక్కుందామని చూస్తున్నట్లుంది.. అమ్మ నాకు శ్రీరాముడికి ఉడుత చేసిన హెల్ప్ గురించి చెప్పినప్పటినించి అదంటే చాలా ఇష్టం.. నానీ ఎప్పుడూ పావురాయిలు, కుందేళ్ళని పెంచుకుందామంటాడు.. నాకు మాత్రం ఎంచక్కా ఒక ఉడుతని పెంచుకోవాలనిపిస్తుంది.. బయటకెళ్ళి దాన్ని తెచ్చి ఇక్కడ వరండాలో తడవకుండా ఉంచాలని ఉంది.. కానీ అది నేనెళ్ళి పట్టుకునే వరకూ ఉంటుందా! డింగ్ డింగ్ మని గెంతుకుంటూ వెళ్ళిపోతుంది..

అయినా నేనలా బయటకెళ్ళి వర్షంలో తడిస్తే అమ్మ ఊరుకోదు.. జలుబు చేస్తుందని భయపడుతుంది.. నేను చాలా సార్లు అమ్మని అడిగాను, టెన్ టైమ్స్ వర్షం పడితే నేను ఓన్లీ వన్ టైం వర్షలో తడుస్తానని.. "నీ బేరాలు నా దగ్గర కుదరవు" అంటుంది కానీ అస్సలొప్పుకోదు.. అందుకే ఇక్కడ నిలబడి మెష్ లోనించి చేతులు బయటపెట్టి వర్షంతో ఆడుకుంటాను.

వర్షం అందరికీ ఒకేసారి పడదని చాలా డేస్ క్రితం వరకూ నాకు తెలీదు. అప్పుడెప్పుడో అనిల్ అన్న ఫోన్ చేసినప్పుడు కూడా ఇలానే బాగా వర్షం పడుతుంది.. కానీ వాళ్ళకి మాత్రం ఎండ అంట! నాకర్థం కాక నాన్న ని అడిగాను "వరల్డ్ లో అందరికీ ఒకేసారి వర్షం పడదా?" అని.. అమ్మ అయితే ఒకటే నవ్వు!

అప్పుడే నాన్న చెప్పారు.. ఒక్క వర్షమే కాదు పగలు కూడా అందరికీ ఒకేసారి అవ్వదని!! అంటే మనం రాత్రి పడుకుని నిద్ర పోయేటప్పుడు వేరేచోట స్కూళ్ళకీ, ఆఫీసులకీ వెళ్తారంట! గుండ్రంగా తిరిగే భూమికి సూర్యుడు ఒకవైపే ఉంటాడని, ఇంకా ఏదో ఏదో చెప్పబోతుంటే అమ్మ మధ్యలో వచ్చేసి "అంత చిన్నదానికి మీ ఖగోళ శాస్త్రం ఏమర్థమౌతుందండీ! అది ఇంకాస్త పెద్దదవ్వాలి.. ఐదో తరగతికి వచ్చాక కానీ అవన్నీ కాస్త తలకెక్కుతాయి" అనేసింది.

అమ్మ ఎప్పుడూ అంతే! ఏమడిగినా చాలు, 'నువ్వు చిన్నపిల్లవి నీ కర్థం కాదులే' అనో లేకపోతె 'ఈ పని చెయ్యాలంటే నువ్వు ఇంకాస్త పెద్దవ్వాలి' అంటూ ఏదీ పూర్తిగా చెప్పదు.. చెయ్యనివ్వదు.. పాపం ప్రతిదానికి భయపడుతుంది.

అంతే కాదు మమ్మల్ని స్కూల్లో తీసుకెళ్ళే ఏ పిక్నిక్లకి, ఎక్స్కర్షన్‌లకి వెళ్ళనీయదు.. "ఇంత చిన్నపిల్లలని అలా ఎలా పంపిస్తాము.. ఏదన్నా జరగరానిది జరిగితే!" అంటుంది.

పోయినసారి మా యూనిట్ టెస్ట్ అవ్వగానే మూడు క్లాస్‌ల పిల్లలను కలిపి అమరావతి కి తీసుకెళ్ళారు.. నేనూ, నానీ వెళ్తామని ఎంత బతిమాలినా పంపలేదు.. నాన్న కూడా అన్నారు "వాళ్ళ ఫ్రెండ్స్ తో వెళితే బాగా ఆడుకుంటూ ఎంజాయ్ చేస్తారు.. పొద్దున్న వెళ్ళి సాయంత్రం వచ్చేసేదే కదా.. వెళ్ళనివ్వు" అని..

"ఒక్కరోజైతే మాత్రం ప్రతి నిమిషమూ వీళ్ళని చూస్తూ ఉండలేరుగా.. ఆ లాంచీలవి ఎక్కిస్తారు.. పిల్లలకి నీళ్ళని చూస్తే కాళ్ళు ఆగవు.. ఎందుకొచ్చిన గొడవ, వాళ్ళు వెళ్తే మనతోనే వెళ్తారు" అని అమ్మ గట్టిగా చెప్పేసింది.. తర్వాత సండేనే అందరం కలిసి అమరావతికి వెళ్ళాం.

'వీళ్ళకింకా ఊహ రాలేదు' అని మమ్మల్ని తన చుట్టూనే ఉంచుకుంటుంది.. అప్పుడప్పుడు రేఖా వాళ్ళమ్మ గారితో అంటుంది "మా అమ్మా వాళ్ళు ఇలా దగ్గరే ఉండటం వలన ఈ ఉద్యోగం చేస్తున్నా ప్రశాంతంగా ఉండగలుగుతున్నాను" అని చెప్తుంది.

అమ్మ స్కూల్లో ఇన్స్పెక్షన్ ఉందని, మీటింగ్ ఉందని అప్పుడప్పుడూ మమ్మల్ని అమ్మమ్మ వాళ్ళింట్లో ఉంచేస్తుంది.. అక్కడ మేమెంత గొడవ చేసినా, అటు ఇటూ పరిగెత్తినా వాళ్ళు మమ్మల్ని తిట్టరు.. అక్కడ ఉన్నప్పుడు మా ఇద్దరికీ అమ్మమ్మ ఎప్పుడూ అన్నం తనే కలిపి ముద్దలు చేసి, కథలు చెబుతూ పెడుతుంది..

అమ్మ చూస్తే "వాళ్ళ అన్నం వాళ్ళు తినగలరమ్మా.. నువ్వు మరీ అతి గారాబం చేస్తున్నావు" అంటుంది.. అమ్మమ్మేమో "మందలించే బాధ్యత మీదైతే ముద్దు చేసే పని మాది" అని మాకు అన్నం తినిపిస్తుంది..

నాకూ, నానీ కి కూడా అమ్మమ్మ వాళ్ళు మా ఇంటి దగ్గర ఉండటం చాలా ఇష్టం.. చాలా పండగలకి పిన్ని వాళ్ళు, మామయ్యలు అందరూ వాళ్ళింటికి వస్తారు.. అప్పుడు పిల్లలందరం అక్కడికీ, మా ఇంటికీ మధ్య పరుగులు పెడుతూనే ఉంటాము.. సెలవలు ఇచ్చినప్పుడల్లా ఎవరో ఒకరు వస్తూనే ఉంటారు.. పాపం రేఖా వాళ్ళ అమ్మమ్మ వాళ్ళు, నాన్నమ్మ వాళ్ళు కూడా వేరే వేరే ఊళ్ళల్లో ఉంటారు.. చాలా చాలా రోజులకి గానీ వాళ్ళని చూడటానికి వీళ్ళు వెళ్ళరు.

మా ఇంటికి ఎవరన్నా వచ్చినా, మేము ఎవరింటికన్నా వెళ్ళినా వాళ్ళు "పిల్లలెలా చదువుతున్నారండీ?" అని అడుగుతారు.. అమ్మ వెంటనే "సిరితో అస్సలు బెంగ లేదు.. ప్రతిసారీ క్లాసు ఫస్ట్ వస్తుంది.. నానీ తోనే తలనొప్పి అంతా" అని చెప్పగానే వాళ్ళు "అవునా! సిరీ మరి పెద్దయ్యాక నువ్వేమవుతావు? డాక్టరా? ఇంజనీరా?" అని అడుగుతారు.. నేను "ఏమో తెలీదు" అనేసి నవ్వుతాను.. కానీ నాకు 'విమానం నడిపే డ్రయివర్' అవ్వాలని ఉంటుంది.. అప్పుడు ఎంచక్కా గాల్లోనే ఎగురుతూ ఉండొచ్చు.. మా చిన్నమామయ్య అడిగినప్పుడు ఇలానే చెప్తే అందరూ గట్టిగా నవ్వారు.

మామయ్య కూడా నవ్వుతూనే "విమానం నడిపేవాళ్ళని పైలట్ అంటారమ్మా.. డ్రయివర్ కాదు" అని చెప్పి "అయినా ఇంకా చిన్నపిల్లవి.. అప్పుడే ఎలా తెలుస్తుందిలే" అని నవ్వాడు.. అదిగో మళ్ళీ 'చిన్నపిల్ల' అంటున్నారు!!

నాకు గబగబా పెద్దయి పోవాలని అనిపిస్తుంది ఎప్పుడూ.. అప్పుడైతే అమ్మా నాన్నని ఏది అడిగినా "నీకర్థం కాదులే" అనకుండా అన్నీ చెప్తారు.. ఇంకా నేను సైకిలు తొక్కడం బాగా నేర్చేసుకుని, అమ్మ పంపించే అన్ని కొట్లకీ నానీ తోడు లేకుండా ఒక్కదాన్నే వెళ్ళిపోవచ్చు.. ఇంకాస్త పెద్దయితే చక్కగా కల్పనక్క వాళ్ళ లాగా రంగు రంగుల బట్టలు వేసుకుని కాలేజీకి వెళ్ళొచ్చు.. ఇంకా టివి కూడా చాలాసేపు చూడొచ్చు.. ఇవన్నీ అమ్మతో అంటే బాగా నవ్వేసి "ఎదగడానికెందుకే తొందర" అని ఏదో పాటలా పాడుతుంది.

కానీ మొన్నొకరోజు నేను స్నానం చేసాక దేవుడికి దండం పెట్టుకుంటుంటే నాన్నతో అంటుంది "ఇదివరకు ఎప్పుడో ఒకరోజు ఇలా దండం పెట్టుకునేది.. ఈ మధ్య ఏంటో రోజూ పెట్టుకుంటుంది.. చూస్తుండగానే ఇది పెద్దదై పోతుంది.. చూడండి ఇదివరకటిలా ఓ ఇల్లంతా గెంతులు వేస్తూ పరిగెత్తటం లేదు.. మీరు తెచ్చే ఆ పిల్లల పుస్తకాలు అస్సలు వదలటం లేదు!"

నాన్న "అన్నీ నా పోలికలే.. ఇప్పటినించే పుస్తకాలు వదలటం లేదు" అంటున్నారు. నిజమే.. నాన్న 'చందమామ' 'బాలజ్యోతి'

'కిడ్స్ వరల్డ్' అని బుక్స్ తెస్తున్నారు.. అందులో రాజుల కథలు, కాకి, నక్క కథలు చదువుతుంటే భలే ఉంటుంది.. ఇప్పుడు అమ్మకి ఖాళీ ఉన్నా లేకపోయినా కథ చెప్పమని వెంట పడటంలేదు.. నేను చదివి నానీకి కూడా చెప్తున్నా.

నానీ గుడ్ బోయ్ లానే ఉంటాడు కానీ ఒక్కోసారి చాలా కోపం తెప్పిస్తాడు.. నేనేది చేస్తే తనూ అదే పని చేయాలంటాడు.. ఒకసారి నేనూ, రేఖా బంకమట్టితో బొమ్మలు చేసుకుంటుంటే నేనూ చేస్తానని వచ్చాడు.. 'నీకు చేతకాదు ముందు మమ్మల్ని చూసి నేర్చుకో' అంటే వినకుండా తనూ మట్టి ముద్ద తీసుకుని అబ్బాయి బొమ్మ చేయడం మొదలుపెట్టాడు.. కానీ ఆ ముద్దలో ఎక్కువ నీళ్ళు పోసాడేమో అది జారిపోతూ అస్సలు బొమ్మ రావటం లేదు.. మళ్ళీ ఇంకాస్త మట్టి కావాలంటాడు.. రేఖా, నేనూ ఇవ్వనంటే ఇవ్వనన్నాము.. అంతే! గభాల్న లేచి "మీ డొక్కు మట్టి నాకేమి వొద్దు" అని తన మట్టి ముద్ద మా వైపు విసిరేసి పోయాడు.. అదేమో మా మీదకి చింది మా బట్టల మీద పడింది..

నేను వెంటనే పరిగెత్తుకెళ్ళి వాడిని గట్టిగా గిచ్చి వచ్చాను.. మేము కొట్టుకున్నప్పుడల్లా వాడు పిడికిలి బిగించి గుద్దుతాడు.. భలే నెప్పి వేస్తుంది అసలు.. అంత బక్కగా ఉంటాడా, కొట్టేప్పుడు అసలు అంత బలం ఎక్కడినించి వస్తుందో మరి!! నేను కూడా అలానే కొడితే వాడికస్సలు తగలదనుకుంటా, నవ్వుతానే ఉంటాడు! అందుకే నేనైతే గట్టిగా గిల్లడమో, కొరకడమో చేస్తాను!

వాడు గుద్దిన దెబ్బలు కనిపించవు కానీ నేను గిల్లినవి, కొరికినవి కనబడతాయి కదా.. అంతే, పెద్దగా ఏడ్చుకుంటూ అమ్మ దగ్గరకో, నాన్న దగ్గరకో వెళ్తాడు.. ఇంక ఇద్దరూ నన్నే తిడతారు.. వాడు కూడా కొట్టాడంటే "మరి నువ్వు కూడా అలానే కొట్టు కానీ ఇలా గిచ్చితే, కొరికితే వంట్లోకి విషం చేరుతుంది తెలుసా!" అని తిడతారు.. వాడిని కూడా "అక్కని కొట్టడం తప్పు కాదూ" అని తిడతారు.

ఒకసారైతే నేను ఏదో బొమ్మ గీసుకుంటుంటే నానీ కూడా బొమ్మ గీస్తానని పేపర్ తెచ్చుకుని కూర్చున్నాడు.. ఏవో రెండు మూడు గీతలు గీసి నా చేతిలో ఉన్న ఆరెంజ్ కలర్ పెన్సిల్ కావాలని అడిగాడు.. నేను కలర్ వేస్తున్నాను వేరే దానితో గీసుకో అంటే వినలా.. అదే కావాలని కూర్చున్నాడు.. నాకు బాగా కోపం వచ్చి నేనసలు ఈ కలర్ నీకివ్వనే ఇవ్వను అని చెప్పాను.. కాసేపు కాళ్ళు రెండూ నేలకి కొడుతూ పేచీ పెట్టాడు.. నేను వేరే వైపు తిరిగి కలర్ వేసుకుంటుంటే ఉన్నట్టుండి నా చేతిలోనించి ఆ పెన్సిల్ లాక్కుని పరిగెత్తాడు.

నేనూ వాడి వెనకాలే పరిగెత్తాను.. మా సందులో ఒకళ్ళు ఇల్లు కట్టుకుంటున్నారు.. అక్కడ ఇసుక, కంకర రాళ్ళు, గులరాళ్ళు పెద్ద పెద్ద కుప్పల్లాగా వరుసగా పోసి ఉన్నాయి.. వాడు ఒక్కో కుప్ప ఎక్కి దిగి వెళ్తుంటే నేనూ వాడి వెనకాలే ఆ కుప్పలు ఎక్కుతూ గులకరాళ్ళ కుప్ప మీద రాళ్ళు గుచ్చుకుని పడిపోయాను.. ఆ రాళ్ళన్నీ మోకాలికి గుచ్చుకుని ఎంత నొప్పి వేసిందో! వాడేమో దూరంగా నించుని "రా పట్టుకో" అని పెద్దగా నవ్వుతున్నాడు.. నాకైతే ఎంత కోపం వచ్చిందో! అంతే, ఒక రాయి తీసుకుని వాడి వైపుకి గట్టిగా విసిరేసాను!

అది వెళ్ళి వాడి తలకి ఠంగ్ మని కొట్టుకుంది.. ఇక వాడు కలర్ పెన్సిల్ అక్కడే పడేసి ఏడుస్తూ ఇంటికి పరిగెత్తాడు! నేను ఆ పెన్సిల్ తీసుకుని కుంటుకుంటూ వెళ్ళాను.. చేతులు ఊపుకుంటూ అమ్మకి ఏంటో చెప్తున్నాడు.. నన్ను చూడగానే అమ్మ "సిరీ, పెద్దదానివయ్యుండి వీడితోపాటు సమానంగా అల్లరి చేస్తున్నావుగా! రాయితో కొట్టడం ఏంటసలు? రక్తం చూడు ఎలా కారుతుందో.. నుదుటి మీద తగిలింది కాబట్టి సరిపోయింది.. అదే కాస్త కిందగా కంటికి తగిలితే ఏం కావాలి! మీ నాన్న రానీయండి అసలు.. ఆయనే చెప్తారు మీ పని" అని నానీ ని పంపు దగ్గరకి తీసుకెళ్ళి దెబ్బ తగిలినచోట కడుగుతుంటే వాడు ఇంకా గట్టిగా ఏడవటం మొదలుపెట్టాడు.

'వాడికసలు పెద్ద దెబ్బేమి తగల్లేదు.. బ్లడ్ కొంచెం అంటే కొంచెమే కనిపిస్తుంది.. అయినా ఎంత వేషాలేస్తున్నాడో!' అనుకుంటూ నేను లోపలికి వెళ్ళబోతుంటే వెనకనించి అమ్మ 'నీకేమైంది అలా కుంటుతున్నావు?" అని అడిగింది.. నేను గులకరాళ్ళ మీద పడ్డానని

చెప్పగానే నా కాళ్ళు చూసి "ఆ దెబ్బలేమిటసలు.. రోజు రోజుకీ ఇద్దరూ పిల్ల రాక్షసుల్లా తయారవుతున్నారు" అంది.. నాక్కూడా దెబ్బలన్నీ కడిగి, మా ఇద్దరికి మందు రాసి అన్నం పెడుతుంటే నాన్న వచ్చారు.

వెంటనే మా పోట్లాట గురించి చెప్పింది.. నాన్న ఏమో "ఇక లాభం లేదు.. వీళ్ళిద్దరినీ హాస్టల్లో చేర్పించేద్దాం.. ఉన్నది ఇద్దరే కానీ, కలిసి ఉండటం అస్సలు తెలీదు.. అక్కడ వందల మంది మధ్య ఉంటే గానీ అక్కంటే, తమ్ముడంటే విలువ ఏంటో అర్ధ కాదు! రేపే వెళ్ళి స్కూల్లో అప్లికేషన్స్ తెస్తాను" అన్నారు.

అమ్మో! హాస్టలా!! నాకు మా క్లాసులో భవాని గుర్తొచ్చింది. వాళ్ళ అమ్మా నాన్న గారు ఏదో ఊళ్ళో ఉంటారు.. భవానీని, వాళ్ళ తమ్ముడిని మా స్కూల్ హాస్టల్ లో చేర్పించారు.. పాపం అక్కడ వాళ్ళకి పెట్టే అన్నం సరిపోదంట.. ఎప్పుడూ ఆకలేస్తుంది అంటుంది.. అందుకే అమ్మ తినడానికి చేసేవి అప్పుడప్పుడూ తనకి పొట్లం కట్టుకొచ్చి ఇస్తాను.. వాళ్ళ ఊరి నించి ఎవరన్నా వచ్చినప్పుడు పెద్ద పెద్ద సంచీల్లో తనకి, వాళ్ళ తమ్ముడికి తినడానికి ఏవేవో తెస్తారు కానీ అవి రెండురోజుల్లో అయిపోతాయంట.. అలా ఎలా అంటే తను లేనప్పుడు తన పెట్టెలోంచి దొంగతనం చేస్తారంట! అదే కాదు, ఎప్పుడూ చేతుల మీదా, కాళ్ళ మీదా పుళ్ళు, జడేమో పిచ్చి పిచ్చిగా వేసుకుంటుంది.. ఇంకా ఏంటంటే వాళ్ళ తమ్ముడు, తను క్లాస్కి వచ్చినప్పుడే మాట్లాడుకోవాలి.. అబ్బాయిలకి, అమ్మాయిలకి గదులు వేరే వేరే చోట్ల ఉంటాయిగా.. స్కూల్ అయ్యాక ఇంక కలవనీయరంట!

అదంతా గుర్తొచ్చి నేను "వద్దు నాన్నా, హాస్టల్లో అయితే మమ్మల్ని ఎప్పుడూ కలిసి ఆడుకోనీరు.. మేమెప్పుడూ కొట్టుకోము.. కదా నానీ!" అని నానీ వంక చూడగానే వాడు కూడా "అవును అవును ఇంకెప్పుడూ కొట్టుకోము" అన్నాడు.

"చూస్తాను ఎన్ని రోజులు ఈ మాట మీద ఉంటారో! మళ్ళీ ఇంకొకసారి కొట్టుకున్నారని తెల్సిందా, ఈసారి ఇలా ముందు చెప్పేది లేదు.. తిన్నగా ఇద్దర్నీ తీసుకెళ్ళి అక్కడ వదిలేసి రావటమే!" అనేసి నాన్న వెళ్ళిపోయారు.

అప్పటినించి మేముప్పుడూ దెబ్బలు తగిలేటట్లు కొట్టుకోలేదు! దేని గురించన్నా పోట్లాడుకున్నా అమ్మ గానీ, నాన్న గానీ వస్తున్న శబ్దం అయితే గబుక్కున ఆపేసేస్తాము. తర్వాత నాన్న చాలా సార్లు చెప్పారు మేమిద్దరం మా బొమ్మలు, వస్తువులు అన్నీ ఒకరితో ఒకరు పంచుకోవాలని.. ఒకరితో ఒకరు ప్రేమగా ఉండాలని. "అసలు మీరిద్దరుంటేనే ఇంత గొడవ చేస్తున్నారు, మేము ఐదుగురం చిన్నప్పుడు ఒకే ఇంట్లో ఎంత చక్కగా ఉండేవాళ్ళమో తెలుసా!" అని అన్నారు.

ఇప్పుడు నానీకి క్లాస్ లెసన్స్ ఏమన్నా అర్థం కాకపోతె నన్నే అడుగుతున్నాడు.. నేను అవి ఎప్పుడో చదివేసానుగా అందుకే గబగబా చెప్పేస్తున్నా.. ఒకసారి వాడి క్లాసులో అబ్బాయి పుట్టినరోజని చాక్లెట్లు ఇస్తే, ఒకటి నాకోసం దాచి సాయంత్రం రిక్షాలో ఇచ్చాడు.. నేనైతే అంతకు ముందు ఎప్పుడూ వాడికి అలా తెచ్చివ్వలేదు.. అప్పుడు నేను రాళ్ళ మీద పడినప్పుడు వాడు గట్టిగా నవ్వుతుంటే 'వీడిని వేరే వాళ్ళకి ఎవరికో తమ్ముడిగా ఇవ్వకుండా నాకెందుకు ఇచ్చావు స్వామీ' అని కోపంగా దేవుడితో అనుకున్నా.. కానీ ఇప్పుడు 'నానీ నాకే తమ్ముడని అనుకుంటుంటే చాలా సంతోషంగా ఉంది.

పిన్నిలు, బాబాయిలు, అత్తయ్యలు, మామయ్యలు, పెద్దమ్మ, పెద్దనాన్నలు, ఇంకా అనిల్ అన్నయ్య, కల్పనక్క, పెదబాబు, చినబాబు ఇలా పిల్లలు చాలా మంది అందరం ఒకే కుటుంబంలోని వాళ్ళని నాన్న చెప్తారు.. "ఒకే కుటుంబం అయితే మరి అందరం కలిసి ఒకే ఇంట్లో ఉండాలి కదా నాన్నా" అని అడిగాను..

"వాళ్ళు చేసే పనులు, ఉద్యోగాలు వేరే వేరే ఊళ్ళల్లో ఉన్నాయి కాబట్టి వేరే వేరేగా ఉంటున్నారు.. కానీ పండగలప్పుడు ఎక్కడో ఒకచోట కలుస్తున్నాము.. అలానే అప్పుడు పెద్దనాన్న స్కూటర్ మీదనించి పడిపోయినప్పుడు కాలికి పెద్ద దెబ్బ తగిలితే మనం పెద్దనాన్నని మన ఇంట్లో ఉంచి మంచి డాక్టర్ కి చూపించాము.. అలా ఒకరికొకరు హెల్ప్ చేసుకోవడం మానలేదు కదా! నువ్వూ, నానీ కూడా పెద్దయ్యాక బాగా చదువుకుని వేరే వేరే చోట్లకి వెళ్ళిపోయినా ఇలానే అన్ని విషయాల్లో కలిసి ఉండాలి" అని చెప్పి "ఇలా ముందు మీ

ఇద్దరు ఒకరితో ఒకరు చక్కగా ఉంటేనే బయట మీ ఫ్రెండ్స్ తో, చుట్టుపక్కలవాళ్ళతో మంచిగా ప్రవర్తిస్తారు" అన్నారు.

నాన్న అలా చెప్పిన తర్వాత నించీ నేను ఏ కథ చదివినా ముందు నానీ ని పిలిచి చెప్తాను.. ఇంకా ఎవరేమన్నా ఇస్తే ముందు నానీకి ఇచ్చి వాడిని కొన్నిరోజులు వాడుకోమంటాను.. ఒక్కోసారి తీసుకుంటాడు, ఇంకొన్నిసార్లు "నాకొద్దులే అక్కా నువ్వే ఉంచుకో" అని తీసుకోడు.

వాడికి కూడా చాలా విషయాలు నాకంటే బాగా అర్థమైపోతున్నాయి.. అందుకే ఇంటికొచ్చాక నా కబుర్లన్నీ వాడితోనే! ఇక నాన్న తెచ్చే పుస్తకాల కోసం చూడటం.. అందుకే ఇదివరకులాగా అందరితో బోల్డు మాటలు చెప్పడానికి వీలవడంలేదు.. అమ్మ చెప్పింది వచ్చే సంవత్సరం క్లాసులో నాకు లెక్కలు చాలా కష్టంగా ఉంటాయని.. ఇప్పుడులాగా ఆ౦ నిమిషాల్లో చేసేయడానికి అవదని. అయితే ఎంతసేపు పట్టినా సరే నేను బాగా నేర్చుకుంటాను.. బాగా చదివి తొందరగా పెద్దదాన్నయిపోయి విమానం పైలట్ అవ్వాలి!

'సిరీ, ఏమిటసలు ఉలుకూ పలుకూ లేదు.. అంత దీర్ఘంగా ఇందాకటి నించీ ఆ వర్షాన్నే చూస్తున్నావా!? లోపలికి పద అన్నం తిందువుగానీ" అమ్మ వెనక నించి అనేసరికి నేను అమ్మతో పాటు లోపలికి వెళ్తూ "అమ్మా, నేను ఎంత పెద్దయ్యాక వర్షంలో తడవొచ్చు?" అంటే అమ్మ గట్టిగా నవ్వి 'ఎదగడానికెందుకే తొందర.." అంటూ మళ్ళీ అదే పాట పాడుకుంటూ వంటగదిలోకి వెళ్ళింది.

*చివరిగా ఓ మాట!*

*అమ్మా నాన్నల వెచ్చని రెక్కల కింద రక్షణ, వారి ప్రేమ, ఆప్యాయత, మందలింపులు, అప్పుడప్పుడూ వేసే రెండు మూడు దెబ్బలు, ప్రతి విషయాన్నీ వీలైనంతవరకు విశదీకరించి చెప్పటం... అమ్మమ్మ తాతయ్యల ముద్దు, గారాబం.. చక్కని స్నేహితులు.. ఇదే చిన్నారి సిరి బాల్యం! సముద్రంలో ఉండే బోల్డన్ని నీళ్ళన్నీ ఉప్పగా ఉంటాయని.. అవి దేనికీ పనికిరావనీ, అసహ్యంగా ఉండే గొంగళిపురుగే అందమైన సీతాకోకచిలుకగా మారుతుందని.. తన ఇల్లు, ఆడుకునే పెద్ద గ్రౌండ్, రోడ్లు ఇవన్నీ ఉండే భూమి అసలైతే ఒక పెద్ద బంతిలా గుండ్రంగా ఉంటుందని.. ఇలా కొత్త విషయాలు తెలుసుకున్న కొద్దీ ఇంకా ఏదో తెలుసుకోవాలనే ఉత్సాహం.. చిన్నమామయ్య వాళ్ళ పిల్లలకి కొనే మంచి మంచి బొమ్మలు అమ్మా నాన్న తనకెందుకు ఎప్పుడూ కొనిపెట్టరని.. తనకున్న మంచి బట్టల్లాంటివి సాంబయ్య వాళ్ళ అమ్మాయికి ఎందుకు లేవనే ప్రశ్నలు సిరికి ఎప్పుడూ ఉదయించలేదు.. ఆర్థిక తారతమ్యాల గురించి ఎంతో సున్నితంగా వివరించే తల్లితండ్రులే దానికి కారణం.. చుట్టుపక్కల పరిస్తితుల ప్రభావం పిల్లల మీద ఎంతో ఉంటుంది.. అది ఎలాంటి చెడు పరిణామాలకి దారితీయకుండా ఉండడానికి శ్రద్ధ, క్రమశిక్షణే కాకుండా పిల్లలతో ఎక్కువ సమయం గడిపేలా చూసుకోవడం ఎంతో అవసరం.. తమ పిల్లల మానసిక పరిణితికి చక్కటి శ్రద్ధ తీసుకున్న తన తల్లితండ్రుల వల్ల సిరికి తన బాల్యం ఎంతో అందమైన జ్ఞాపకంగా మిగిలిపోతుందనడంలో సందేహం లేదు!*